www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 27-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 330 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 1.55 తదుపరి చవితి; నక్షత్రం: హస్త పూర్తి; వర్జ్యం: ప.1.59-3.47; దుర్ముహూర్తం: ఉ.8.59-9.46, రా.12.21-11.09; అమృతఘడియలు: రా.12.48-2.36; రాహుకాలం: ప.3.00-4.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు

నాగ్ అశ్విన్



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్‌హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. మున్ముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఇకమీదట ఇలాంటివి వద్దు

మోహన్‌బాబు



'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

అందగత్తెగా అలరించాలనుంది

రాశి సింగ్



'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివకందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. మున్ముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.

- అనుకోకుండా 'భూతద్ధం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను.
- కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్, పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. కథ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ముగింపు ఎలా ఉంటుందో ఎవరూ ఊహించలేరు. శ్రీ చరణ్ పాకాల సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు గర్వంగా ఉంది.
- శివ కందుకూరి గొప్ప వ్యక్తిత్వం ఉన్న హీరో. ఈ సినిమా కోసం చాలా ఓపిగ్గా కష్టపడ్డారు. కుటుంబ నేపథ్యాన్ని పక్కన పెట్టి అందరితో కలివిడిగా ఉన్నారు. పురుషోత్తంరాజ్ స్పష్టత ఉన్న దర్శకుడు. ఏ సన్నివేశం ఎలా తీయాలో, ఎవరి నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలో ఆయనకు అవగాహన ఉంది. సినిమాను ఓ అద్భుతంలా మలిచారు. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడలేదు కాబట్టే మంచి అవుట్‌పుట్ వచ్చింది.
- కథానాయికగా వైవిధ్యమైన పాత్రలు పోషించాలనేది నా కోరిక. మంచి ఎమోషనల్ లవ్‌స్టోరీ చేయాలనుంది. కథ నచ్చితే గ్లామర్ పాత్రల్లో కనిపించడానికి సిద్ధమే. ప్రస్తుతం సుహాస్‌తో 'ప్రసన్న వదనం' అనే చిత్రం చేస్తున్నాను.



గీతాంజలి వస్తోంది

అంజలి టైటిల్ పాత్రలో నటిస్తున్న హారర్ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. 2014లో వచ్చిన 'గీతాంజలి' చిత్రానికి ఇది సీక్వెల్. శివ తుర్లపాటి దర్శకుడు. కోన వెంకట్ కథను అందిస్తూ, నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'గీతాంజలి' ముగింపు నుంచి సీక్వెల్ ప్రారంభమవుతుంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నాం' అని కోన వెంకట్ చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేశ్, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్ రాహుల్ మాధవ్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు. సినిమాటోగ్రఫీ: సుజాత సిద్ధార్థ

హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం

శ్రీవిష్ణు



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్ణార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

హాలీవుడ్ యాక్టర్ కెన్నెత్ మిచెల్ మృతి



ప్రముఖ హాలీవుడ్ నటుడు కెన్నెత్ మిచెల్ (49) కన్నుమూసిన వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2018లో లాటెరల్ స్క్లెరోసిస్ వ్యాధి బారినపడిన కెన్నెత్ చికిత్స పొందుతూ ఈ నెల 24న తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుసాన్ మే, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'కెప్టెన్ మార్వెల్', 'స్టార్‌ట్రెక్' సిరీస్‌లు నటుడిగా కెన్నెత్‌కు మంచి గుర్తింపు తెచ్చాయి.

గామి వింత గమ్యం



విష్వక్‌సేన్ అఘోరా పాత్రలో నటిస్తున్న చిత్రం 'గామి'. మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో దూకుడు పెంచింది. 'గమ్యాన్నే' అంటూ సాగే తొలి గీతాన్ని యూనిట్ ఇటీవలే విడుదల చేసింది. సనాపతి భరద్వాజ పాత్రుడు సాహిత్యం అందించారు. స్వీకర్ అగస్తీ స్వరాలు సమకూర్చడంతో పాటు అనురాగ్ కులకర్ణితో కలసి ఆలపించారు. విద్యాధర్ కులకర్ణి దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. చాందినీ చౌదరి కథానాయిక. ఈ నెల 29న ట్రైలర్ విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విష్వక్‌సేన్, అఘోరాలు దేనినో తీక్షణంగా చూస్తూ కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది.

ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత

- కొన్నాళ్లుగా అనారోగ్యం
- ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస



"చిట్టి ఆయీ హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రుబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయీ హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాతి నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పంకజ్ ఉధాస్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. పద్మశ్రీ, ఇతర అవార్డులు వరించిన పంకజ్ ఉధాస్ శాస్త్రీయ సంగీతాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భారత సంగీతానికి ఆయన వెలుగుదివ్వెగా ప్రధాని అభివర్ణించారు. ఆయన మెలోడీలు తరాలు దాటిపోయాయన్నారు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూరించలేనిదని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా ప్రధాని పేర్కొన్నారు.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

కాన్సెప్ట్ మెప్పించింది



విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ ఆర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు. ఈ గీతానికి భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అజయ్ అరసాద స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చరణ్ మాధవనేని.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 27-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 330 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్


జూన్ నుంచి మూడోస్సారి..!

బీజేపీకి 370 లోక్‌సభ సీట్లు ఖాయం

ఎన్డీయేకి 400 పైనే.. మోదీ ధీమా..

దేశ భవిష్యత్ ఎలా ఉండాలో నిర్ణయించే హక్కు యువతదే: ప్రధాని

రూ.41 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు 12



ఎయిర్‌పోర్టులను తలదన్నేలా

రైల్వేస్టేషన్లు 8

దేశంపై మోదీ ప్రేమకు నిదర్శనం: తమిళిసై

అభివృద్ధి పనులకు సహకరిస్తాం: భట్టి

రాష్ట్రంలోని15 రైల్వేస్టేషన్లలో 231కోట్లతో పనులు.. వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ



సింగరేణి కార్మికులకు రూ. కోటి బీమా పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, భట్టి, పొంగులేటి, శ్రీధర్‌బాబు, తుమ్మల

హామీలపై చర్చిద్దామా!

బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు సీఎం సవాల్

పదేళ్లపాటు సింగరేణి సంస్థ నిర్లక్ష్యానికి గురయింది

వందేళ్లలో జరగనంత విధ్వంసం పదేళ్లలోనే జరిగింది

అప్పులకే ఏటా 70 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి

కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా.. ఔట్‌సోర్సింగ్ పర్సన్

దూలంలా పెరిగినా దూడకున్న బుద్ధి హరీశ్‌కు లేదు

కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారు?

మమ్మల్ని ప్రశ్నించే అర్హత ఎవరికీ లేదు: రేవంత్‌రెడ్డి

సింగరేణి కార్మికులకు రూ.కోటి బీమా పథకం షురూ

నేటి నుంచి హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తుండడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ ఇచ్చిన హామీలు, తమ పార్టీ ఇచ్చిన, అమలు చేస్తున్న హామీలపై చర్చకు సిద్ధమా! అని సవాల్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ముందుకువస్తే.. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి హామీలపై చర్చిద్దామని అన్నారు. బీఆర్‌ఎస్ వాళ్లు మాట్లాడిన

మిగతా 10వ పేజీలో...

తెలంగాణ నుంచి పోటీ చేయండి!

రాహుల్‌ను కోరిన సీఎం రేవంత్?

గృహజ్యోతి, మహాలక్ష్మికి

శ్రీకారం నేడే

200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు, రూ.500కు గ్యాస్‌సిలిండర్ అమలు

సీఎం రేవంత్ చేతులమీదుగా చేవెళ్లలో ప్రారంభించి భారీ సభకు ఏర్పాట్లు 11

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదలవడంతో వేదిక మార్పు

పథకాల ప్రారంభం సచివాలయంలోనే!

షెడ్యూలు ప్రకారమే భారీ బహిరంగ సభ

వర్చువల్‌గా ప్రసంగించనున్న ప్రియాంక

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి 11

సరఫరా చేసే వాహనాలకు ట్రాకింగ్ ఉండాలి

'నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్' రవాణాను అరికట్టాలి

రాబడుల శాఖలు వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి: సీఎం

ఎల్‌ఆర్‌ఎస్‌కు సై! 8

దరఖాస్తుల పరిష్కారానికి అనుమతి.. మార్చి 31లోగా పూర్తి చేయండి

పూర్తి రుసుం చెల్లిస్తే క్రమబద్ధీకరించండి.. పాత నిబంధనలే వర్తింపజేయండి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం.. పెండింగ్ దరఖాస్తులు 25 లక్షల పైనే

జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్

ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ

ఆర్థిక శాఖ ఆమోదం.. ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్!

'గ్రౌండ్ వాటర్'లో గెజిటెడ్, నాన్-గెజిటెడ్ పోస్టుల ఫలితాలు విడుదల



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష తేదీ ఖరారైంది. జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) అధికారులు సోమవారం ప్రకటించారు. 563 గ్రూపు-1 పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కూడా ప్రారంభమైంది. వచ్చేనెల 14 వరకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చు. 2022 అక్టోబరు 16 నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజీ కారణంగా రద్దవ్వగా.. గత ఏడాది జూన్‌లో రెండోసారి నిర్వహించిన

మిగతా 8వ పేజీలో...

ఇక ఆంధ్రాకు ఆడను..

నా తప్పు లేకున్నా.. రాజకీయ నేతల జోక్యంతో కెప్టెన్‌గా వైదొలగమన్నారు

ఆత్మగౌరవంపై ఏపీసీ పెద్దలు దెబ్బకొట్టారు.. క్రికెటర్ విహారి సంచలన ప్రకటన

రంజీ జట్టు 17వ నంబరు ఆటగాడిగా ఉన్న వైసీపీ నేత కొడుకు విషయంలో వివాదం

ఏపీలో క్రికెట్ సహా క్రీడా సంఘాలన్నీ వైసీపీ ఎంపీ విజయసాయి కనుసన్నల్లోనే..



ఆడుదాం ఆంధ్రా.. అంటూ ఏపీలో వైసీపీ ప్రభుత్వం హడావుడి చేస్తుంటే.. ఆ పార్టీ నాయకులు ఏకంగా క్రీడా సంఘాలతోనే ఆటాడుకుంటున్నారు. తాము చెప్పినవారినే టోర్నీకి ఎంపిక చేయాలని.. సూచించినవారినే తుది జట్టులో ఆడించాలంటూ పెత్తనం సాగిస్తున్నారు. వైసీపీ కీలక నేత, ఎంపీ విజయసాయిరెడ్డి క్రీడా సంఘాలన్నిటినీ తన కనుసన్నల్లో నడిపిస్తూ.. విశేష ఆదరణ ఉన్న క్రికెట్‌నూ శాసిస్తున్నారు. ఈ రాజకీయ క్రీడకు అంతర్జాతీయ క్రికెటరైన గాదె హనుమ విహారి బలయ్యాడు. ఓ వైసీపీ నేత కుమారుడి విషయంలో తప్పు లేకున్నా కెప్టెన్సీ తప్పించడంతో మనోవేదనకు గురయ్యాడు. ఇకపై ఆంధ్రాకు ఆడనని తేల్చిచెప్పాడు. 7

బీజేపీ నేత కుమారుడి కొకైన్ 'పార్టీ'

- సొంత హోటల్ రాడిసన్‌లో మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు..
- శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడి కొడుకు వివేకానంద నిర్వాకం
- ఇద్దరు యువతులతో పాటు మొత్తం 9 మంది హాజరు 9
- నేరం ఒప్పుకొన్న వివేకానంద.. అతడితో సహా పలువురి అరెస్టు
- ఇద్దరు బడా వ్యాపారులు, టాలీవుడ్ నిర్మాతకూ లింకులు?



బీఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదు



రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచేసింది

కాంగ్రెస్ హామీలను అమలు చేయలేదు

విజయ సంకల్ప యాత్రల్లో కిషన్‌రెడ్డి

అభివృద్ధికి నిర్వచనం ప్రధాని మోదీ

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్

హైదరాబాద్ సిటీ, ఖైరతాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదని, అది త్వరలో కనుమరుగయ్యే పార్టీ అని, దానికి ఒక్క సీటు ఇవ్వడం కూడా పొరపాటేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను అనేక విధాలుగా దోచుకుందని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీల అమలుకు బడ్జెట్

మిగతా 8వ పేజీలో...



12

చంద్రుడిపై నిద్రలేచిన స్లిమ్

జాబిల్లిపై కఠిన రాత్రిని తట్టుకుని నిలబడిన జపాన్ ల్యాండర్

షేక్ షాజహాన్ అరెస్టుపై స్టే లేదు

సోమవారం కలకత్తా హైకోర్టు స్పష్టత

7 రోజుల్లో అరెస్టు చేస్తాం: టీఎంసీ 12

సందేశ్‌ఖాలీలో మరో టీఎంసీ నేత అరెస్ట్

జ్ఞానవాపిలో పూజలు కొనసాగించుకోవచ్చు

వారాణసీ జిల్లా కోర్టు తీర్పును సమర్థించిన అలహాబాద్ హైకోర్టు 12

సుప్రీంను ఆశ్రయిస్తాం: మసీదు కమిటీ



రమణదీక్షితులుపై

టీటీడీ వేటు

దేవస్థానం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటన 9

ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం

జియర్లు, అర్చకులపై ఆరోపణలతోనే నిర్ణయం



ఖమ్మం ఎంపీగా

పోటీ చేస్తా..

నియోజకవర్గంలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నా 11

కాంగ్రెస్ కోసం నాకంటే కష్టపడ్డ వారెవరు?: వీహెచ్

డెక్కన్ కిచెన్ వివాదంలో

నందకుమార్‌కు నెల రోజుల జైలు

రూ. 2వేల జరిమానా

కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు నిర్ధారణ 9

దగ్గుబాటి కుటుంబీకుల కేసులో హైకోర్టు తీర్పు



ప్రముఖ గజల్ గాయకుడు

పంకజ్ ఉధాస్ కన్నుమూత 11

కొన్నాళ్లుగా అనారోగ్యం

ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తూర్పు

ముగింపులేని యుద్ధం!

ఉక్రెయిన్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన అవ్‌దివ్‌కా నగరం రష్యా సైన్యాల వశమైన తరుణంలో ఉభయ దేశాల మధ్య యుద్ధం మూడోఏడాదిలోకి ప్రవేశించింది. ఈ నగరాన్ని, సమీపంలోని కొన్ని ప్రాంతాలను రష్యా కైవసం చేసుకుంటున్న తీరు గమనించినప్పుడు యుద్ధం గతంలో కంటే ఈ ఏడాది మరింత తీవ్రంకాబోతున్నదన్న సంగతి అర్థమవుతుంది. అవ్‌దివ్‌కా కోసం జరిగిన పోరాటం గత రెండేళ్ళకాలంలోనే అత్యంత తీవ్రమైనది. గత ఏడాది మే నెలలో బహమూత్ స్వాధీనాన్ని అనేక కారణాలరీత్యా దీనితో సరిపోలుస్తున్నారు. సరిపడా ఆయుధాలు లేక ఉక్రెయిన్ ఈ నగరాన్ని వదులుకొని దాని సైన్యం పారిపోవాల్సివచ్చింది. మొత్తం సోవియట్–అఫ్ఘాన్ యుద్ధంలో పాతికవేలమంది సైనికులు మరణిస్తే, కేవలం ఈ నగరం కోసం రష్యా యాభైవేలమంది సైనికులను బలిపెట్టిందని పాశ్చాత్య మీడియా అంటోంది. ఈ నగరం కోసం మూడువందల యుద్ధట్యాంకులు, పదహారువేలమంది సైనికులను రష్యా కోల్పోయిందని రిపోర్టు చేసిన ఒక మిలటరీ బ్లాగర్ ఆ తరువాత ఎందుచేతనో ఆత్మహత్యచేసుకున్నాడు.

వచ్చే ఏడాది చివరికల్లా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కొలిక్కివస్తుందని కొందరు ఆశపడుతున్నారు. కానీ, విజేత లంటూ ఉండని ఎడతెరిపిలేని యుద్ధంగా ఇది మిగిలిపోవచ్చు. అవ్‌దివ్‌కా మాదిరిగా మరో నాలుగైదు కీలకమైన, బలమైన నగరాల స్వాధీనం దిశగా రష్యా ఇప్పుడు వ్యూహాలు రచిస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాలు ఉక్రెయిన్‌ను ఆర్థికంగానూ, ఆయుధపరంగానూ నిలబెట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. మొదటి ఏడాది మిగతా ప్రపంచం కాస్తోకూస్తో స్పందించింది కానీ, ఇప్పుడు ఈ యుద్ధాన్ని స్మరించడమే మానేసింది. ఉక్రెయిన్ ఎంత నాశనమైపోయినా పాశ్చాత్యదేశాలకు పోయిందేమీ లేదు. ఆయుధాలు అమ్ముకోవడానికి, రష్యామీద కక్ష తీర్చుకోవడానికి, పునర్నిర్మాణం పేరుతో రేపు అపార వనరులున్న ఉక్రెయిన్‌ను దోచుకోవడానికి ఈ యుద్ధం ఎంతకాలం సాగినా వాటికి మంచిదే.

రెండేళ్ళ యుద్ధంలో రెండు లక్షలమంది మరణించారు, పదిహేను లక్షల మంది శరణార్థులుగా తరలిపోయారు. డబ్బున్నదేశాలకు నొప్పితెలియలేదు కానీ, ఆహారధరలు పెరిగి, ఆర్థికవ్యవస్థలకు దెబ్బతగిలి వర్ధమానదేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రపంచవాణిజ్యం దెబ్బతిన్నది, ఇంధనధరలు పెరగడంతో ఆహారకొరత ఏర్పడింది. ఐక్యరాజ్యసమితి అధినేత ఎప్పటిలాగానే మరోమారు భద్రతామండలి సమావేశంలో పెద్దదేశాలకు ఏవో హితవులు చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధపర్యవసానాలను ప్రపంచమంతా అనుభవిస్తున్నదని, శాంతియుత పరిష్కారం దిశగా ప్రయత్నాలు ఆరంభించమని అన్నారు. ఆ చెవితో విని ఈ చెవితో వాటిని వదిలేసిన పాశ్చాత్యదేశాలు యుద్ధానికి రెండేళ్ళు ముగియడం, పుతిన్ వ్యతిరేకి అలెక్సీ నావెల్నీ జైలుహత్య సందర్భాలను కలిపి ఒకేమారు ఏకంగా ఆరువందల రకాల ఆంక్షలతో రష్యామీద కక్షతీర్చుకోవడానికి సిద్ధపడ్డాయి.

అమెరికా సాయం లేకపోతే ఉక్రెయిన్ కదనరంగంలో ఇంతకాలం నిలువగలిగేది కాదు. యుద్ధం ఆరంభమైన కొత్తలో రాజధాని కీవ్ మూడురోజుల్లోనే రష్యా చేతిలోకి వస్తుందని అంతా అనుకున్నారు. మొదట్లో రష్యా అతివేగంగా అనేక ప్రాంతాలను స్వాధీనంచేసుకున్నప్పటికీ, ఆ తరువాత ఉక్రెయిన్ ప్రతిఘటనతో కొన్నింటిని తిరిగికోల్పోవలసి వచ్చింది. వేలాదిమంది సైనికులను బలిపెడుతూ, ప్రత్యేక సైనిక నియామకాలు చేపడుతూ రష్యా ఈ యుద్ధాన్ని కొనసాగిస్తోంది. అసమ్మతిని అణచివేయడానికి, మరోమారు అధ్యక్షుడు కావడానికి పుతిన్‌కు ఈ యుద్ధం ఉపకరిస్తుంది. ముడిచమురు అమ్మకాలు రికార్డుస్థాయిలో ఉంటూ ఈ యుద్ధం రష్యాను ఆర్థికంగా మరింత బలోపేతం చేసింది కనుక దానిని ఎంతకాలమైనా కొనసాగించగలిగేంత బలంగా పుతిన్ ఉన్నారు. ఉక్రెయిన్‌కే తన భవిష్యత్తు అర్థంకావడం లేదు. తూర్పున ఉక్రెయిన్ దెబ్బతినడానికి తాము సకాలంలో సాయం చేయకపోవడమే కారణమని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అంగీకరిస్తూ, రిపబ్లికన్లనూ, కాంగ్రెస్‌ను తప్పుబడుతున్నారు. 'ఆయుధాల కృత్రిమ కొరత' అని ఆడిపోసుకుంటూ మరిన్ని ఆయుధాలకోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అమెరికాకు విజ్ఞప్తులు చేస్తున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించడానికి సిద్ధమే కానీ, మాకు మేముగా ఆ చొరవ తీసుకోబోమని భారత్ ప్రకటించిన నేపథ్యంలో, ఆ రకమైన ప్రతిపాదనలు, ప్రయత్నాలు కూడా ఎటునుంచీ లేనందున ఈ యుద్ధం మరికొన్ని ఏళ్ళపాటు ఇలా వార్షికోత్సవాలు జరుపుకుంటూనే ఉండవచ్చు.

గ్లోబల్ లీడర్స్‌లో అగ్రగామి

ప్రపంచంలో నరేంద్రమోదీకి మించిన జనాదరణ గల అంతర్జాతీయ నేత మరెవరూ లేరని అమెరికాకు చెందిన గ్లోబల్ డిసిషన్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ మార్నింగ్ కన్సల్ట్ మరోసారి ప్రకటించడం ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ విషయం. ప్రతి రెండు నెలలకూ సర్వే జరిపే ఈ సంస్థ నరేంద్రమోదీకి 78 శాతం ఆమోద యోగ్యత ఉన్నదని వెల్లడించింది. మోదీకి దరిదాపుల్లో మరే దేశ నేత కనపడకపోగా, మెక్సికో, అర్జెంటీనా అధ్యక్షుల జనాదరణ 65 శాతంలోపే ఉన్నది. మోదీకి జనాదరణ గల అంతర్జాతీయ నేతల్లో ప్రథమ స్థానం దక్కగా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 11వ స్థానంలోనూ, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో 17వ స్థానంలోనూ, బ్రిటన్ ప్రధాని రిషీ సునక్ 20వ స్థానంలోనూ ఉన్నారు. రెండు నెలల క్రితం ఈ ఏజెన్సీ సర్వే జరిపినప్పుడు కూడా మోదీ 76 శాతం ఆధిక్యతతో అగ్రస్థానం సాధించారు. ఏ ప్రాతిపదికన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ ఈ ఫలితాలు ప్రకటిస్తోంది? ఆధునిక దేశాల్లో నేతలు వివేకవంతంగా, వేగంగా, మెరుగైన విధంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రాతిపదికగా ఈ సంస్థ నేతల పనితీరును బేరీజు వేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి ఆధునిక కొలమానాలు, హై ఫ్రీక్వెన్సీ డాటాను జోడించి ఏ దేశ నాయకుడు మెరుగైన, వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని అక్కడి ప్రజలు భావిస్తున్నారో సమాచారం సేకరిస్తుంది.



▪ వై. సత్యకుమార్
సత్యకాలమ్

దేశ అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం విషయంలో మోదీలా త్వరితగతిన వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నేత ఎవరూ లేరని చెప్పేందుకు గత ఆరునెలలుగా రూ. లక్షల కోట్ల మేరకు మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్న తీరే నిదర్శనం. సోమవారం ఒక్క రోజే ఆయన దేశంలో రూ. 41వేల కోట్ల విలువైన 2వేల రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అంతకు ఒక్క రోజు ముందు వైద్య, రహదారి, రైల్వే, ఇంధన, పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక రంగాలకు చెందిన రూ 48,100 కోట్ల మేరకు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేశారు. ఇందులో మంగళగిరిలో ఎయిమ్స్‌తో పాటు అయిదు ఎయిమ్స్‌లు ఉన్నాయి. విశాఖపట్టణంలో ఐఐఎం, తిరుపతిలో ఐఐటి, కర్నూల్‌లో ట్రిబుల్ ఐటీ కూడా మోదీ ప్రారంభించిన ఉన్నత విద్యాసంస్థల్లో ఉన్నాయి. అదే రోజు ద్వారకలో ఆయన రూ. 4150 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. దేశంలో అతి పొడవైన ద్వారకా సేతును ప్రారంభించడమే కాక. సముద్రంలో మునిగిపోయిన పురాతన ద్వారకా నగరిని సందర్శించేందుకు సముద్ర గర్భంలో మునిగి పూజలు జరపడం మోదీ సాహసానికి, భక్తి శ్రద్ధలకు నిదర్శనం. 73 సంవత్సరాల వయస్సులో ఆయన స్కూబా డైవింగ్ చేసి సముద్ర గర్భానికి చేరుకుని సుదీర్ఘ సమయం గడపడం చిన్న విషయం కాదు. 'నేను పురాతన ద్వారకా నగరిని సందర్శిస్తున్నప్పుడు నా కళ్ల ముందు 21వ శతాబ్దపు భవ్యభారతం కనపడింది. భారతదేశాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయాలనే నా సంకల్పం మరింత బలపడింది..' అని మోదీ అన్నారు. అలాంటి సంకల్పం ఉన్నందు వల్లే ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా భారతీయులే కాదు, పలు దేశాధినేతలు మోదీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజనీతిజ్ఞత, దౌత్య ప్రజ్ఞ భారతీయతను ప్రపంచ వ్యాప్తంగా బలోపేతం చేశాయి. మన విశిష్ట అస్తిత్వాన్ని సమస్త దేశాలు గ్రహించక తప్పని పరిస్థితి కల్పించిన కారణంగానే ప్రపంచ నాయకులలో మోదీకి అగ్ర స్థానం లభిస్తోంది. అమెరికాకు చెందిన 'గ్లోబల్ డెసిషన్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ' ఇదే వాస్తవాన్ని మరోసారి ధ్రువీకరించింది.

మోదీ అడిగితే చాలు ప్రపంచంలో ఏ దేశాధినేతా కాదనలేడని చెప్పేందుకు అబుదాబీలో భారతీయుల కోసం మందిరం నిర్మించేందుకు ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ అల్ నహ్యాన్ అంగీకరించడం నిదర్శనం. 2010లో మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లినప్పుడు అక్కడి భారతీయులకు ఆలయం నిర్మించాలనుకుంటున్నట్లు అభ్యర్థించినప్పుడు అందుకు తమ అధ్యక్షుడు ఆమోద ముద్ర వేసేందుకు కేవలం అయిదు నిమిషాలు పట్టిందని ఆ దేశ దౌత్య సలహాదారు మహమ్మద్ గర్గాష్ ఇటీవల వెల్లడించారు. మోదీ అడగ్గానే ఒక భవ్య హిందూ మందిర నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యేందుకు ఈ నిర్ణయం దోహదం చేసిందని ఆయన చెప్పారు. అబుదాబీలో 27 ఎకరాల స్థలంలో స్వామి నారాయణ్ సంస్థ నిర్మించిన అక్షరధామ్ మందిరం మధ్య ప్రాచ్యంలోనే అతి పెద్ద మందిరం. అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభించిన నెల రోజుల్లోపే పది రోజుల క్రితం మోదీ ఈ మందిరాన్ని ప్రారంభించారు. మోదీ హయాంలో గతంలో ఎన్నడూ లేనంతగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కూ, భారత దేశానికీ మధ్య వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు బలపడ్డాయని, స్వేచ్ఛా వర్తక ఒప్పందంపై సంతకాలు జరిగాయని మహమ్మద్ గర్గాష్ చెప్పారు.

మార్నింగ్ కన్సల్ట్ వంటి అమెరికన్ సంస్థ మాత్రమే కాదు, చైనాలో ప్రభుత్వ నియంత్రణలో ఉన్న గ్లోబల్ టైమ్స్ కూడా తాజాగా మోదీ హయాంలో భారత్ ఆర్థిక వ్యూహాలు, దౌత్యపరమైన విజయాలను ప్రశంసించింది. 'భారత్ నేరేటివ్' అన్న శీర్షికతో ప్రచురించిన విశ్లేషణలో ప్రపంచంలో ఒక బలమైన శక్తిగా రూపొందే క్రమంలో మోదీ విదేశాంగ విధానాన్ని రూపొందించారని తెలిపింది. బలమైన ఆర్థిక విస్తరణ, పట్టణ పాలనలో భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ సంబంధాల్లో గుణాత్మకమైన మార్పు వల్ల మోదీ హయాంలో భారత్ అనేక విజయాలు సాధించిందని షాంఘైలోని ఫుడాన్ యూనివర్సిటీలో సౌత్ ఆసియన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ఝూంగ్ జియాడాంగ్ ఈ విశ్లేషణ చేశారు. రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణ సమయంలో సంయమనంగా వ్యవహరిస్తూనే అమెరికా, జపాన్, రష్యా వంటి గ్లోబల్ శక్తులతో బలమైన సంబంధాలు ఏర్పర్చుకోవడం మోదీ బహుముఖ వైఖరికి నిదర్శమని ఆయన అన్నారు.

ప్రపంచంలో భౌగోళిక రాజకీయాల సంక్లిష్టతలను మోదీ అర్థం చేసుకున్నట్లుగా మరే నేత అర్థం చేసుకోలేదు. ప్రపంచంలో అన్ని దేశాలు ఒకదానితో మరొకటికి సంబంధాలు ఏర్పర్చుకోవాల్సిన అవసరాన్ని మాత్రమే కాదు, ఒకదానిపై మరొకటి ఆధారపడక తప్పదని గ్రహించిన నేత మోదీ. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆయన ఒక ఆచరణీయ దృక్పథాన్ని అవలంబించారు. అందువల్ల అమెరికాతో పాటు అనేక అగ్రరాజ్యాలతో ఆయన లోతైన సంబంధాలు ఏర్పర్చుకోగలిగారు.

ప్రపంచ దేశాలు మాత్రమే కాదు, భారతీయుల్లో అత్యధిక శాతం మోదీ విదేశాంగ విధానాన్ని శ్లాఘిస్తున్నారని అబ్జర్వర్ రీసర్చ్ ఫౌండేషన్ తాజాగా నిర్వహించిన సర్వే తెలిపింది. అమెరికాతో పాటు గ్లోబల్ శక్తులతో మోదీ ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పిన తీరును 81 శాతం మంది ప్రశంసించారు. అమెరికా, రష్యా ఆస్ట్రేలియా, జపాన్‌తో సంబంధాలే రానున్న దశాబ్దంలో మనను బలోపేతంగా మారుస్తాయని వారు భావించారు. క్వాడ్‌లో చేరడం భారత ప్రయోజనాలకు ముఖ్యమని వారు అంగీకరించారు. జీ–20 దేశాల నిర్వహణ, ఆఫ్రికన్ యూనియన్‌ను భాగస్వామ్యం చేయడం, ఖతార్ మన దేశ నేవీ మాజీ అధికారులను బేషరతుగా విడుదల చేయడం, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్‌తో సంబంధాలు బలపడడం, బ్రిక్స్, షాంఘై కార్పొరేషన్‌లో బలమైన పాత్ర పోషించడం వంటి పరిణామాలను భారతీయ యువత గమనిస్తున్నారు. ప్రపంచంలో మోదీ ఏ దేశానికి వెళ్లినా వేల సంఖ్యలో భారతీయులు ఆయనను కలుసుకునేందుకు ముందుకు వస్తున్నారు. భారతీయతను ప్రపంచ వ్యాప్తంగా బలోపేతం చేసిన, మన అస్తిత్వాన్ని ప్రపంచం గ్రహించక తప్పని పరిస్థితి కల్పించిన మోదీ వంటి నేత మన దేశంలో ఎవరైనా ఉన్నారా?

(బీజేపీ జాతీయ కార్యదర్శి)


సామాన్యుడి ఇంటి కలను కాలరాస్తున్న 'రియల్' దందా!

ప్రతి కుటుంబానికి కనీస విస్తీర్ణంలో తలదాచుకునే ఒక గూడునిచ్చేందుకు ఉపయోగపడాల్సిన నివాస భూమి నేడు కొందరికి మాత్రమే విపరీతమైన లాభాలు గడించిపెట్టే పెట్టుబడిగా మారింది. స్తోమత ఉన్న వారే సొంతం చేసుకోగల ఆస్తిగా, విలాస వస్తువులా తయారైంది. అధికారులు, పదవుల్లో ఉన్నవారికి డబ్బు కురిపించే కల్పవృక్షంలా, ప్రభుత్వానికి పెద్ద ఎత్తున పన్నుల ద్వారా ఆదాయ వనరుగా రూపుదాల్చింది. దీనికి ప్రభుత్వ విధానాలూ, ప్రజల ఆచరణా రెండూ కారణమే!

1990ల తరువాత సరళీకృత ఆర్థిక విధానాలూ, ప్రైవేటీకరణ ఫలితంగా ఇల్లు కలిగి ఉండటం అన్నది ఒక హక్కుగా గాక, మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితి మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అభివృద్ధి అన్నది పట్టణీకరణకు పర్యాయపదంగా మారింది. భూమి మీద శ్రమతో పంటలు పండించడం, సంపద సృష్టించడం పోయి, భూమి స్వభావాన్ని మార్చి విలువ పెంచడం ద్వారా సంపద సృష్టించే విధానం పెరిగింది. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన సమాచారంతో తగినంత భూమి సంపాయిస్తే చాలు, ప్రభుత్వ విధానాలతో, మార్కెట్ శక్తులతో ఆ భూమి విలువ దానంతటదే పెరుగుతూ ఉంటుంది. కాని, కోట్లాది మంది అసంఘటిత శ్రామికులకు మాత్రం ఇంటి కోసం భూమి ఉండదు, భూమి కొనే స్థోమతా ఉండదు, బ్యాంకు నుండి అప్పు తీసుకునే పరపతీ ఉండదు. వారికి సొంత ఇల్లు సమకూరేది కేవలం ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీదనే!

భూమి తక్కువ ధరకే అందరికీ దొరికేసే విధాన వ్యవస్థ ఉంటే మార్కెట్ శక్తుల చేతులు కట్టేసినట్లేననీ, భూమి సంపూర్ణ విలువను చేరకుండా అడ్డుకుంటే సంపద సృష్టి, వృద్ధి రేటు తగ్గుతుందని సరళీకరణ వాదిస్తుంది. ఆ వాదన ప్రకారం భూమిపై ప్రభుత్వ ఆంక్షలు ఎత్తివేసి, పూర్తిగా మార్కెట్ శక్తులకు వదిలివేయాలి, అప్పుడే అభివృద్ధి. ఆ క్రమంలో అత్యంత పేదల అవసరాలను తీర్చడానికి వాళ్ళను లక్ష్యంగా చేసుకున్న పథకాలు, లేదా కొన్ని వెసులుబాటులు ఉంటే చాలు. ఈ వాదనకు అనుగుణంగానే పట్టణ భూ గరిష్ఠ పరిమితి (సీలింగ్) చట్టాన్ని 1999లో దేశం మొత్తం మీద, 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎత్తి వేశారు. ఆ తరువాత నగరాల్లో, పట్టణాల్లో భూమి విలువకు రెక్కలు వచ్చాయి. పెరుగుతున్న ధరలతో వ్యవసాయ భూములు ప్లాట్లు, లేఅవుట్లుగా అయ్యి, లావాదేవీలు విపరీతంగా పెరిగాయి.

ఈ క్రమంలో భూముల విలువ పెరుగుతుందని భూమి ఉన్నవాళ్లు మురిసిపోతే, పన్నుల ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వాలు మురిసిపోయాయి. అంతేతప్ప పేదలు, సామాన్యులకు ఎప్పటికీ భూమి కొనలేని పరిస్థితి ఏర్పడిందన్న సోయి ఎవ్వరికీ లేకపోయింది. గ్రామం లేదా పట్టణంలోని అందరి ఉమ్మడి సంక్షేమం గురించి పని చేయాల్సిన పరిపాలన, కట్టుబాటు వ్యవస్థలు కరిగిపోయాయి. ఆ వ్యవస్థల ప్రతినిధులైన సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు వంటి వారు తామే బ్రోకర్లుగా తయారై ఆయా ప్రాంతాల భూములను ముక్కలు చేసి అమ్మడంలో పోటీ పడటం మొదలుపెట్టారు. ఈ రోజున గ్రామాలలో వ్యవసాయం చేస్తూ స్థిరపడ్డామని చెప్పేవారికన్నా రియల్ ఎస్టేట్ చేసి స్థిరపడ్డామని చెప్పేవారే ఎక్కువ!



గత పదేళ్ళలో ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్ చుట్టూ భూముల విలువ అసహజంగా, విపరీతంగా పెరిగి భూమి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లు, దళారీలు, మరీ ముఖ్యంగా రెవెన్యూ, పట్టణాభివృద్ధి శాఖల్లోని అధికారులు, ప్రభుత్వ పెద్దలు అంతులేని సంపదను పోగేసుకున్నారు. హెచ్.ఎం.డి.ఎ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అందుకు ఓ చిన్న ఉదాహరణ. ఇటువంటి బాలకృష్ణలు రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ఉంటారు.

పేదలు, సామాన్యుల నివాస అవసరాలకు పట్టణాల్లో కొంత భూమి అందుబాటులో ఉంచడానికి, పట్టణ భూమి సీలింగ్ చట్టం ఎత్తివేసిన 2008 సంవత్సరంలోనే కొన్ని రక్షణలు కూడా కల్పించారు. ప్రభుత్వం చేపట్టే పేదల ఇండ్ల పథకాలకు తోడు, ప్రతి లే అవుట్, ఉమ్మడి గృహ సముదాయాల్లో ఖచ్చితంగా కొంత శాతం భూమిని ఆర్థికంగా బలహీన వర్గాలకు (5 శాతం), అల్పాదాయ వర్గాల ఇళ్ల స్థలాలకు (10 శాతం), మధ్య ఆదాయ వర్గాలకు (10 శాతం) రిజర్వు చేయాలనే నిబంధన ఆయా మాస్టర్ ప్లాన్ నిబంధనలలో చేర్చారు. అందులో అప్పటి హైదరాబాదుకు సంబంధించి హుడా, అవుటర్ రింగ్ రోడ్ ప్రాంతం, విమానాశ్రయ అభివృద్ధి ప్రాంతం ఉన్నాయి. ఆ తరువాత 2012లో రాష్ట్ర వ్యాప్తంగా వర్తించే విధంగా బిల్డింగ్ నియమాల్లో కూడా సదరు నిబంధనలు చేర్చారు. కాలక్రమంలో బిల్డర్లు, డెవలపర్లకు పై విధమైన రిజర్వేషన్లకు బదులు 5కిమీ పరిధిలో ఆయా వర్గాలకు అంతే విస్తీర్ణం భూమిని కేటాయించే వెసులుబాటు కూడా కల్పించారు. అయితే ఈ రక్షణలు అసలు అమలుకే నోచుకోలేదు.

2008 నుండి 2013 వరకు పేదలకు అనుకూలమైన నిబంధనల ఉత్తర్వులు ఎప్పుడు వచ్చినా, వెంటనే రియల్ ఎస్టేట్ సంస్థల సంఘాలు, ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలను కలవడం, రియల్ ఎస్టేట్ రంగం వృద్ధికి ఆ నిబంధనలు అడ్డుగా ఉన్నాయని నివేదించడం, వెంటనే ఆయా ప్రభుత్వాలు జీవోల ద్వారా ఆ నిబంధనలను సవరించుకుంటూ రావటం, ఇలా ఎప్పటికప్పుడు పేదల ఇళ్ల కోసం ఉంచాల్సిన భూమి శాతాన్ని తగ్గించటం ఆనవాయితీగా మారింది. ముందుగా మధ్యస్థ ఆదాయ వర్గాల కోసం ఉంచాల్సిన 10 శాతం నిబంధన తీసివేశారు. తరువాత అల్పాదాయ వర్గాల కోసం ఉంచాల్సిన 10 శాతం వాటాను 5 శాతానికి తగ్గించారు. చివరకు బిల్డింగ్ నిబంధనలు సవరించి, పేదలకు ఖచ్చితంగా ఉంచాల్సిన విస్తీర్ణానికి బదులుగా షెల్టర్ ఫీజుగా చదరపు మీటరుకు కొంత రుసుము చెల్లిస్తే సరిపోయే విధానాన్ని మాత్రమే ఉంచారు. అయితే గత పదేళ్ళల్లో ఆ రుసుము అసలు చెల్లిస్తున్నారా, ఎంత వసూలైంది, దాని ద్వారా పట్టణాల్లో పేదల ఇళ్ల కోసం ఎంత ఖర్చు పెట్టారు అనే లెక్కలు ఎక్కడా లేవు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు 2016లో అప్పటి ప్రభుత్వం ఏకపక్షంగా లేఅవుట్ నిబంధనలలో పేద, అల్పాదాయ, మధ్యాదాయ వర్గాలకు ఉంచిన అవకాశాలను పూర్తిగా తొలగించి వారి ప్రయోజనాలకు పాతర వేసింది. పేదలకు ఇళ్లు కల్పించడానికి ఏకైక ప్రత్యామ్నాయంగా తెచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం ఎంతవరకు ఇల్లు లేని పేదల అవసరాలు తీర్చిందో అందరికీ తెలిసిందే. గత పదేళ్ళల్లో ప్రభుత్వ విధానాలతో, భూముల వేలాలతో హైదరాబాద్ చుట్టూ భూముల విలువ అసహజంగా, విపరీతంగా పెరగడంతో రియల్ ఎస్టేట్ రంగంలో భాగమైన భూమి యజమానులు, రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, డెవలపర్లు, మధ్య దళారీలు, మరీ ముఖ్యంగా రెవెన్యూ, పట్టణాభివృద్ధి శాఖల్లోని ఉద్యోగులు, అధికారులు, ప్రభుత్వ పెద్దలు అంతులేని సంపదను పోగేసుకున్నారు. హెచ్.ఎం.డి.ఎ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అందుకు ఓ చిన్న ఉదాహరణ. ఇటువంటి బాలకృష్ణలు రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది ఉంటారు. మరో పక్క ఉండటానికి సొంత ఇల్లు లేని వారు లక్షల్లో పెరుగుతున్నారు. 2014లో ప్రభుత్వం చేసిన సకల కుటుంబ సర్వే లెక్కల ప్రకారమే దాదాపు 30 లక్షల కుటుంబాలకు సొంత ఇళ్లు లేవు. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు రెట్టింపైంది. దానికి ఈ మధ్య ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలకు వచ్చిన దరఖాస్తులే సాక్ష్యం.

ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం కనీస వసతులతో గౌరవప్రదంగా నివసించగలిగేలా ఒక సమగ్రమైన ప్రజా నివాస/ ఆవాస విధానం అవసరం. కేవలం డబుల్ బెడ్ రూం, ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల పథకాలు సరిపోవు. లేఅవుట్లలో రిజర్వేషన్, భూముల ధరల నియంత్రణ, అర్హులకు ఉచిత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం, తక్కువ అద్దెతో పని ప్రదేశానికి దగ్గరలో ఇళ్ల లభ్యత, ప్రభుత్వ స్థలాల వినియోగం వంటి అంశాలు అందులో ఉండాలి. అవుటర్ రింగ్ రోడ్డు వరకు పట్టణం, అక్కడ నుండి ప్రాంతీయ రహదారి వరకు శివారు ప్రాంతం, దాని అవతల అంతా గ్రామీణ జోన్ వంటి ఏకపక్ష నిర్ణయాలు కాకుండా, వివిధ వర్గాలతో చర్చించి, అసలు రాష్ట్రానికి సంబంధించి సమగ్ర వ్యవసాయ, నివాస, అటవీ, సామూహిక అవసరాల భూ విధానం, పట్టణీకరణ విధానం తీసుకురావాలి.

రియల్ ఎస్టేట్ వ్యాపారులను, డెవలపర్లను, పెట్టుబడిదారులను మాత్రమే సంపద సృష్టికర్తలుగా పరిగణిస్తూ వారి మనస్సు బాధపడకుండా చూసుకుంటామని నేటి ప్రభుత్వ పెద్దలు హామీ ఇస్తున్నారు. కానీ ఆ నిర్మాణాల కోసం, తద్వారా రాష్ట్ర ఆర్థిక వృద్ధి కోసం శ్రమిస్తున్న అసంఘటిత రంగ కార్మికులే అసలైన సంపద సృష్టికర్తలని వారికీ తెలుసు. ఆ వర్గం కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ తీరే విధంగా, అవే ప్రాధాన్యతలుగా ప్రభుత్వ విధానాలు ఆచరణా రూపొందించాలి. అదే అసలైన సంపద సృష్టి, సమ్మిళిత అభివృద్ధి.

• రవికుమార్
న్యాయవాది

హామీల అమలులోనూ అదే నిబద్ధత...

ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం గెలుపొందాక వాటిని పట్టించుకోకపోవడం చూస్తుంటాం. కానీ నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలనలో ఇచ్చిన హామీల అమలు ఒక్కొక్కటిగా ఆచరణ రూపం దాలుస్తోంది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేశారు. వాటిలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అన్నది చరిత్రలో నిలిచిపోనుంది. మరొకటి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచడం. ఇవి రెండు అమల్లోకి రావడమే కాకుండా ప్రజల్లోనూ వేగంగా దూసుకుపోయాయి. ఇవి కొనసాగుతుండగానే మరో రెండు పథకాలు ఈ నెల 27న ప్రారంభం మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అవి రూ.500లకే గ్యాస్ సిలెండర్, మరొకటి 200లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్ సరఫరా. 6 గ్యారంటీలను ఈ ఏడాదిలోనే అమలు చేసే లక్ష్యంతో ప్రభుత్వం బడ్జెట్‌లోనూ కేటాయింపులు చేసింది.

హామీలు ఇవ్వడమే కాదు, ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో అమలు చేయడమే రేవంత్‌రెడ్డి సర్కార్ పని తీరుగా విశదమవుతున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్టే దీనికి నిలువెత్తు సాక్ష్యం. బడ్జెట్‌లో రాష్ట్ర మొత్తం రెవెన్యూ రాబడులు రూ.2.05 లక్షల కోట్లు ఉండగా వాటిలో రూ.53,196 కోట్లను 6 గ్యారంటీలకే కేటాయించారు. అంటే 25 శాతం నిధులు. దీనిని బట్టే ప్రభుత్వం కమిట్‌మెంట్ స్పష్టం అవుతుంది. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటే మిగతా పార్టీల వాళ్లు నవ్వుకున్న సందర్భాన్ని కూడా మనం చూశాం. చాలా మంది ఇది అమలయ్యే పథకమేనా అనుకున్నారు. దానికీ బలమైన కారణాలు ఉన్నాయి. బస్సు ఛార్జీలు చెల్లిస్తున్నప్పుడే ఆర్టీసీ సంస్థ నష్టాల్లో ఉంది. మహిళలు ఉచిత ప్రయాణంతో అది మరింత నష్టాల్లో కూరుకుపోయి చివరకు రాష్ట్రంలో ఆర్టీసీ అనేది ఉండకపోవచ్చు అన్న అనుమానాలు వచ్చాయి. కానీ ఆ పథకం అమలే అలాంటి అనుమానాలన్నింటినీ పటాపంచలు చేసింది. బడ్జెట్ సమావేశాల నాటికే 15.21కోట్లమంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసినట్టుగా సర్కార్ ప్రకటించింది. అదే సమయంలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.535 కోట్లను చెల్లించడమే కాకుండా 100 కొత్త బస్సులు కొన్నది. దసరా, సంక్రాంతి అంటేనే ఆర్టీసికి సంబురం. ఆ సమయంలో కూడా ఉచిత ప్రయాణ పథకాన్నే కొనసాగించింది. ఇటీవల జరిగిన మేడారం, కొమురవెల్లి, కొండగట్టు, నాగోబా జాతరలకు సైతం ఎలాంటి ఛార్జీలు లేకుండా మహిళలకు ఉచిత పథకాన్నే అమలు చేయడం హర్షించదగిన విషయం.



హామీలు ఇవ్వడమే కాదు, ఇచ్చిన ప్రతి హామీని రేవంత్‌రెడ్డి సర్కార్ నెరవేరుస్తున్నది. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రభుత్వం కట్టుబాటుకు నిలువెత్తు సాక్ష్యం. రాష్ట్ర బడ్జెట్‌లో మొత్తం రెవెన్యూ రాబడులు రూ.2.05 లక్షల కోట్లు ఉండగా వాటిలో రూ.53,196 కోట్లను 6 గ్యారంటీలకే కేటాయించారు. అంటే 25 శాతం నిధులు. దీనిని బట్టే ప్రభుత్వం కమిట్‌మెంట్ స్పష్టం అవుతుంది.

రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకానికి రూ.2,418కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇదే కాకుండా విద్యుత్ సంస్థలు ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు రూ.16,825కోట్లు ముందు జాగ్రత్తగానే కేటాయింపు సైతం జరిగాయి. గృహజ్యోతి పథకం కింద నెలకు 200యూనిట్ల లోపు ఉన్న విద్యుత్ వినియోగదారులకు ఉచితంగానే విద్యుత్‌ను అందించనున్నారు. ఈ పథకం గృహాలకు పరిమిత ఉచిత నెలవారీ అర్హత వినియోగాన్ని(ఎంఈసీ) అందిస్తోంది. దీని ప్రకారమే ఇప్పటి వరకు రాష్ట్రంలో 34 లక్షల కుటుంబాలు ఈ పథకానికి అర్హమైనవని ప్రాథమికంగా గుర్తించారు. ప్రజా పాలనలో 6 గ్యారంటీలకు కలిపి ఒక్కటే దరఖాస్తులోనే పూర్తి చేయాల్సిందిగా సూచించిన సర్కార్ నేడు దాని ప్రకారమే గృహజ్యోతి పథకాన్ని అమలు చేయబోతుంది. ఈ పథకానికి సొంత ఇల్లు ఉన్నవారే కాదు, అద్దెకు ఉండే వారు సైతం అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్ శాఖకు కూడా స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. అద్దె ఇళ్లలో ఉండేవారు మొదట ఓ ఇంటి నంబరు మీద పథకం పొందుతూ కొన్ని నెలల తర్వాత వేరే ఇంటికి మారితే కూడా ఈ పథకాన్ని పొందే విధంగా అవకాశం కల్పించారు. ఈ పథకం అమలుతో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాను ఎత్తివేస్తారన్న ప్రచారాన్ని కూడా ప్రభుత్వం తిప్పికొట్టింది. రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవలనే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

గ్యాస్ సిలెండర్ ధర ఏ రోజు ఏ విధంగా మారుతుందో ఎవరికీ అర్థం కాదు. గడిచిన పదేళ్లల్లో ఎన్నిసార్లు గ్యాస్ సిలెండర్ ధరలు పెరిగాయో ఆయా కంపెనీలకు తప్ప ఎవరికీ కూడా గుర్తులేని పరిస్థితి. అయితే కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలెండర్‌ను ఇస్తామన్న హామీని 6 గ్యారంటీలలో భాగంగా అమలు చేయబోతుంది. ప్రస్తుతం ఇప్పుడున్న ధర ప్రకారమైతే సగం రేటుకే గ్యాస్ సిలెండర్ రాబోతుంది. రాష్ట్రంలో మొత్తం 1.20 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రతి నెల 44 శాతం మంది గ్యాస్ బుక్ చేసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిలో సుమారు 90లక్షల మంది కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. అంటే ప్రస్తుతం ఈ పథకం కింద సుమారు 90 లక్షల కుటుంబాలకు మేలు జరుగబోతుంది. దీంతో ప్రభుత్వానికి రూ.4,450కోట్ల వరకు భారం పడే అవకాశం ఉంది. అయినప్పటికీ ఏ మాత్రం భయపడకుండా గ్యారంటీల అమలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.

6 గ్యారంటీలలో మరో ప్రధానమైనది పింఛన్లు. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణ పింఛను నెలకు రూ.2016, దివ్యాంగులకు 3016 చొప్పున చెల్లిస్తున్నారు. వీటికే ఏడాదికి రూ.12వేల కోట్లు అవుతుంది. ఎన్నికల హామీ ప్రకారం వీటిని సాధారణ పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీటిని సైతం ఈ ఏడాదిలోనే అమలు చేసేందుకు సర్కార్ సిద్ధంగానే ఉందనే విషయం బడ్జెట్ కేటాయింపులే స్పష్టం చేస్తున్నాయి. పింఛన్లకే మరో రూ.10వేల కోట్లు అదనంగా కేటాయింపులు జరిగాయి. అంటే ప్రభుత్వం ఈ ఏడాదిలోనే పింఛన్ల పెంపును సైతం చేసేందుకే బడ్జెట్‌లో కేటాయింపులను చేసిందనే విషయం తేలిపోయింది.

కుల వ్యవస్థ ఉన్న మన దేశంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు చేరాలంటే కుల గణననే ఏకైక మార్గమని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. అందుకే రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలోనూ సమగ్ర కుల గణన నిర్వహించాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇది చరిత్రాత్మక నిర్ణయం. ఈ సర్వేతో రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా ఆయా వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు వెలుగులోకి వస్తాయి. సంక్షేమ పథకాలు అమలులోనూ ప్రభుత్వాలు సరికొత్త ధోరణిలో ముందుకు సాగే అవకాశం వస్తుంది. కుల గణనతో విద్య, ఉద్యోగ రంగాలలో అమలు చేస్తున్న రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలు కూడా శాస్త్రీయంగా వెలుగులోకి రానున్నాయి. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు అమలవుతున్న రిజర్వేషన్లు, వారున్న జనాభా వంటి విషయాలు స్పష్టంగా తేలే అవకాశం ఉంటుంది. తదనుగుణంగా రిజర్వేషన్ల పెంపు లేదా సర్దుబాటు వంటి వాటిని సరైన పద్ధతుల్లో చేసుకునే అవకాశం ఏర్పడనుంది. త్వరలోనే జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కంటే ముందే రాష్ట్రంలో కుల గణన ప్రారంభం అయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఆరు గ్యారంటీలే కాదు, రానున్న కాలంలో ఇంకా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టనున్నట్టుగా కూడా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. రానున్న సంక్షేమ పథకాలలోనూ మహిళలకే పెద్దపీట వేసే అవకాశం కూడా ఉంది.

▪ డా. ఎన్.యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

మరోమారు మోదీ మాటల గారడీ!

మోదీ చేస్తున్న ప్రసంగాలు మరోమారు ప్రజలను తప్పు తొవ్వ పట్టించే దిశగా సాగుతున్నాయి. ప్రపంచంలోనే భారతదేశాన్ని మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని, భారత ఆర్థిక వ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్స్ అంటే రూ.41 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంటుందని ప్రగల్భాలు పలికారు. దేశానికి రూ.168 లక్షల కోట్ల అప్పుతో రూ.41 లక్షల కోట్ల సంపదను ఎలా సృష్టిస్తారు? మోదీ పదేళ్ళ పాలనలో రూ.110లక్షల కోట్లు అప్పు చేసాడంటే దేశాభివృద్ధి పట్ల ఎంత పట్టింపు ఉన్నదో అర్థమవుతున్నది. 60ఏళ్ళ కాలంలో రూ.50 లక్షల కోట్లు ఉన్న అప్పును ఇప్పుడు మూడింతలు చేసి దేశాన్ని ఉద్ధరించారా? దేశంలోని సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంటే వారిని ఇంకా ప్రోత్సహించడమంటే కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేయడమే. మొండి బకాయిల పేరుతో రూ.12 లక్షలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పదేళ్ళు గడుస్తున్నా ఉద్యోగాల కల్పన లేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు తగ్గించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతూ పెరిగితే ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రజల పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం చేశారు.


వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికి మూడు సాగు చట్టాలు తెచ్చిన నేపథ్యంలో అఖిలపక్ష రైతు సంఘాలు 350 రోజులకు పైబడి సాగించిన ఉద్యమంలో 750 మంది రైతులు మరణించారు. ఉద్యమ తీవ్రతను గ్రహించి కాళ్ల క్రింది జాగా కదులుతున్నదని ఊహించి చట్టాలను పెండింగ్‌లో పెట్టింది. ఇప్పటికీ ఆ సాగు చట్టాలను రద్దు చేయకపోవడమంటే రైతుల తలల మీద కత్తి వ్రేలాడుతున్నట్లే కదా. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు మొండి బకాయిల పేరుతో రద్దు చేసిన ప్రభుత్వం ఒక్క రూపాయి అయినా రైతుల రుణమాఫీ చేసిందా?

గత పదేళ్ళుగా దళితులు, మైనారిటీలు, ప్రశ్నించే గొంతుకలను నొక్కివేశారు. దాడులు చేశారు. రాజద్రోహం లాంటి కేసులు పెట్టి అధికార మదంతో చట్టాలను తుంగలో తొక్కివేస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం అధికార, ప్రతిపక్షాలు ఉంటేనే ప్రజాస్వామ్యం. ఒక నాణేనికి బొమ్మా బొరుసులాగా, ప్రభుత్వంలో ఉన్నవారిని ప్రజల పక్షంగా ప్రశ్నించడం ప్రతిపక్ష బాధ్యత. ఇప్పటి వరకు ఇతర పార్టీ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఫిరాయింపజేసుకొని బలం పెంచుకున్న మోదీ – అమిత్ షా ద్వయం ఇప్పుడు రూటు మార్చారు. ఏకంగా ప్రతిపక్ష పార్టీలనే చీల్చి, వారి అనుకూల పార్టీకే ఆ పార్టీని కట్టబెడుతున్నారు. శివసేన, ఎన్‌సీపీలను చీల్చి, అందులో తమతో చెలిమి చేసే వర్గానికి ఏకంగా పార్టీని, ఎన్నికల గుర్తుని కట్టపెడుతున్నారు.

జార్ఖండ్‌లో యూపీఏ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ విశ్వప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా సీఎం హేమంత్ సోరెన్‌పై ఈడీని ఉసిగొల్పి అరెస్టు చేసి పదవి నుంచి దింపింది. ఇంత చేస్తే ఆయన దగ్గర దొరికింది రూ.36 లక్షలు, 8 ఎకరాల భూమి. వందల వేల కోట్లు ఉన్నవారు మాత్రం బీజేపీలో చేరితే చాలు బారా ఖూన్ మాఫ్! ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై లిక్కర్ కేసు, ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక, అనేక రాష్ట్రాలలో దొంగచాటున ప్రతిపక్షాలను చిత్రహింసలు పెడుతూ ప్రతిపక్షాలు లేని ప్రజాస్వామ్యాన్ని మోదీ కోరుకుంటున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో అధికారాన్ని చేజిక్కించుకొని 400 సీట్లు సాధించి 370 ఆర్టికల్ రద్దు చేసిన రీతిలో దేశాన్ని అతలాకుతలం చేయాలి.

ఈ మధ్య జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ స్వయంకృతాపరాధాల వల్లనే నష్టపోయింది. ఇప్పటికైనా విధానాలను సమీక్షించుకొని 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తేనే ప్రజాస్వామ్యం గట్టెక్కుతుంది. ప్రజలు, మేధావులు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కంకణబద్ధులు కావాలి. బీజేపీ ఎన్‌డీఏను గద్దెదించాలంటే దేశ ప్రజలకు ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని చూపించాలి. అందుకు కాంగ్రెస్ మేధావులు ప్రజాస్వామ్యవాదులతో చేయిగలిపి వారిలో నమ్మకాన్ని పెంపొందించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా కూటమి బలోపేతం కావటమే ప్రజాస్వామ్య ప్రగతికి ఏకైక బాట కాగలదు.

– చాడ వెంకటరెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 27 ఫిబ్రవరి 2024



పార్లమెంట్ ఎన్నికల వేడి మొదలవుతోంది. ప్రధానపార్టీలన్నీ గెలుపుగుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుశాతాన్ని పెంచుకున్న కమలదళం లోక్‌సభ ఎన్నికలపై కసరత్తు చేస్తోంది. గెలిచే అవకాశాలున్న నేతలను బరిలో నిలిపి సత్తాచాటాలని భావిస్తున్న బీజేపీ అధిష్ఠానం తమ పార్టీలోని సమర్థవంతమైన నేతల పేర్లను పరిశీలిస్తోంది. అంతేకాకుండా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులను తమ పార్టీలో చేర్చుకునేందుకు కూడా పావులు కదుపుతోంది. దీంతో బీజేపీ తరపున వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభస్థానాల్లో పోటీకి ఎవరిని నిలపబోతోందన్న దానిపై విస్తృత చర్చజరుగుతోంది. పలువురు ఆశావహులు ఈ స్థానాల్లో పోటీకి సై అంటున్న నేపథ్యంలో.. ముగ్గురి చొప్పున పేర్లతో అందిన జాబితాపై బీజేపీ అధిష్ఠానం ఓ సర్వే కూడా జరిపిస్తోందని సమాచారం. 29న తొలి జాబితా ప్రకటన ఉంటుందన్న ప్రచారం నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కబోతున్నాయన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది.

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాజీలతో నేతల చర్చలు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో పెరిగిన ఓటు బ్యాంకు
- వరంగల్, మహబూబాబాద్ కోసం పలువురి ప్రయత్నాలు
- మూడేసి పేర్లతో అధిష్ఠానానికి పంపిన జాబితాపై ఫ్లాష్ సర్వే
- 29న తొలి జాబితా ప్రకటనకు అవకాశం
- అభ్యర్థిత్వాలపై శ్రేణులు, ఆశావహుల్లో ఉత్కంఠ

కమలం కసరత్తు!

'పార్లమెంట్' అభ్యర్థుల ఎంపికపై బీజేపీ దృష్టి

వరంగల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలపై కమలం పార్టీ దృష్టి పెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో పాగా వేయాలనే లక్ష్యంతో ఆ పార్టీ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇప్పటికే పార్టీలోని కీలక నేతలు ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతుండగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఓటు బ్యాంకు పెరగడంతో బలమైన అభ్యర్థులను బరిలో దించితే ప్రధాని మోదీ చరిష్మాతో రెండు స్థానాల్లో గెలుస్తామనే ధీమా కమలనాథుల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర ముఖ్య నేతల సమావేశంలో వరంగల్, మహ బూబాబాద్ స్థానాల నుంచి పోటీ చేసే ఆశావహుల జాబితాను అధిష్ఠానానికి అందించారు. ఈ జాబితాతో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన ఓ మాజీ ఎంపీ, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో జరిగిన రహస్య చర్చల గురించి కూడా అధిష్ఠానానికి వివరించినట్టు సమాచారం. దీంతో ఎంపీ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో నెలకొంది.

పోటీకి కమలం నేతల తహతహ...

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి కమలం పార్టీలోని పలువురు సీనియర్, జూనియర్ నేతలు తహతహలాడుతున్నారు. ఇప్పటికే వాల్ రైటింగ్ పూర్తి చేసుకుని, తమకే టికెట్ అనే ధీమాలో కొంతమంది ఆశావహులున్నారు. ప్రధానంగా వరంగల్ (ఎస్సీ రిజర్వుడు) పార్లమెంట్ స్థానం నుంచి పొత్తులో భాగంగా ఎంఆర్‌పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ పేరు ప్రముఖంగా వినిస్తోంది. స్వయంగా ప్రధాని మోదీనే మందకృష్ణను పోటీ చేయాల్సిందిగా కోరినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఎన్నికల్లో పోటీ చేసేందుకు మంద కృష్ణమాదిగ ఆసక్తి చూపటం లేదన్న చర్చ జరుగుతుండగా.. ఒకవేళ ఆయన వరంగల్ నుంచి పోటీకి సుముఖంగా లేకపోతే పెద్దపల్లి బరిలోనైనా దింపాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. వరంగల్ నుంచి మంద కృష్ణమాదిగ తరువాత రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి కృష్ణప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కొంత కాలంగా బీజేపీ టికెట్ కోసం కృష్ణప్రసాద్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కూడా టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి పోటీ చేసి ఓడిపోయిన శ్రీధర్ మరోసారి ఎంపీ బరిలో నిలవడం ద్వారా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యే బొజ్జపల్లి రాజయ్య కుమారుడు సుభాష్, పరకాలకు చెందిన బీజేపీ సీనియర్ నేత దుబాసి వాసుదేవ్, పరకాల మునిసిపల్ మాజీ చైర్మన్ రాజభద్రయ్య తదితరులు కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఎస్టీ రిజర్వుడు స్థానమైన మహబూ బాబాద్ టికెట్ కోసం పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన హుస్సేన్‌నాయక్, యాప సీతయ్య, కృష్ణవేణి నాయక్‌లతో పాటు ఓ రిటైర్డ్ ఉద్యోగి కూడా రేసులో ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పెరిగిన బీజేపీ గ్రాఫ్..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ కాస్త పెరగటం కమలనాథులు జోష్‌లో ఉన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్‌కు 6,63,556ఓట్లు రాగా.. బీఆర్‌ఎస్‌కు 4,33,368ఓట్లు, బీజేపీకి 1,56,638ఓట్లు పోలయ్యాయి. ప్రధానంగా బీజేపీకి పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు పోలయ్యాయి. భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గల్లో ఉనికి చాటుకుంది. పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోనే చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు రాలేదు. అలాగే మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు పోలవగా.. బీఆర్‌ఎస్‌కు 4,43,910ఓట్లు వచ్చాయి. బీజేపీకి 34,431ఓట్లు లభించాయి. మహబూబాబాద్‌లో మినహా పెద్దగా ఎక్కడ బీజేపీ ఓటు బ్యాంకు పెరగలేదు. అయితే ప్రస్తుతం అయోధ్యలో రామమందిర నిర్మాణం తరువాత ప్రజల చూపు బీజేపీ వైపు మళ్లిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు నాడి కూడా మారుతుందని కాషాయం నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో మోదీ చరిష్మాతో రెండు స్థానాల్లో పాగా వేస్తామనే ధీమాతో కమలనాథులు ఉన్నారు.

గోడ దూకేస్తారా..?

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలపై దృష్టిపెట్టిన బీజేపీ నేతలు ఇతర పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నారు. ఇటీవల ఢిల్లీలో హోమ్ మంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్రానికి చెందిన కీలక నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వరంగల్, మహబూబాబాద్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిగినట్లు సమాచారం. అధిష్ఠానానికి రెండు స్థానాల నుంచి టికెట్ ఆశిస్తున్న ముగ్గురేసి ఆశావహుల జాబితాను అందించారు. రాష్ట్ర నాయక త్వం ఇచ్చిన జాబితాపై జాతీయ నాయకత్వం ఫ్లాష్ సర్వే చేయిస్తున్నట్టు తెలిసింది. అయితే వీరే కాకుండా ఇరత పార్టీల నుంచి టికెట్ ఇస్తే వచ్చేవారెవరున్నారని అధిష్ఠానం ఆరా తీసింది. వరంగల్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో ఇప్పటికే రహస్య చర్చలు జరిపినట్లుగా బీజేపీ నేతలు అధిష్ఠానానికి వివరించినట్టు సమాచారం. అయితే పార్టీ మారడంపై సదరు మాజీ ఎమ్మెల్యే డైలమాలో ఉన్నట్లుగా తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య పొత్తు ప్రచారం కూడా పార్టీ మారే నేతలపై ప్రభావం

మిగతా 4వ పేజీలో..


వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

ఉమ్మడి జిల్లాలో రూ.67.45 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

- వర్చువల్ శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో కార్యక్రమం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ పథకంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.67.45కోట్లతో చేపట్టనున్న రైల్వే అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రూ.25.41కోట్లతో రీ డెవలప్‌మెంట్ పనులకు శంకుస్థాపన, కాజీపేట బల్లార్షా మార్గంలో వడ్డేపల్లి వద్ద రూ.40 కోట్లతో ఆర్‌వోబీ, కాజీపేట డీజిల్ లోకోషెడ్ సమీపంలో రూ.2.4కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్ ద్వారా ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించి రైల్వేల అభివృద్ధిని వివరించారు. అధునాతన సాంకేతికతను మేళవించి ప్రయాణికులకు మేలైన రైల్వే రవాణా సదుపాయంతో రైల్వేను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ సికింద్రాబాద్ తర్వాత ముఖ్యమైన స్టేషన్ వరంగల్ రైల్వే స్టేషన్ అన్నారు. ఈ స్టేషన్ అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలని, వరంగల్-హైదరాబాద్ మధ్యలో షటిల్ సర్వీస్ రైలును నడపాలని కోరారు.


బల్దియా ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

మంత్రి సురేఖ ఆదేశించినా బుట్టదాఖలేనా...?

- ప్రజావాణిలో రంగశాయిపేట వాసుల మొర
- మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతులు
- అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 26 : మంత్రి కొండా సురేఖ క్షేత్రస్థాయిలో పరిశీలించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించినా బుట్టదాఖలేనా.. అంటూ వరంగల్ రంగశాయిపేట వాసులు జీడబ్ల్యూఎంసీ అధికారులను నిలదీశారు. సోమవారం హనుమకొండలోని బల్దియా కార్యాలయంలో ప్రజావాణి జరిగింది. కమిషనర్ బదిలీ కావడం, అదనపు కమిషనర్ సెలవులో ఉండడంతో వింగ్ అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణికొ మొత్తం 63 అర్జీలు రాగా.. వాటిలో కొన్ని..

- రంగశాయిపేట తెలంగాణ కాలనీలో డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనాథ్, కార్యదర్శి కందిక కొమ్మా విజ్ఞప్తి చేశారు. వివిధ కాలనీల్లోని వచ్చే మురికినీరంతా తమ కాలనీలోనే నిలుస్తుందని పేర్కొన్నారు. డ్రెయినేజీ లేని విషయాన్ని స్వయంగా మంత్రి కొండా సురేఖ క్షేత్రస్థాయిలో గత డిసెంబరు26న పరిశీలించినట్లు వివరించారు. వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆదేశించినా ఇప్పటి వరకు ఫలితం లేదన్నారు. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు.
- వరంగల్ ఏనుమాములకు చెందిన రాజేందర్ జనావాసాల మధ్య ఉన్న తోళ్ల ఫ్యాక్టరీని తొలగించాలని, ఇలాంటి ఫ్యాక్టరీలతో అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలిపారు.
- వరంగల్ రాయల్ ఫంక్షన్ వీధిలో రోడ్డును ఆక్రమించి జరుగుతున్న ర్యాంప్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని స్థానికులు కీర్తి, సత్యం, రాజు, సరిత, మాలతి, రజిత, ఉదయ్ తదితరులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ సహకార నగర్‌లో ప్రైవేటు హాస్టల్ నిమిత్తం జరుగుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సహకార నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ వరంగల్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, కార్యదర్శి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సోమయ్య ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ గోపాలపూర్ వెంకటేశ్వర కాలనీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.
- 46వ డివిజన్ మడికొండలోని మహబూబ్ కాలనీలో రోడ్డును ఆక్రమించి జరుగుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అంకూస్, గౌస్ పాషా తదితరులు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం అందచేశారు.
- హనుమకొండ యాదవనగర్‌కు చెందిన సునిత ఇంటి నెంబరు సవరణ కోసం విన్నవించారు. తమకు కేటాయించిన ఇంటి నెంబరు 3-14-10/3/04 వేరొక ఇంటికి కూడా కేటాయించినట్లు పేర్కొన్నారు. దీనిని సవరించాలని కోరారు.

మల్టీజోన్ -1 ఐజీగా రంగనాథ్ నియామకం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 26 : రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఇద్దరు ఐజీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్-1 ఐజీగా ఏ.వీరంగనాథ్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రంగనాథ్ హైదరాబాద్ క్రైమ్స్ విభాగంలో డీఐజీగా పని చేస్తూ ఇటీవల ఐజీగా పదోన్నతి పొందారు. మల్టీ జోన్-1 పరిధిలో ఉమ్మడి సిద్దిపేట, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మెదక్ జిల్లాలో మిళితమై ఉంటాయి. ఒకటి, రెండు రోజుల్లో రంగనాథ్ బాధ్యతలు చేపడుతారు. రంగనాథ్‌కు గతంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ సీపీగా పని చేసిన అనుభవం ఉంది.

కమిషనరేట్ పరిధిలో నలుగురు
సీఐల బదిలీ
- 14 మంది ఎస్‌ఐలకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ
6

గవర్నర్ పదవి ఎంతో కీలకమైంది
- కేంద్రానికి, రాష్ట్రానికి వారధిలా ముఖ్యభూమిక పోషించేది
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
6

మేయర్ వర్సెస్ కార్పొరేటర్లు

- బల్దియాలో ముదురుతున్న విభేదాలు
- స్వపక్ష కార్పొరేటర్ల వ్యతిరేక గళం
- విపక్ష సభ్యులతో కలిసి సమావేశం

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 26 : వరంగల్ మహానగర పాలక సంస్థ పాలకవర్గంలో విభేదాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి జీడబ్ల్యూఎంసీపై బీఆర్‌ఎస్ పట్టు సన్నగిల్లుతోంది. మేయర్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల మధ్య నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరడం, వారంతా కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లతో కలిసి సోమవారం బల్దియా కార్యాలయంలో సమావేశమవడం చర్చనీయంశమైంది. ఇటీవల పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పార్టీ కార్పొరేటర్లతో అంతర్గతంగా సమావేశమవడమే కాకుండా మేయర్ సుధారాణిపై విమర్శలు చేశారు. ఈ పరిణామం జరిగిన కొద్ది రోజులకే బల్దియా కార్యాలయంలో కొందరు కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తలు సుమారు 44 మంది సమావేశం కావడం రాజకీయ వేడిని పెంచింది. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ విపక్షాల కార్పొరేటర్లతో కలిసి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా గళం వినిపించినట్లు తెలిసింది. డివిజన్లలో అభివృద్ధి నిలిచిందని, నిధుల కేటాయింపు లేదని, పనులు శంకుస్థాపనతోనే ఆగాయని, మేయర్ పట్టించుకోవడం లేదని, అధికారులు కూడా లెక్క చేయడం లేదన్న ఫిర్యాదులు కార్పొరేటర్లు చేసినట్టు తెలిసింది.

కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు తీర్మానం?

త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాలకు ముందుగానే రెండు రోజుల పాటు కౌన్సిల్ సమావేశాల నిర్వహణ ఉండాలని కార్పొరేటర్లు తీర్మానించినట్టు తెలిసింది. సమావేశంలో అభివృద్ధి, నిధులు, ప్రజా సమస్యల గురించి ప్రస్తావన జరిగాకే బడ్జెట్ సమావేశాలకు అంగీకరించాలనే కార్పొరేటర్లు నిర్ణయించినట్టు సమాచారం. పరిస్థితుల ఆధారంగా అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుద్దామని కార్పొరేటర్లు చర్చించుకున్నట్లు తెలిసింది.


సమావేశంలో కార్పొరేటర్లు

కాంగ్రెస్‌కు అనుకూలంగా పరిణామాలు

ఒకవైపు జీడబ్ల్యూఎంసీని హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతుండగా తాజా పరిణామాలు ఆపార్టీకి అనుకూలంగా మారుతున్నాయి. నిబంధనల మేరకు మే నెల వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదని కార్పొరేటర్లు చెబుతుండగా.. అప్పటి వరకు అవిశ్వాస అంతర్గత ఉద్దేశంతో వ్యవహరిస్తూ మేయర్‌కు వ్యతిరేక గళం వినిపించాలనే వ్యూహంతో కార్పొరేటర్లున్నట్లు తెలుస్తోంది.

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్లు

- నిధుల విషయమై మంత్రి సురేఖను కలుద్దామన్న సుధారాణి

సమావేశం అనంతరం కార్పొరేటర్లు మేయర్ సుధారాణితో బల్దియా కార్యాలయ ఆవరణలో కలిశారు. తమ వాదనలు, సంతకాలలో కూడిన పత్రాన్ని మేయర్ సుధారాణికి అందచేశారు. నిధుల లేమి, డివిజన్లలో నిలిచిన పనుల అంశాలను మేయర్‌తో చర్చించిన వారు.. తాము డివిజన్లలో తలెత్తి తిరగలేక పోతున్నామని మేయర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. అందుకు స్పందించిన మేయర్ నిధులు, అభివృద్ధి పనుల విషయమై మంత్రి కొండా సురేఖ వద్దకు వెళదామని చెప్పినట్టు తెలిసింది. స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి, సీఎం ఆస్యూరెన్స్ విభాగాల నిధులను విడుదల చేయాల్సి ఉందని మేయర్ పేర్కొనట్టు సమాచారం. అయితే గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే నిధుల విడుదల కాలేని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అనుకూలంగా ఎలా స్పందిస్తుందని కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు మేయర్ ఎదుట తమ వాదన వినిపించినట్లు తెలిసింది. మొత్తంగా మేయర్, కార్పొరేటర్ల మధ్య చర్చ అసంపూర్తిగానే ముగియగా.. దీనిపై మరోసారి సమావేశం కావాలని కార్పొరేటర్లు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.


రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 53 కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 38,837 మంది విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలు
- కేంద్రాల వద్ద144 సెక్షన్ విధింపు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 26 : ఇంటర్మీడియేట్ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంటర్ విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసింది. ఇంటర్ పరీక్షలను ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వహించనుండగా 28న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, 29వ తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హనుమకొండ జిల్లాలో 53 కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించారు.. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో 13 పరీక్ష కేంద్రాలు, 40 ప్రయివేట్ జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అధికారుల కేటాయింపు

జిల్లా వ్యాప్తంగా 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి 53 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 53 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 40 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది కస్టోడియన్‌లు, 4 సిట్టింగ్ స్క్వాడ్ టీములను ఏర్పాటు చేశారు. అలాగే 2 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు సైతం ఏర్పాటు చేశారు. 975 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.



నిమిషం ఆలస్యమైనా..

పరీక్షల్లో ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకుండా నిబంధనలు అమలు చేశారు. పరీక్ష సమయం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఉదయం 8.30 నిమిషాలకే హాలులోకి అనుమతించనున్నారు. 9 గంటలకు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందిస్తారు. దీంతో 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైన విద్యార్థులు పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు సమీపంలోని జిరాక్స్ కేంద్రాల మూసివేతకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

- జిల్లాలో మొత్తం పరీక్ష కేంద్రాలు 53
- ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 18,552
- ఒకేషనల్ కోర్సు ప్రథమ సంవత్సరం 976
- మొత్తం ప్రథమ సంవత్సరంలో 19,528 మంది విద్యార్థులు.
- ఇంటర్ ద్వితీయ జనరల్ విద్యార్థులు 18,361
- ఒకేషనల్ కోర్సులో 948 మంది విద్యార్థులు.
- మొత్తం ద్వితీయ సంవత్సరంలో 19,309 మంది విద్యార్థులు.
- మొత్తం 38,837 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్ష రాయనున్నారు.

సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి

- ఏ.గోపాల్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి



ఇంటర్ పరీక్షలకు సంబంధించి పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పరీక్షల కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర మౌలిక వసతులు కల్పించాం. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. వైద్య సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారు. నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రాల్లోని అనుమతి లేనందున విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

కమలం కసరత్తు!

(3వ పేజీ తరువాయి)

చూపుతోంది. అలాగే మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో చర్చలు జరిపినట్లుగా బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఎంపీ టికెట్‌తో పాటు ఎన్నికల ఖర్చుపై హామీ ఇస్తే పార్టీ మారడానికి సదరు మాజీ ఎంపీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేతో మహబూబాబాద్ ఎంపీ సీటు విషయంపై అంతర్గతంగా చర్చలు జరిగినట్లుగా బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన సదరు మాజీ ఎమ్మెల్యేకు ఓ మంత్రి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీంతో బీజేపీ నుంచి ఆఫర్ రావటంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి పార్టీ మార్పుపై కార్యకర్తలతో సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇక ఈ నెల 29న బీజేపీ తొలి జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా.. రాష్ట్రం నుంచి పది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని, వాటిలో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లో అభ్యర్థులు ఖరారవుతారా? లేక పార్టీ మారే నేతల కోసం ఎదురుచూసి చివరి నిమిషంలో ప్రకటిస్తారా అనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో కనిపిస్తోంది.

పరిహారం చెల్లించండి..

సమస్యలు పరిష్కరించండి

తాడిచర్ల ఓసీపీలో భూ నిర్వాసితుల ధర్నా

ఐదు గంటల పాటు బైఠాయింపు

చెల్పూర్ కేటీపీపీ సీఈ హామీతో విరమణ

మల్హర్, ఫిబ్రవరి 26 : ఓపెన్‌కాస్ట్ కోసం ఇళ్లు, భూములు సేకరించి ఏళ్లు గడుస్తున్నా పరిహారం చెల్లించడం లేదని, సమస్యలను పరిష్కరించడం లేదని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల ఓసీపీ డేంజర్ జోన్ పరిధిలోని పెద్ద తాడిచర్ల భూనిర్వాసితులు ఆందోళనకు దిగారు. సోమవారం ఓసీపీలో జరుగుతున్న పనులను అడ్డుకొని ధర్నా నిర్వహించారు. పరిహారం చెల్లించకపోవడంతో పాటు.. స్థానికులకు ఉపాధి అవకాశాలు, పునరావాస కల్పన లాంటివి చేయడం లేదని సమస్యల పరిష్కారం గురించి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు వంద మందికి పైగా నిర్వాసితులు నిరసనలో పాల్గొనగా.. ఓసీపీలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్వాసితులు ఓసీపీలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. మహిళా నిర్వాసితులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పోలీసుల వారిని నిలువరించేందుకు ఇబ్బందులు పడ్డారు. గతంలో ఓసీపీకి భూములు ఇచ్చే సమయంలోనే ఇళ్లు కూడా తీసుకుంటామంటేనే బొగ్గు వెలికితీతకు భూములను ఇచ్చామని, నాడు తమను మభ్యపెడుతూ ఇళ్లకు నెంబర్లను వేశారని, గతేడాది కూడా ఇలాగే ఇళ్లకు నెంబర్లు వేసి పీఎన్ కూడ పబ్లిష్ చేశారని పేర్కొన్నారు. పీఎన్ కాల పరిమితి ముగియడంతో దాని ఊసే లేదని సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీలో నిత్యం జరిగే బ్లాసింగుల వల్ల ఇళ్లు బీటలు వారుతున్నాయని, ఇళ్లు నేలమట్టమై గాయాలపాలైన వారు కూడా ఉన్నారన్నారు. ఓసీ వల్ల దుమ్ము, దూళి ఎగిసిపడి.. ఇళ్లలోకి చేరి ఆహర పదార్థాలు, నీరు కలిషితమవుతునాయని, వేసవిలో ఆరుబయట నిద్రించే అవకాశం కూడా ఉండటం లేదని పేర్కొంటున్నారు. బ్లాస్టింగ్ అనంతరం వెలువడుతున్న విషవాయువుల వల్ల అనారోగ్యాల పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. ఓసీ వల్ల భూములు కోల్పోయి కూలీ పని కోసం పది, పదిహేను కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఏక్షణంలో ఏజరుగుతుందో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో తాము బతుకుతున్నామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం, ఇతర సమస్యలను పరిష్కరించేంత వరకు కదిలేది లేదని ఓసీపీలోనే బైటాయించారు.

కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఇక ఈ విషయం తెలుసుకున్న చెల్పూర్ కేటీపీపీ సీఈ సిద్దయ్య అక్కడకు చేరుకుని నిర్వాసితుల సమస్యలను విని.. నాలుగు నెలల్లో ఇళ్లు సేకరిస్తామని, ఏఎమ్మార్ అధికారులతో మాట్లాడి స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించడానికి కృషి చేస్తామని చెప్పడంతో నిర్వాసితులు శాంతించారు. కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వర్‌రావుతో పాటు ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ నిరసనలో ఎంపీటీసీ రావుల కల్పన, భూ నిర్వాసితులు ఆర్నీ సత్యనారాయణ, రామిడి గట్టయ్య, బండి స్వామి, రావుల అంజనేయులు, ముడితనపెల్లి ప్రభాకర్, బండి శ్రీనివాస్, రమేష్, మహేందర్, ముద్రవేన కిష్టయ్య, మొండి, వెంకన్న, రాజసమ్మయ్య, యువకులు పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన రవి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ అదనపు డీసీపీగా రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలలో రవి జోగులాంబ జిల్లా నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో రవి సోమవారం విధుల్లో చేరారు. రవికి వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అడ్మిన్ అడిషనల్ డీసీపీగా బాధ్యతలు అప్పగించారు. విదుల్లో చేరిన తర్వాత వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీపీ రవికి పలు సూచనలు చేశారు.

సాహిత్య వికాసానికి కేయూ తెలుగు విభాగం కృషి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 26 : తెలుగు సాహిత్య వికాసానికి కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు చేసిన కృషి అమోఘమైందని కేయూ, పాలమూరు వర్సిటీల మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి అన్నారు. కేయూ సెనెట్ హాల్‌లో తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న ఐలయ్య అధ్యక్షతన సోమవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుల సాహిత్యసేవ అనే అంశంపై జరిగిన సదస్సుకు గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశోధనలో తెలుగు ఆచార్యుల కృషి స్ఫూర్తిదాయకమని చెప్పారు. కేయూ రిటైర్డు ప్రొఫెసర్ కోవెల సుప్రసన్నాచార్య సదస్సు ప్రారంభ ఉపన్యాసం చేశారు. తెలుగు విభాగం ప్రతీ ఏడాది విమర్శిని పరిశోధన పుస్తకాన్ని వెలువరించినట్లు చెప్పారు. సదస్సులో కీలక ప్రసంగం చేసిన ప్రొఫెసర్ కె. కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ సమాజంలోని అనేక పార్శ్వాలకు కేయూ తెలుగు విభాగం బీజం చేసిందన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ.. తెలుగు పూర్వ ఆచార్యుల సాహిత్య కృషిని నేటి తరం విద్యార్థులకు తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు.

వర్సిటీ ధనాన్ని అక్రమంగా లాయర్‌కు చెల్లించారు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 26 : కాకతీయ యూనివర్సిటీలో వకాలత్ వేయని లాయర్‌కు రూ. 5 లక్షలను అక్రమంగా చెల్లించారని కేయూ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఇతర అకూట్ నేతలు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి సోమవారం రిజిస్ట్రార్ చాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అకూట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి, ఇతర అకూట్ నేతలు మాట్లాడుతూ.. వీసీ ప్రైవేట్ కేసుకు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ఉద్యమనేత ఖలీల్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 26: తెలంగాణ ఉద్యమ నేత, జలీల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎంఏ ఖలీల్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఖలీల్‌కు కాంగ్రెస్ కండువా కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



జెరియాట్రిక్

'వయసు పైబడుతోంది కదా! మునుపటి ఓపిక ఉండదులే! ఇదంతా సహజం' అని సరిపెట్టుకుంటున్నారా? కానీ మలి వయసుకు చేరుకుంటున్నా, సత్తువ సడలకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎనభైలో నలభైలా



వయసు పైబడేకొద్దీ పుట్టిన రోజు దగ్గర పడుతుంటే గుండెల్లో బేజారు మొదలవుతూ ఉంటుంది. యాభైకి చేరుకుంటే అర్థాయుష్షు అయిపోయిందే అని కొంత నిరాశకు లోనయ్యేవాళ్లూ ఉంటారు. నిజానికి ఒంట్లో తగ్గిపోయే హుషారు, చలాకీతనం, పెరిగిపోయే నిస్సత్తువ, నీరసాలు పైబడే వయసును అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి. 'అప్పట్లో నేను అలవోకగా పనులన్నీ చేసుకోగలిగేదాన్ని, సునాయాసంగా పనులన్నీ చక్కబెట్టేదాన్ని, చకచకా పరుగులెత్తేదాన్ని' అని పాత రోజుల గురించి గర్వంగా చెప్పుకోవడమే కాదు, అదే ఆరోగ్యాన్నీ, శరీర దారుఢ్యాన్నీ మున్ముందు కూడా కొనసాగించే వీలుంది. అయితే అందు కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలి. చేసే పనులు, తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ కనబరచాలి. మరీ ముఖ్యంగా మనసు వయసు పైబడనీయకూడదు.

క్రమం తప్పని వ్యాయామం

పైబడే వయసులో కండరాల నొప్పులు వేధిస్తున్నాయంటే, కండరాల పటుత్వం తగ్గిందని అర్థం. కీళ్ల నొప్పులు మొదలైనప్పుడు, రోజూ నడవడం మొదలు పెట్టండి అని వైద్యులు సూచిస్తూ ఉంటారు. కీళ్లు అరగడం మొదలైతే నడవడం వల్ల అవి ఇంకా వేగంగా అరిగిపోతాయి కదా? అని అయోమయానికి గురి కాకూడదు. నడక వల్ల కాళ్లలోని కండరాలు బలం పుంజుకుని ఊతాన్నిస్తాయి. దాంతో కీళ్ల మీద ఒత్తిడి తగ్గి అవి అరిగే వేగం నెమ్మదిస్తుంది. పైగా రోజు మొత్తంలో పది వేల అడుగులు నడిచే వ్యక్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. కాబట్టి కండరాల పటుత్వం కోసం నడక, ఈత, సైక్లింగ్... ఇలా నచ్చిన వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. ఏరోబిక్స్‌తో పాటు రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయవచ్చు. ఎముకల దృఢత్వం కోసం వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తూ ఉండాలి. బరువులు ఎత్తడం వల్ల కండరాలు బలం పుంజుకోవడంతో పాటు, శారీరక దారుఢ్యం కూడా పెరుగుతుంది.





సమతులాహారం

ఆదివారం వస్తే నాన్ వెజ్, మిగతా రోజులంతా వెజిటేరియన్ వంటకాలను వండుకోవడం మన ఆనవాయితీ. కానీ అన్ని రకాల పోషకాలూ సమపాళ్లలో అందాలంటే ఏ పదార్థాల్లో ఏ పోషకాలుంటాయో అవగాహన ఏర్పరుచుకుని రోజు మొత్తంలో సరిపడా పోషకాలన్నీ అందుతున్నాయో లేదో గమనించుకుంటూ ఉండాలి. నాన్ వెజ్ వండుకుని తింటే ప్రొటీన్ ఒక్కటే అందుతుంది. మరి మిగతా విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మపోషకాల మాటేమిటి? అలాగే కేవలం ఒక్క కూరగాయతో సరిపెట్టుకుంటే ప్రొటీన్ దక్కేదెలా? కాబట్టి వారాంతాల్లో నాన్‌వెజ్‌కు పరిమితమయ్యేవాళ్లు, కూరగాయలతో కలిపి నాన్ వెజ్ వండుకోవడం, లేదా అదనంగా వెజిటేరియన్ వంటకం చేసుకోవడం అవసరం. అలాగే కూరగాయలను పప్పుదినుసులతో కలిపి వండుకోవడం, గుడ్డుతో కలిపి వండుకోవడం లాంటివి కూడా చేయవచ్చు.



ప్రొటీన్ సరిపడా

సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనత తలెత్తకుండా ఉండడానికీ సరిపడా ప్రొటీన్ అవసరం. మాంసాహారం తినలేనివాళ్లు కంది, పెసరపప్పులను తినవచ్చు. చిక్కుళ్లు, బఠాణీ, మునగ, పుట్టగొడుగుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రతి రోజూ ఆహారంలో సరిపడా ఉండేలా మీల్ ప్లాన్ చేసుకోవాలి. అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి. ఉదయం తినే అల్పాహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, మొలకలు లాంటి వాటిని సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు.

ద్రవాలూ ముఖ్యమే!

ఒళ్లు నొప్పులకు శరీరంలో నీటి శాతం తగ్గడం ఒక కారణం. కండర నొప్పులు తరచూ వేధిస్తున్నా, కండరాలు పట్టేస్తున్నా శరీరంలో నీరు తగ్గిందని అర్థం చేసుకుని సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులు లేనివాళ్లు రోజుకు కనీసం 3 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ఇది వేసవి కాలం కాబట్టి పండ్ల రసాలూ, కొబ్బరినీళ్లు, పలుచని మజ్జిగ కూడా తీసుకోవచ్చు. సబ్జా నీళ్లు ఆరోగ్యకరం. శరీరాన్ని చల్లబరిచే నిమ్మరసం, క్యారట్, బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ ఉండాలి. శీతల పానీయాలు, చక్కెర కలిసి ఉండే పౌడర్ ఆధారిత పానీయాలు, సిరప్స్ దాహార్తిని తీర్చకపోగా, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.



సరిపడా విశ్రాంతి

కంటి నిండా నిద్ర, సరిపడా విశ్రాంతి కూడా అవసరమే! చలాకీగా, చురుగ్గా కదలడానికి సరిపడా ఓపిక శరీరానికి దక్కాలంటే, మధ్యాహ్నం వేళ ఒక అరగంట పాటు కునుకు తీస్తూ ఉండాలి. దాంతో కండరాలు శక్తిని పుంజుకుంటాయి. 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవడం వల్ల శరీర బడలిక వదిలి, కొత్త శక్తిని పుంజుకుంటుంది. కాబట్టి నిద్రకు భంగం కలిగించే అంశాలకు దూరంగా ఉంటూ, కంటి నిండా నిద్రపోవాలి.

ఎముకల పటుత్వం ఇలా సాధ్యం

పైబడే వయసులో ఎముకల పటుత్వం క్షీణించడం సహజం. అలా జరగకుండా నియంత్రించాలంటే పోషకాహారంతో పాటు కొన్ని అదనపు సప్లిమెంట్లు కూడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **క్యాల్షియం:** అరవై ఏళ్లు పైబడిన స్త్రీపురుషులు క్యాల్షియం సమృద్ధిగా దొరికే పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, డ్రై సీడ్స్, బాదం, పిస్తా తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియం దక్కే వీలు లేని సందర్భాల్లో వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడుకోవచ్చు.
- **విటమిన్ డి:** ఎముకల దృఢత్వానికి డి విటమిన్ అవసరం. ఆహారం ద్వారా దొరికే అవకాశం లేని డి విటమిన్‌ను పొందడం కోసం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు ఎండలో గడపడం అవసరం. సాధ్యపడని సందర్భాల్లో వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- **వ్యాయామాలు:** నడక, పరుగు, బరువులెత్తడం, సైక్లింగ్ శరీరం మీద బరువు పడేలా చేసే వ్యాయామాలన్నీ ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. నడి వయసులో తుంటి ఎముకలు తేలికగా విరిగిపోతూ ఉండడానికి కారణం ఎముకలు గుల్లబారడమే! ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే మరీ ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.
- **ఇవి వద్దు:** ఆల్కహాల్, చక్కెర, కాఫీలు ఎముకల సాంద్రతను తగ్గిస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం ఎముకలకు హానికరం. కాబట్టి ఈ అలవాటు ఉన్నవాళ్లు నడవయసుకు చేరుకున్న తర్వాత పూర్తిగా మానేయాలి.
- **ఆరోగ్య పరీక్షలు:** 55 ఏళ్లు దాటిన మహిళలు, 65 ఏళ్లు దాటిన పురుషులు ప్రతి మూడేళ్లకోసారి ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో ఎముకల సాంద్రతను అంచనా వేస్తూ, అప్రమత్తం అవుతూ ఉండాలి. ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో గుర్తించినప్పుడు వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. వ్యాయామాలు మొదలుపెట్టాలి.

జీవనశైలి వ్యాధులు రాకుండా....

45 ఏళ్లు దాటిన వాళ్లలో అధిక రక్తపోటు, మధుమేహాలు సర్వసాధారణమైపోతున్న కాలమిది. ఇలాంటి జీవనశైలి వ్యాధులు దాడి చేయకుండా ఉండాలంటే...

- వయసు పైబడేకొద్దీ కణాల్లో జరిగే ఆక్సిడేషన్ డ్యామేజీ వల్ల కేన్సర్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా దొరికే తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న పదార్థాలు, ప్యాకేజ్‌డ్ ఫుడ్, చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం మానేయాలి.
- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని వదిలించుకోవాలి. ఇంటి పట్టున ఉండేవాళ్లు నచ్చిన ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవాలి. మెదడును చురుగ్గా ఉంచే ఇండోర్ గేమ్స్, శరీరాన్ని చురుగ్గా ఉంచే ఔట్‌డోర్ గేమ్స్ ఆడుతూ ఉండాలి.
- **వైద్య పరీక్షలు:** అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలున్నవాళ్లు క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. సంబంధిత వైద్య నిపుణులను కూడా సంప్రతిస్తూ ఉండాలి. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. గుండెజబ్బు, మధుమేహం ఉన్నవాళ్లు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షలతో ప్రారంభంలోనే సమస్యను గుర్తించే వీలుంటుంది.

డాక్టర్ వేద ప్రకాష్. జి
సీనియర్ కన్సల్టెంట్,
ఆర్థోపెడిక్ సర్జన్ అండ్
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



సైకాలజీ

ఇదీ ఓ కారణమే!

కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణమవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యనుబట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహరణకు....

- సోషల్ యాంగ్జయిటీ, ప్యానిక్ అటాక్స్, డిప్రెషన్: మానసికంగా కుంగిపోయినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.



- డిప్రెషన్, యాంగ్జయిటీ: పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసిక ఇబ్బందులు సమసిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్: సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి.

ఆయుర్వేదం

మెదడు చురుకుగా...

జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గడానికి కారణం పోషకాహార లోపం, మెదడులో తయారయ్యే రసాయనాలలో అసమతౌల్యమే ప్రధాన కారణాలని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మార్పులు సహజసిద్ధంగా శరీరంలో జనించవచ్చు, లేదా మందుల ప్రభావం వల్ల కూడా తలెత్తవచ్చు. కఫ దోషం వల్లే జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుందని ఆయుర్వేదం నమ్ముతోంది. ఈ దోషం ఫలితంగా మెదడు పనితీరు మందగించి, ఆలోచనల్లో అస్పష్టత చోటుచేసుకుంటుంది. కాబట్టి జ్ఞాపకశక్తి పెరగాలంటే వాత, కఫ దోషాలను సమతులం చేయాలి. వాత, కఫ దోషాల సమ్మేళనం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. పిత్త దోషం మెదడు చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఈ దోషాలన్నీ సమతులం కావాలంటే ఆహారవ్యవహారాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి.



- **ఆహారం:** దోష తత్వం ఆధారంగా ఆహారశైలిని అనుసరించాలని ఆయుర్వేదం సూచిస్తున్నా, మరీ ముఖ్యంగా జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ఆహారనియమాలు పాటించవలసి ఉంటుందని కూడా ఆయుర్వేదం సూచిస్తోంది. అవేంటంటే...
- సులువుగా అరిగే, ఒంట్లోని విషాలను హరించే ఆహారంతో శరీరంలో కఫ సంబంధ అవరోధాలు తొలగి, వాత మార్గాలు తెరుచుకుంటాయి. అలాగే ఇలాంటి ఆహారం పిత్త పనితీరును పెంచి, తత్ఫలితంగా జ్ఞాపకశక్తినీ, తెలివితేటలనూ పెంచుతుంది.
- కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, నెయ్యి, నారింజ, క్యారెట్లు, నట్స్‌లతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.
- జున్ను తినకూడదు. మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- జ్ఞాపకశక్తి, తెలివితేటలను పెంచే వాత, పిత్త, కఫ దోషాల మధ్య సమతులం సాధించాలంటే బెల్లం లేదా తేనెలకు దీర్ఘకాలం పాటు ఆహారంలో చోటు కల్పించాలి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

గుడ్ ఫుడ్

మెంతులు మేలు!

మెంతులను నిల్వ పచ్చళ్లలో తప్ప వంటకాలలో పెద్దగా ఉపయోగించం. కానీ పిల్లలకు పాలిచ్చే తల్లులకు మెంతులు మేలు చేస్తాయి. పాల ఉత్పత్తిని పెంచి, పసికందుకు పాల కొరత తీరుస్తాయి.

పిల్లలకు పాలిచ్చే తల్లుల ఆహారంలో మెంతులను చేర్చడం మన దేశ ఆనవాయితీ. ఉత్తర భారతదేశంలో మెంతి లడ్డు, దక్షిణాదిన పొడులు, ముద్దల రూపంలో వాడుతూ ఉంటారు. ఈ సంప్రదాయం వెనక సైన్స్ దాగి ఉంది. ప్రసవించిన మహిళలకు మెంతులు ఎంతో ఉపయోగకరం. వారిలో పాల ఉత్పత్తిని పెంచుతాయని జంతువులు, మనుషుల మీద జరిపిన పలు పరిశోధనల్లో రుజువైంది. 'గ్యాలెక్టగోగ్' అనే పాల ఉత్పత్తికి తోడ్పడే మూలిక లేదా ఔషధంగా మెంతులను వర్గీకరించారు. ఈ విత్తనాల్లో ఉండే 'డయాస్జెనిన్' పాల ఉత్పత్తి జరిగే మామరీ గ్రంథులలోని కణజాలం పెరుగుదలకు, తోడ్పడుతుంది. ఫలితంగా పాలు త్వరితంగా, ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇందుకోసం రోజుకు 10 విత్తనాలు తీసుకుంటే సరిపోతుంది.



రోజుకు ఒకటి లేదా రెండు మెంతి లడ్డను పాలిచ్చే తల్లులకు తినిపంచవచ్చు. వీటికి బెల్లం, శొంఠి, డ్రై ఫ్రూట్స్, నెయ్యి జోడించాలి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మెంతి పొడికి, పసుపు, శొంఠి, బెల్లం, ఇతర మూలికలు చేర్చి ఉడికించి, హల్వా ఉండగా చేసి పరగడుపున తినిపించడం ఆనవాయితీ. ఒకవేళ బరువు పెరగకుండా మెంతుల మేలు అందుకోవాలనుకుంటే, మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవచ్చు. ప్రత్యామ్నాయంగా మెంతులను పొడి చేసి, తేనె లేదా గోరువెచ్చని నీళ్లతో కలిపి తీసుకోవచ్చు. అయితే గర్భిణులు మెంతులకు దూరంగా ఉండాలి. గ్యాలెక్టగోగ్ కోవకు చెందిన మెంతుల్లో యుటెరోటోనిక్ ఏజెంట్ ఉంటుంది. ఇది కండరాల సంకోచవ్యాకోచాలకు కారణమవుతుంది. కాబట్టి గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుంది.

కెగెల్ ఎక్సర్‌సైజెస్

నడుము దృఢంగా!

కొన్ని వ్యాయామాలు అంతర్గత జీవక్రియలు, వ్యవస్థల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దైనందిన జీవితానికి ఇబ్బంది పెట్టే స్వల్ప సమస్యలనూ పరిష్కరిస్తాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'కటి వ్యాయామాలు'!

కటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలు స్త్రీపురుషులు ఇద్దరికీ ఉపయోకరమే! కటి ప్రదేశంలోని కండరాలు బలపడే ఈ వ్యాయామాలు చేయడం వల్ల మూత్ర వ్యవస్థకు సంబంధించిన కొన్ని సమస్యలు దూరమవుతాయి. మరీ ముఖ్యంగా తుమ్మినా, దగ్గినా మూత్రం లీక్ అయిపోయే ఇబ్బంది తొలుగుతుంది. స్త్రీలలో ప్రసవానంతరం తలెత్తే ఈ రకం సమస్య కటి వ్యాయామాలతో అదుపులోకి వస్తుంది. ఈ వ్యాయామాలను అమెరికాకు చెందిన స్త్రీల వైద్యులు 'అర్నాల్డ్ కెగెల్' కనుగొన్నారు కాబట్టి వీటికి 'కెగెల్ ఎక్సర్‌సైజెస్' అనే పేరొచ్చింది.

కెగెల్ వ్యాయామాలు అంటే?

ఈ వ్యాయామాలనే 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు అని కూడా అంటారు. కటిలోని కండరాలను బిగదీసి, వదిలే ఈ వ్యాయామాలు రోజు మొత్తంలో ఎన్ని సార్లైనా చేయవచ్చు. సరైన ఫలితం దక్కడం కోసం కనీసం 3 నెలల పాటు వ్యాయామాలు చేయాలి. తేలికగా ఉండే ఈ వ్యాయామాలను రోజులో ఏ సమయంలోనైనా చేయవచ్చు. కూర్చున్నా, పడుకుని ఉన్నా కూడా ఈ వ్యాయామాలు చేయవచ్చు. తింటున్నప్పుడు, కుర్చీ మీద కూర్చుని పని చేసుకుంటూ, టివి చూస్తూ విరామంగా ఉన్నప్పుడు కూడా చేయవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు

- విసర్జక వ్యవస్థ అదుపులో ఉండేందుకు ఈ వ్యాయామాలను స్త్రీపురుషులు ఇద్దరూ చేయవచ్చు.
- శస్త్రచికిత్సల తదనంతరం కండరాలను బలోపేతం చేయడం కోసం ఈ వ్యాయామాలను అనుసరించాలి. ప్రోస్టేట్ సంబంధిత శస్త్రచికిత్సల తదనంతరం పురుషులు, పునరుత్పత్తి వ్యవస్థల సంబంధిత శస్త్రచికిత్సల అనంతరం స్త్రీలు ఈ వ్యాయామాలను చేయాలి.
- వృద్ధాప్యం మూలంగా బలహీనపడే కటి కండరాల బలోపేతానికి కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.
- ప్రసవం తదనంతరం మహిళలు ఈ వ్యాయామాలను క్రమం తప్పక చేస్తే పునరుత్పత్తి సంబంధిత అంతర్గత అవయవాలన్నీ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.
- మూత్రాశయం, దాని చుట్టుపక్కల కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. కాబట్టి చిన్న ఒత్తిడికే మూత్రం కారిపోయే పరిస్థితి ఉన్న స్త్రీపురుషులు ఈ వ్యాయామాలు ఎంచుకోవాలి.
- పొట్టలోని పేగులు పొత్తికడుపులోకి జారే సమస్య ఉన్నవారు కూడా ఈ వ్యాయామాలు చేయాలి.
- తెలియకుండా మలవిసర్జన జరిగిపోయే సమస్య ఉన్నవాళ్లకు కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.

ఇలా చేయాలి

ఈ వ్యాయామాలు చేసేటప్పుడు స్త్రీపురుషులు వేర్వేరు పద్ధతులు పాటించాలి.

- **సరైన కండరాలు:** మూత్రవిసర్జన చేయబోయి, ఆపుతున్నట్టు కండరాలను కదిలించడమే కెగెల్ ఎక్సర్‌సైజ్. మూత్రవిసర్జనతో సంబంధం ఉన్న కండరాలు బిగబట్టి, వదులు చేస్తూ ఉండాలి. అయితే సంబంధిత కండరాలేవో గ్రహించి, వాటిని మాత్రమే ఉపయోగించాలి. తర్వాత మూత్రవిసర్జన చేయడానికి వెళ్లినప్పుడు మూత్రవిసర్జనను మధ్యలో ఆపేయాలి. ఇలా చేస్తున్నప్పుడు ఏ కండరాలు మూత్రవిసర్జనను అదుపు చేస్తున్నాయో స్వయంగా గ్రహించగలుగుతారు. మహిళల్లో (యోని), మూత్రాశయం లోని కండరాలు బిగుసుకుని, పైకి లాగబడతాయి. ఈ కండరాలే మహిళలకు సంబంధించిన కటి కండరాలు. ఈ కండరాలే వ్యాయామం చేసే సమయంలోనూ బిగుసుకుంటూ ఉంటే వ్యాయామం సరిగా చేస్తున్నారని అర్థం. అలాగే తొడలు, పిరుదులు, పొత్తికడుపు కండరాలు ఈ వ్యాయామం చేసే సమయంలో విరామ స్థితిలో ఉండాలి.

వ్యాయామం ఇలా!

- మూత్రాశయం ఖాళీగా ఉంచాలి. పొట్టలో వాయువులు ఉండకూడదు.
- మీ సౌకర్యాన్ని బట్టి కూర్చుని లేదా పడుకుని వ్యాయామం చేయాలి.
- నెమ్మదిగా కటి కండరాలను బిగపట్టి, 10 అంకెలు లెక్కపెట్టి వదలాలి.
- వదిలిన తర్వాత మరో 12 అంకెలు లెక్కపెట్టి తిరిగి బిగపట్టాలి.
- వ్యాయామం చేస్తున్నంతసేపు, గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, శరీరాన్ని విశ్రాంత స్థితిలో ఉంచాలి. పొట్ట, తొడలు, ఛాతీ కండరాలు బిగదీయకూడదు. పొత్తికడుపు కండరాలు విశ్రాంతంగా ఉంచాలి.

ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా 4 నుంచి 6 వారాలపాటు చేయాలి. క్రమక్రమంగా కటికి సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. అయితే ఈ వ్యాయామాలను అవసరానికి మించి చేయడం వల్ల మల,మూత్రవిసర్జన సమయంలో కండరాల నొప్పులు మొదలవుతాయి.



గమనిక

- ఈ వ్యాయామాలను సరైన పద్ధతిలో చేయని మహిళలకు లైంగిక కలయిక సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.
- ఈ వ్యాయామాలను చేస్తూ, కొంతకాలం తర్వాత ఆపిన మహిళల్లో తిరిగి మూత్రం కారిపోయే సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ఎక్కువ కాలంపాటు ఈ వ్యాయామాలు చేయాలి.
- ఈ వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన చాలా కాలం తర్వాత మాత్రమే మూత్రం కారడం, మలవిసర్జన సమస్యలు అదుపులోకి వస్తాయి.

వైద్యులను కలవాలి

- ఈ వ్యాయామాలను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడం కోసం వైద్యులను కలవడం అవసరమే! వైద్యుల సూచనల మేరకు వ్యాయామాల మీద పట్టు సాధించి సాధన చేయడం ద్వారా కటి సంబంధ కండరాల బలహీనతతో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చు.

హెల్త్ వెల్త్

నోటి దుర్వాసన ఎందుకు?



నోటి దుర్వాసన కేవలం నోటి శుభ్రతా లోపం వల్లనే కాదు! మరెన్నో అంతర్గత రుగ్మతల ప్రధాన లక్షణం కూడా! ఉదర కేన్సర్ కూడా నోటి దుర్వాసన ద్వారానే బయల్పడుతుంది. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టి, చికిత్స తీసుకోవాలి.

- **చిగుళ్ల వ్యాధి:** పెరియోడాంటైటిస్, జింజివైటిస్ అనే ప్రధానమైన చిగుళ్ల వ్యాధుల్లో నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్యలు ఉన్నప్పుడు చిగుళ్లు వాచి, రక్తం, చీము కారుతూ ఉంటాయి. వ్యాధికారక బ్యాక్టీరియా చిగుళ్లలో తిష్ట వేయడమే ఇందుకు కారణం. ఈ లక్షణాలకు తోడు నోటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుంటే, చిగుళ్ల వ్యాధిగా భావించి దంత వైద్యులను సంప్రతించాలి.
- **ఎలర్జీలు:** గొంతులో దురద, ముక్కు దిబ్బెడ, కంటి నుంచి నీరు కారడం లాంటి ఎలర్జీలు ఉంటే వాటికి తోడు నోటి దుర్వాసన కూడా అనుభవంలోకి వస్తుంది. తెమడ చెడు సూక్ష్మక్రిములకు నెలవు. వాటి వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. అలాగే ఎలర్జీలు ఉన్నప్పుడు నోరు ఎండిపోతూ ఉంటుంది. దీని ఫలితంగా కూడా నోటి దుర్వాసన వెలువడుతుంది. ఈ దుర్వాసన వదలాలంటే తెమడ వదిలించుకుని, జలుబు, దగ్గులను మందులతో అదుపు చేసుకోవాలి.

ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 26 : ప్రజావాణి వినతులు వెంటనే పరిష్కరించాలన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు కాలయాపన చేయకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 91 వినతులు అందినట్లు తెలిపారు. అనంతరం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించే అక్షరాస్యత- అవగాహన వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, అధికారులు ఉమారాణి, రాంరెడ్డి, మేన శ్రీను, హరిప్రసాద్, ఏడీ నర్సిరెడ్డి, మాధవీలత, మధురిమ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలి

ఢిల్లీ రైతుల పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల రాస్తారోకో

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 26: ఢిల్లీ రైతుల పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చ ఇచ్చిన పిలుపులో భాగంగా రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోను ఉద్దేశించి ప్రజా సంఘాల నాయకులు ఎం.చుక్కయ్య, ఎస్. హంసారెడ్డి, బుట్టి చక్రపాణి, జి. రాములు తదితరులు మాట్లాడారు. దేశానికి అన్నంపెట్టే రైతులపై అమానుషమైన దాడులు, బాష్పవాయు గోళాలు ప్రయోగించి తుపాకీ తూటాలు ఎక్కిపెట్టిన సంఘటనలో ఇద్దరు రైతులు చనిపోయారన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వస్తే ఈ దేశంలో రైతాంగ హక్కులు ఉండవని, కార్మికులు, కర్షకులు, ఉపాధి హామీ కూలీలు నిరుద్యోగులుగా మారుతారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే రైతాంగానికి మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంకా ప్రజా సంఘాల నాయకులు వి. వీరన్న నాయక్, వెంకట్, కాడబోయిన లింగయ్య, తిరుపతి, భాను నాయక్, వీఎస్ రావు, నాగార్జున పాల్గొన్నారు.

లక్ష్మీకాంత్ కాలనీలో దొంగల హల్‌చల్

మేడారం వెళ్లిన వారి ఇంట్లో దొంగతనం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 26: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని ములుగురోడ్డు లక్ష్మీకాంత్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మేడారం జాతరకు వెళ్లి రాగానే ఇంటి తలుపులు తీసి ఉండడంతో ఇంటి యజమానులు దొంగతనం జరిగినట్టు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన కావటి వెంకటనర్సయ్య ములుగురోడ్డు సమీపంలోని లక్ష్మీకాంత్ కాలనీలో ఇంటిని నిర్మించుకుని గత కొంత కాలంగా ఉంటున్నారు. కాగా, రెండు రోజుల క్రితం మేడారం జాతరకు వెళ్లి సోమవారం ఇంటికి వచ్చారు. ఇంటి వెనకాల తలుపులు తీసి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన వచ్చిన పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. పోయిన బంగారం విలువ సుమారు రూ. 1.30 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

మహిళ మెడలో చైన్‌స్నాచింగ్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 26: హనుమకొండ కొత్తబస్‌స్టేషన్‌లో మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన తోటకూరి రజిత వ్యక్తిగత పనిపై హనుమకొండకు వచ్చింది. తిరిగి శనివారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లే క్రమంలో హనుమకొండ కొత్తబస్‌స్టేషన్‌కు రాగా గుర్తు తెలియని వ్యక్తి మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేశారు. కొంత సమయానికి మెడలో ఉన్న పుస్తెల తాడు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

కోర్టులో అక్యుప్రెషర్ థెరపీ క్యాంపు ప్రారంభం

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 26 : హనుమకొండ జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ అదాలత్, బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అక్యుప్రెషర్ థెరపీ క్యాంప్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ఇలాంటి థెరపీ ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, న్యాయసేవా సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

రేపు సైన్స్ దినోత్సవం నిర్వహించాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 26: అన్ని పాఠశాలల్లో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవ నిర్వహించాలని డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి సెల్ నెంబర్ 94901 12848లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ..

ఆర్వోబీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


ఆర్వోబీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు


కాజీపేట డీజిల్ షెడ్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 26 : అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కాజీపేట- హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య గల వడ్డెపల్లి వద్ద రూ. 40 కోట్లతో నిర్మించిన రోడ్ ఓవర్ బ్రిడ్జిని 56, 65, 66 డివిజన్ల కార్పొరేటర్లు సిరంగి సునిల్‌కుమార్, గుగులోత్ దివ్యారాణి రాజు నాయక్, గురుమూర్తి శివకుమార్, రైల్వే డిప్యూటీ సీఈ సాగర్‌తో కలిసి సోమవారం ఎమ్మెల్యేలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూ. 41 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టులను నిర్మించిందని అన్నారు. ప్రధాని మోదీ అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేశారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పథకాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగేందర్‌రావు, కాంగ్రెస్ శ్రేణులు కొంక హరిబాబు, కందుకూరి పూర్ణచందర్, గడ్డం శివరాంప్రసాద్, బీఆర్ఎస్ నేతలు రుద్రోజు మణీంద్రనాథ్, బీజేపీ నేతలు రాంచంద్రారెడ్డి, మహేందర్ పటేల్ పాల్గొన్నారు.

కాజీపేటలో ...

కాజీపేట : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కాజీపేట డీజిల్ షెడ్ వద్ద సోమవారం అండర్ పాస్ బ్రిడ్జిని ప్రారంభించారు. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, సీనియర్ డీఎంఈ అంకేశ్వరపు స్వరాజ్‌కుమార్‌తో కలిసి అండర్ పాస్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. కాజీపేట ప్రజల 40 ఏళ్ల కల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డ్రాయింగ్ పోటీలలో విజయం సాధించిన స్కూల్ పిల్లలకు కార్పొరేటర్ల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

నేడు ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల మహాసభ


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 26 : ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం 3194 రాష్ట్ర మహాసభలను ఈ నెల 27న ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ఎంజీఎం బ్రాంచ్ అధ్యక్షురాలు జి.ప్రేమలత తెలిపారు. సోమవారం వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిపాక కార్తీక్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాంతికుమారి, సదని రాజ్యలక్ష్మీ, శైలజ, అనీల్‌బిల్లా, నవీన్, సిద్దయ్య, చారి, రథంసింగ్, సునీల్, యాకూబీ పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలి

సుబేదారి, ఫిబ్రవరి 26: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకుడు మార్నేని ఉదయభానురావు క్రీడాకారులకు సూచించారు. రాము మిత్రమండలి ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రాము స్మారక క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు క్రీడలను ఉదయభానురావు ప్రారంభించి మాట్లాడారు. ఈ టోర్నీలో 50 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని, విజేతగా నిలిచిన జట్టుకు రూ. 50వేలు, రన్నరప్ జట్టుకు రూ. 30వేల నగదుతో పాటు షీల్డ్‌లు అందజేస్తామని తెలిపారు. రెండో రోజు క్రీడలు హోరాహోరీగా జరిగాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 26 : వేసవికాలం దృష్ట్యా ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్, ఇతర అధికారులతో వేసవి తాగునీటి సమస్యపై కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్య ఎక్కువగా ఉందని, వాటి మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మసాగర్, వడ్డెపల్లి, కేయూ ఫిల్టర్‌బెడ్ నుంచి తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతీ రోజు ఈ అంశంపై అధికారులు సమీక్షించాలని అన్నారు. అదే విధంగా నయీంనగర్ నాలా అభివృద్ధి పనులు జరిగే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా దారి మళ్లింపునకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారీ, ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, మైనార్టీ వెల్ఫేర్ డీడీ మేన శ్రీను, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈలు ప్రదీప్‌చంద్ర, కృష్ణారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకన్న, ఈఈ రాజయ్య, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్, అధికారులు ఆంజనేయులు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఆహార కల్తీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆహార కల్తీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని నాచారంలోని ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మైక్రో బయాలజీ ఆహార కల్తీ పరీక్ష కేంద్రాన్ని వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న వంట నూనెల్లో నాసిరకం క్రూడాయిల్ కల్తీ, అందమైన ప్యాకింగ్‌తో ఉన్న సేమియాలో మైదా కల్తీ, చిన్న పిల్లలు ఇష్టంగా తినే న్యూడిల్స్‌లో అధికంగా హానికరమైన గ్లూటామెట్ మోనోసిడియం కల్తీలపై నాణ్యత పరీక్షలు నిర్వహించాలని కోరారు.

ఎలాంటి నియామక పత్రాలు ఇవ్వలేదు

ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 26 : ఎంజీఎం ఆస్పత్రిలో కాంట్రాక్ట్ నియామక పత్రాలు ఇవ్వలేదని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని సామాజిక మాధ్యమాల్లో రీజినల్ మెడికల్ ఆఫీసర్, ఎంజీఎం సూపరింటెండెంట్ పేరుతో నియామక పత్రాలు ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. బోగస్ పత్రాల్లో పేర్కొన్నట్లు డాక్టర్ జె.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ యాదవ్‌కుమార్ పేరుతో ఏ అధికారి పనిచేయడం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి విషయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

మడికొండ, ఫిబ్రవరి 26: మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో సోమవారం స్థానిక సీఐ డి. ప్రతాప్ విద్యార్థులతో సమావేశమయ్యారు. త్వరలో జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయంతో కాకుండా ఇష్టంతో చదివి అవగాహన పెంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖుర్షీద్, ఉపాధ్యాయులు, ఎస్సై దివ్య, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సుబేదారి, ఫిబ్రవరి 26: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో సోమవారం సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. గడిచిన 10 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచి పెడుతూ రైతులను, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేపట్టిన చారిత్రాత్మక పోరాటం ఫలితంగా కేంద్రం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని, వ్యవసాయ, సహకార రంగాలను కార్పొరేట్ శక్తులకే అప్పగించేందుకు నిర్ణయించిందన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, అనిల్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గవర్నర్ పదవి ఎంతో కీలకమైంది

బీజేపీలో కష్టపడ్డ వారికి గుర్తింపు
త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



గవర్నర్‌ను సన్మానిస్తున్న సిటీజన్ ఫోరం, బీజేపీ నాయకులు

సుబేదారి, ఫిబ్రవరి 26 : గవర్నర్ పదవి ఎంతో కీలకమైందని, కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా ముఖ్యభూమిక పోషించేదని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఓరుగల్లు సిటీజన్స్ ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం రాత్రి ఆయనకు సన్మాన కార్యక్రమం జరిగింది. తొలుత ఆయనకు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికగా.. సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య గవర్నర్ పదవి ఎంతో కీలకమైందని, అలాంటి ఉన్నతమైన పదవి తనకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీజేపీలో మొదటి నుంచి ఎంతో కష్టపడి పని చేశానని, తనకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ మేయర్ టి. రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మె ల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, ఘంట రవికుమార్, నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, కొండేటి శ్రీధర్, విజయ్ చందర్ రెడ్డి, ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎ.సమ్మిరెడ్డి, కోకన్వీనర్ ఎ.నాగరాజు పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 26 : విజయ సంకల్పయాత్రను విజయవంతం చేసి, మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. సోమవారం హంటర్‌రోడ్ దీన్‌దయాల్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మార్చి 1వ తేదీన వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగే విజయ సంకల్ప యాత్ర విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకతీయ-భద్రకాళి క్లస్టర్ బస్సు యాత్ర మార్చి 1న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమకొండ చౌరస్తాలో ఉదయం 10.30 గంటలకు కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్, అమరవీరుల స్థూపం మీదుగా కాజీపేట వరకు బైక్ ర్యాలీ ఉంటుందని వివరించారు. ఈ యాత్రలో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావు పద్మ తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు కందగట్ల సత్యనారాయణ, రావుల కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందంగౌడ్, నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్లు రావుల సుదర్శన్, విఎద్దెల బాబు, జిల్లా పదాధికారులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాజయ్యను పార్టీలోకి తీసుకోవాలి

కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

కాజీపేట, ఫిబ్రవరి 26 : మాజీ మంత్రి డాక్టర్ టి. రాజయ్యను పార్టీలోకి తీసుకోవాలని టీపీసీసీ నాయకుడు ఎడబోయిన ప్రభాకర్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాజీపేట మీడియా పాయింట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజయ్య రాకతో పార్టీ మరింత బలోపేతం కానుందని, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ పరిణామం పార్టీకి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అదే విధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మెరుగైన ఫలితాలు సాధించవచ్చాన్నారు. వీటన్నింటిని కులంకషంగా పరిశీలించి రాజయ్యను పార్టీలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సతీశ్‌రెడ్డి, ప్రణీత్, ఇబ్రహీం, మనోహర్, సతీశ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టుటైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 26: కేయూ పార్టుటైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వర్సిటీ పార్టుటైం అధ్యాపకులు తమ డిమాండ్ల సాధన కోసం బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టుటైం అధ్యాపకుల వద్దకు వచ్చిన ఎమ్మెల్యే నాయిని వారి సమస్యలను తెలుసుకున్నారు. పార్టుటైం అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు, నరేందర్, దేవోజీ, వినోద, శేషు, వినీత, సుధీర్, రమేశ్, డాక్టర్ బొల్లికొండ వీరేందర్, విజయ్, చారి, శ్రీధర్, స్వామి, చరణ్, భిక్షపతిలు పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐల బదిలీ

14 మంది ఎస్ఐలకు స్థానచలనం
ఉత్తర్వులు జారీ చేసిన సీపీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 26 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీఐ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒకే పార్లమెంట్ పరిధిలో మూడు సంవత్సరాల పాటు పని చేసిన వారు, ఒకే ప్రాంతంలో జన్మించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న వారిని ముందస్తుగా బదిలీ చేశారు. ఇంకా కొందరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి. వారి సర్వీస్ బుక్, పూర్తి సమాచారాన్ని హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి సోమవారం పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఎక్కువ కాలం ఒకే స్థానంలో విధులు నిర్వరిస్తున్న 14మంది ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

సీఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
ఇ. శ్రీనివాస్	దుగ్గొండి	పర్వతగిరి సర్కిల్
బి. రాజగోపాల్	పర్వతగిరి సర్కిల్	దుగ్గొండి
ఎ. మహేందర్	ఎస్‌బీ వరంగల్	ధర్మసాగర్
డి. విశ్వేశ్వర్	ధర్మసాగర్	వీఆర్ వరంగల్

ఎస్ఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
జి. వెంకన్న	మిల్స్‌కాలనీ	పర్వతగిరి
ఇ. వీరభద్రరావు	పర్వతగిరి	కమలాపూర్
మునావత్ రమేష్	పరకాల	కమలాపూర్
ఎల్. రమేష్	వీఆర్	సంగెం
ఎం. భరత్	సంగెం	జనగామ
ఇ. నర్సింహరావు	టాస్క్‌ఫోర్స్	జనగామ
బి. రామారావు	హనుమకొండ	వీఆర్
బండారి రాజు	ధర్మసాగర్	వీఆర్
ఆర్. రామారావు	కాజీపేట	నర్సంపేట
ఇ. రాజేందర్	సీసీఎస్ వరంగల్	వీఆర్
కె. సంపత్‌కుమార్	సీసీఎస్ వరంగల్	వీఆర్
ఎస్. బాపురావు	సీసీఎస్ వరంగల్	వీఆర్
కె. విద్యాసాగర్	సీసీఎస్ వరంగల్	షీటీమ్స్
ఎం. రాజు	సీసీఎస్ వరంగల్	వీఆర్

క్రికెట్‌లో రాజకీయ పెత్తనం
ఆంధ్రకు ఆడను

- ఏపీ జట్టుకు హనుమ విహారి గుడ్‌బై
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్న క్రికెటర్

వాళ్లు చెప్పిన ఆటగాళ్లనే టోర్నీకి ఎంపిక చేయాలి.. వాళ్లు సూచించిన వారినే తుది జట్టులో ఆడించాలి.. లేదంటే పార్టీ నేతల నుంచి నేరుగా క్రికెట్ సంఘానికి ఫోన్లు రావడం.. వినకపోతే అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో ఒత్తిడి చేయించడం.. ఇదంతా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో కొన్నాళ్లుగా జరుగుతున్న వైసీపీ 'రాజకీయ'ం.

ఇప్పుడీ రాజకీయ క్రీడకు అంతర్జాతీయస్థాయి ఆటగాడిని బలి చేశారు. సర్వశక్తులూ ఒడ్డి తన సారథ్యంలో ఆంధ్ర జట్టుకు మరపురాని విజయాలందించిన టీమిండియా టెస్టు ఆటగాడు గాదె హనుమ విహారిని ఘోరంగా అవమానించారు. రాజకీయ పార్టీ నేత కుమారుడి కోసం అతడిని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి తమ వికృతమైన ఆటను ప్రదర్శించారు. ఇదంతా స్వయంగా విహారీనే వెల్లడించాడు. ఏపీ క్రికెట్‌లో నేతల జోక్యం ఎక్కువైందని మనస్తాపం వ్యక్తం చేసిన విహారి.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన చోట ఉండలేననీ, జన్మలో ఆంధ్రకు ఆడేది లేదని సంచలన ప్రకటన చేశాడు. క్రీడా సంఘాలకు రాజకీయ చీడపడితే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పేందుకు విహారి ఉదంతమే నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



హైదరాబాద్/విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో రాజకీయ పెత్తనం మరోసారి రచ్చకెక్కింది. రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు క్వార్టర్‌ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించిన హనుమ విహారి ఏసీఏలో జరుగుతున్న రాజకీయాలను బహిర్గతం చేశాడు. ఈ ఏడాది రంజీ సీజన్ మధ్యలోనే తాను ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో వెల్లడించాడు. రాజకీయ నేతల జోక్యంతోనే కెప్టెన్సీ నుంచి తప్పుకొన్నానని సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ పెట్టాడు. జట్టుకు సంబంధించిన విషయంలో ఓ రాజకీయ నేత కుమారుడైన ఆటగాడితో గొడవ జరిగినందుకు ఏసీఏ పెద్దలు తనపై వేటు వేశారని ఆరోపించాడు. ఇది తనను ఎంతో వేదనకు గురి చేసిందనీ, భవిష్యత్‌లో ఆంధ్ర జట్టుకు ఆడేదే లేదంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నాడు. 'ఈ రంజీ సీజన్‌లో జట్టు పరంగా మేమెంతో పోరాడాం. అయినా క్వార్టర్స్‌లో ఓడినందుకు బాధగా ఉంది. ఈ పోస్ట్ ద్వారా కొన్ని విషయాలను మీ ముందు పెడుతున్నా. రంజీల్లో బెంగాల్‌తో మ్యాచ్‌కు నేనే జట్టు కెప్టెన్‌గా ఉన్నా. ఆ సమయంలో జట్టులోని 17వ ఆటగాడిపై అరిచాను. దీంతో అతడు రాజకీయ నాయకుడైన తన తండ్రికి ఫిర్యాదు చేశాడు. నాపై చర్యలు తీసుకోవాలని ఆ రాజకీయ నేత ఏసీఏపై ఒత్తిడి చేశాడు. నా తప్పు లేకున్నా, కెప్టెన్‌గా వైదొలగమని సూచించారు. జట్టు కోసం ఎంతగానో పోరాడి, గాయం వేధిస్తున్నా బ్యాటింగ్ చేసి, ఆంధ్రను ఐదు సార్లు నాకౌట్ దశకు తీసుకెళ్లి నా అంకితభావాన్ని చాటుకున్నా. భారత జట్టు తరఫున 16 టెస్టులు ఆడా. అయినా నాకంటే అతడే వాళ్లకు ముఖ్యుడయ్యాడు. అసోసియేషన్ తీరుతో ఎంతో వేదనకు గురయ్యా. నా ఆత్మగౌరవం దెబ్బ తినేలా అవమానించారు. అందుకే భవిష్యత్‌లో ఆంధ్రకు ఆడరాదని నిర్ణయం తీసుకున్నా' అని తన సుదీర్ఘమైన పోస్టులో విహారి ఆవేదన వ్యక్తం చేశాడు.

వైసీపీ నేత కుమారుడి వల్లే...

ఆంధ్ర రంజీ జట్టులో 17వ ఆటగాడిగా చేరిన చిత్తూరుకు చెందిన వైసీపీ నేత కే. నరసింహా చారి కుమారుడు పృథ్వీరాజ్ విషయంలో ఏర్పడిన స్వల్ప వివాదం విహారి జట్టు నుంచి వైదొలగడానికి కారణమైంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేటరైన నరసింహా చారి.. వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుడని సమాచారం. ఇక.. వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు హర్షిత్ రెడ్డి చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. వాస్తవానికి పృథ్వీని రంజీ జట్టుకు ఎంపిక చేయడంలోనూ రాజకీయ నేతల ప్రమేయముందన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, విహారి ఉదంతంపై ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో 'ఏసీఏలో మితిమీరుతున్న వైసీపీ పెత్తనం?' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. విశ్వసనీయ సమాచారం మేరకు.. గతనెల 5 నుంచి 8 వరకు విశాఖలో బెంగాల్‌తో జరిగిన రంజీ మ్యాచ్ సందర్భంగా ఈ వివాదం చోటు చేసుకుంది. టీ విరామ సమయంలో ఆ మ్యాచ్ కెప్టెన్ విహారి డ్రెస్సింగ్ రూమ్‌లో తోటి ఆటగాళ్లతో చర్చిస్తున్నాడు. నిబంధనల ప్రకారం జట్టులోని 15 మంది ఆటగాళ్లకు మాత్రమే డ్రెస్సింగ్ రూమ్‌లోకి ప్రవేశం ఉంటుంది. అయితే, 17వ ఆటగాడైన పృథ్వీ అక్కడ కనిపించడంతో మేనేజర్‌ను విహారి ప్రశ్నించాడు. ఈ విషయంలోనే విహారితో జరిగిన గొడవను అవమానంగా భావించిన పృథ్వీ.. తన తండ్రికి ఫోన్ చేశాడు. సదరు నేత చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం నుంచి ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డికి ఫోన్ చేయించి తన కుమారుడిని అవమానించిన విహారిపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశాడట. దీనిపై ఏసీఏ యాజమాన్యం కూడా తననే వివరణ అడగడంతో విహారి ఆవేదనకు గురయ్యాడు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడి ఎక్కువవడంతో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. తర్వాతి మ్యాచ్‌లకు జట్టు పగ్గాలను రికీ భుయ్‌కు అప్పగించారు.



అంతా విజయసాయి కనుసన్నల్లోనే..

రాష్ట్రంలో క్రీడా సంఘాలను ఇప్పటికే తన గుప్పిట్లో ఉంచుకున్నాడన్న ఆరోపణలున్న వైసీపీ ముఖ్య నేత విజయసాయి రెడ్డి కనుసన్నల్లోనే ఏసీఏ నడుస్తోందని సమాచారం. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రా రెడ్డి విజయసాయికి సమీప బంధువు. లిక్కర్ స్కామ్‌లో అభియోగాలు ఎదుర్కొంటున్న శరత్‌చంద్రా రెడ్డి ఏసీఏ పదవికి అనర్హుడయ్యే అవకాశం ఉన్నందున తన సోదరుడు రోహిత్ రెడ్డిని ఉపాధ్యక్షునిగా నియమించుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. విజయసాయికి రోహిత్ రెడ్డి అల్లుడు కావడం గమనార్హం. ఇలా, ఏసీఏలో తన బంధుగణాన్ని ఏర్పరచుకున్న విజయసాయి ఆంధ్ర క్రికెట్ వ్యవహారాల్లోనూ తలదూర్చుతున్నాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిధులు అధికంగా ఉండే క్రీడా సంఘాలను ఎంచుకొని వాటిని వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. క్రీడల్లో వైసీపీ నేతల జోక్యంపై గత నవంబరులోనే 'క్రీడలపైనా కక్ష..!' అన్న పేరుతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే.

విహారికే ఆటగాళ్ల మద్దతు

ఈ వివాదంలో ఆంధ్ర జట్టు ఆటగాళ్లంతా హనుమ విహారికే మద్దతుగా నిలుస్తున్నారు. విహారినే కెప్టెన్‌గా కొనసాగించాలంటూ జట్టు సభ్యులంతా కలిసి సంతకాలు చేసిన లేఖను ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)కు అందించారు. సారథిగా విహారి ఉండడం జట్టుకు చాలా ముఖ్యమని ఆ లేఖలో ఆటగాళ్లు తెలిపారు. ఆటగాళ్లంతా విహారికే మద్దతిస్తున్నా, ఏసీఏ మాత్రం ఆ లేఖను పట్టించుకుంటున్నట్టు లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ విహారిని మళ్లీ జట్టులోకి తీసుకునే ప్రసక్తే లేదని ఏసీఏ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం.

ఇంతకుమించి ఏమీ పీకలేవు

విహారిపై పృథ్వీరాజ్ తీవ్ర వ్యాఖ్యలు

రాజకీయ నేత కుమారుడిపై అరిచినందుకే తనను కెప్టెన్సీ నుంచి తప్పించారంటూ విహారి చేసిన వ్యాఖ్యలపై సదరు నేత కుమారుడు, ఆటగాడు పృథ్వీరాజ్ స్పందించాడు. విహారి చెప్పిందంతా అబద్ధమని, అసభ్యకరంగా దూషించడాన్ని ఎవరూ అంగీకరించరనీ.. ఇంతకుమించి ఏమీ పీకలేవు అంటూ పృథ్వీరాజ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'ఆరోజు ఏం జరిగిందో జట్టులోని ప్రతి ఒక్కరికీ తెలుసు. చాంపియన్ అని చెప్పుకునే నీవు ఇంతకుమించి ఏం పీకలేవు. కావాల్సిన విధంగా సింపథీ గేమ్స్ ఆడుకో' అని పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

ఆరోపణలు అవాస్తవం: ఏసీఏ

విహారి ఆరోపణలను ఏసీఏ ఖండించింది. బెంగాల్‌తో మ్యాచ్ సందర్భంగా అందరి ముందూ విహారి తనను వ్యక్తిగతంగా దూషించినట్టు సదరు ఆటగాడు తమకు ఫిర్యాదు చేశాడని ఏసీఏ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. జాతీయ జట్టుకు ఎంపికయ్యే అవకాశాలున్నందునే విహారిని కెప్టెన్సీ నుంచి తప్పించామని తెలిపింది.

ఒత్తిడి తేలేదు

పృథ్వీరాజ్ తండ్రి నరసింహాచారి

తిరుపతి (ఆంధ్రజ్యోతి): విహారిని కెప్టెన్‌గా తొలగించాలంటూ ఏసీఏపై తాను ఎలాంటి ఒత్తిడీ తీసుకురాలేదని పృథ్వీరాజ్ తండ్రి, వైసీపీ కార్పొరేటర్ నరసింహాచారి అన్నారు. 'రంజీ జట్టుకు ఎంపికైనా కూడా రెండున్నర నెలలుగా నా కుమారుడిని ఆడించడంలేదు. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ పృథ్వీని మానసికంగా ఇబ్బంది పెట్టారు. విహారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు జట్టులో అస్సలు ఆడని నా కొడుకుపై అపవాదు వేయడం సరికాదు' అని నరసింహా చారి వివరించారు.

'బజ్‌బాల్'కు బీటలు

నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ విజయం

- 3-1తో సిరీస్ వశం
- గిల్, ధ్రువ్ అద్భుత పోరాటం





రాంచీ: భారత్ దెబ్బకు.. ఇంగ్లండ్ 'బజ్‌బాల్' బీటలు వారింది. 84/0తో పటిష్ఠ దశ నుంచి 120/5తో కష్టాల్లోపడ్డప్పుడు.. కుర్రాళ్లు శుభ్‌మన్ గిల్ (52 నాటౌట్), ధ్రువ్ జురెల్ (39 నాటౌట్) మొక్కవోని పట్టుదలతో పోరాడారు. దీంతో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్ట్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. ఐదు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకొంది. స్వదేశంలో టీమిండియాకిది వరుసగా 17వ సిరీస్ గెలుపు కావడం విశేషం. ఇంగ్లండ్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 40/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 192/5 స్కోరు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (55) అర్ధ శతకం సాధించగా.. జైస్వాల్ (37) ఫర్వాలేదనిపించాడు. బషీర్ 3 వికెట్లు తీశాడు. జురెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఐదవ, ఆఖరి టెస్ట్ వచ్చేనెల 7 నుంచి ధర్మశాలలో జరగనుంది.

ధాటిగా ఆరంభించి..: విజయానికి కావాల్సింది మరో 152 పరుగులే కావడంతో.. భారత గెలుపుపై ఎవరికీ ఎటువంటి అనుమానాల్లేవు. అందుకు తగ్గట్టుగా తొలి సెషన్‌ను రోహిత్, జైస్వాల్ ఆశావహంగానే ఆరంభించారు. అండర్సన్ బౌలింగ్‌లో హిట్‌మ్యాన్.. మిడాన్ మీదుగా చూడముచ్చటైన సిక్స్‌తో దాడికి దిగాడు. మరోవైపు జైస్వాల్.. బషీర్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లతో జోరు చూపాడు. దీంతో వీరి భాగస్వామ్యాన్ని విడదీయడానికి స్టోక్స్.. 18వ ఓవర్‌లో రూట్‌ను రంగంలోని దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టిన రూట్.. మూడో బంతికే జైస్వాల్‌ను అవుట్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రోహిత్‌ను హార్ట్‌లీ వెనక్కి పంపగా.. రజత్ పటీదార్ (0)ను బషీర్ డకౌట్ చేశాడు. కానీ, గిల్, జడేజా (33 బంతుల్లో 4) ఆచితూచి ఆడడంతో భారత్ 118/3తో లంచ్‌కు వెళ్లింది.

ఒడిదుడుకులకు లోనైనా..: రెండో సెషన్ ఆరంభంలో వెంటవెంటనే రెండు వికెట్లు చేజార్చుకొన్న టీమిండియా ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. కానీ, గిల్, జురెల్ ఆరో వికెట్‌కు 72 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. 39వ ఓవర్‌లో బషీర్ వేసిన ఫుల్‌టాస్ బంతిని జడేజా నేరుగా బెయిర్‌స్టో చేతుల్లోకి కొట్టాడు. ఆ తర్వాతి బంతికే సర్ఫరాజ్ (0)ను కూడా బషీర్ అవుట్ చేయడంతో.. టీమిండియా 120/5తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. ఈ దశలో గిల్, జురెల్.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ టీమ్‌ను లక్ష్యం దిశగా నడిపించారు. 31 బంతులు ఎదుర్కొన్న తర్వాత కానీ ధ్రువ్ తొలి బౌండ్రీ సాధించలేదు. మరోవైపు 119 బంతులాడి ఒక్క ఫోర్ కూడా కొట్టని గిల్.. గెలుపునకు 20 పరుగులు అవసరమైనప్పుడు బషీర్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లతో ఊపిరి పీల్చుకున్నాడు. ఆ తర్వాత జురెల్ ఫోర్, డబుల్‌తో జట్టుకు అద్వితీయమైన విజయాన్ని అందించాడు.

1

సొంతగడ్డపై వరుసగా అత్యధిక (17) టెస్ట్ సిరీస్‌లు నెగ్గిన జట్టుగా భారత్. 2013లో ఆస్ట్రేలియాపై విజయంతో టీమిండియా ఈ జైత్రయాత్రను ప్రారంభించింది. 1994-2000, 2004-2008 మధ్య ఆసీస్ వరుసగా పదేసి సిరీస్‌లు నెగ్గింది.

మెకల్లమ్, స్టోక్స్ హయాంలో 2022లో 'బజ్‌బాల్' ఆట తీరును ఎంచుకొన్న తర్వాత ఇంగ్లండ్ సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి. అంతేకాకుండా వరుసగా మూడు టెస్ట్‌ల్లో ఓడడం కూడా ఇదే ప్రథమం.

స్కోరు బోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 307; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 145.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 55, జైస్వాల్ (సి) అండర్సన్ (బి) రూట్ 37, గిల్ (నాటౌట్) 52, రజత్ (సి) పోప్ (బి) బషీర్ 0, జడేజా (సి) బెయిర్‌స్టో (బి) బషీర్ 4, సర్ఫరాజ్ (సి) పోప్ (బి) బషీర్ 0, జురెల్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 61 ఓవర్లలో 192/5; వికెట్ల పతనం:** 1-84, 2-99, 3-100, 4-120, 5-120; **బౌలింగ్:** రూట్ 7-0-26-1, హార్ట్‌లీ 25-2-70-1, బషీర్ 26-4-79-3, అండర్సన్ 3-1-12-0.

దుమ్మురేపిన ఢిల్లీ

షఫాలీ, లానింగ్ హాఫ్ సెంచరీలు

దెబ్బతీసిన కాప్, రాధ.. యూపీ చిత్తు



మరిజన్నే కాప్ (3/5)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్.. డబ్ల్యూపీఎల్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. షఫాలీ వర్మ (64 నాటౌట్), మెగ్ లానింగ్ (51) అర్ధ శతకాలతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజన్నే కాప్ (3/5) విజృంభించడంతో.. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 119/9 స్కోరు చేసింది. శ్వేత షెహ్రావత్ (45) ఒంటరి పోరాటం చేసింది. రాధా యాదవ్ 4 వికెట్లు పడగొట్టింది. టాపార్డర్ బ్యాటర్లు బ్రింద (0), తహిల మెక్‌గ్రాత్ (1), కెప్టెన్ అలిస్సా హీలీ (13)ను అవుట్ చేసిన కాప్.. యూపీని పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. ఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో 123/1 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు లానింగ్, షఫాలీ జట్టుకు ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. 12వ ఓవర్‌లో షఫాలీ అర్ధ శతకాన్ని పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. గెలుపునకు ఒక్క పరుగు కావాల్సి ఉండగా లానింగ్‌ను ఎకిల్‌స్టోన్ అవుట్ చేసినా.. జెమీమా (4 నాటౌట్) ఫోర్‌తో ముగించింది.

సంక్షిప్త స్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 119/9 (శ్వేత 45, గ్రేస్ హ్యారిస్ 17; రాధ 4/20, కాప్ 3/5); **ఢిల్లీ: 14.3 ఓవర్లలో 123/1** (షఫాలీ 64 నాటౌట్, లానింగ్ 51; ఎకిల్‌స్టోన్ 1/31).

ఉత్కంఠపోరులో ఆంధ్ర ఓటమి

ఇండోర్: ఉత్కంఠగా సాగిన రంజీ క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్ర 4 పరుగులతో మధ్యప్రదేశ్ చేతిలో ఓటమిపాలైంది. 169 పరుగుల ఛేదనలో ఆంధ్ర తడబడింది. ఓవర్‌నైట్ స్కోరు 95/4తో నాలుగోరోజు సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఏపీ జట్టులో విహారి (55) మినహా అంతా చేతులెత్తేశారు. దీంతో ఆంధ్ర 165 పరుగులకు కుప్పకూలింది. అనుభవ్ అగర్వాల్ 6 వికెట్లతో ఆంధ్ర జట్టు పతనాన్ని శాసించాడు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేసింది. మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 234, రెండో ఇన్నింగ్స్‌లో 107 రన్స్ సాధించింది. ఇక, బరోడాతో క్వార్టర్స్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 379 పరుగులతో ఆడుతున్న ముంబై ఆధిక్యం మొత్తమ్మీద 415కు చేరుకుంది. బరోడా రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కే దిగనుందున తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై సెమీస్ చేరడం దాదాపు ఖాయమే. విదర్భతో క్వార్టర్‌ఫైనల్లో గెలవాలంటే కర్ణాటక మరో 268 పరుగులు సాధించాల్సివుంది. 371 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక నాలుగోరోజు ఆట చివరికి వికెట్ నష్టానికి 103 పరుగులు చేసింది.

పీకేఎల్ సెమీస్‌కు స్టీలర్స్, పైరేట్స్

హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. సోమవారం ఇక్కడ జరిగిన ఎలిమినేటర్ 2 పోరులో స్టీలర్స్ 42-25తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఎలిమినేటర్ 1 మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37-35తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది.



రఘువంశీ నుంచి మైక్రో టర్బోజెట్ ఇంజన్

హైదరాబాద్: అంతరిక్షం, రక్షణ రంగానికి చెందిన హైదరాబాద్ కంపెనీ రఘువంశీ మెషీన్ టూల్స్ (ఆర్‌వీఎంటీ).. 'ఇంద్రా ఆర్‌వీ25: 240ఎన్' పేరుతో పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన మైక్రో టర్బోజెట్ ఇంజన్‌ను ఆవిష్కరించింది. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, రక్షణ శాఖ మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జీ సతీశ్ రెడ్డి సమక్షంలో దీన్ని సోమవారం విడుదల చేసింది. పూర్తిగా దేశీయంగా మైక్రో టర్బోజెట్ ఇంజన్ అభివృద్ధి చేసినందుకు గర్వంగా ఉందని.. ఏరోస్పేస్ ఆవిష్కరణలకు అంతర్జాతీయ హబ్‌గా ఎదిగేందుకు మనకున్న బుద్ధి కుశలత, కృతనిశ్చయానికిదే నిదర్శనమని ఆర్‌వీఎంటీ ఎండీ వంశీ వికాస్ అన్నారు.

ప్రావిడెన్స్‌లో మరో 2500 ఉద్యోగాలు

» హైదరాబాద్ కేంద్రం విస్తరణ

హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగానికి సేవలందించే ప్రావిడెన్స్ ఇండియా సోమవారం హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఆరోగ్య సంరక్షణ రంగం ముఖచిత్రాన్ని కృత్రిమ మేధ, కొత్త టెక్నాలజీలు పూర్తిగా మార్చివేస్తాయని ఆయన ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, దీని వల్ల ప్రజల ఆరోగ్య సమాచారం అంతా డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చి చికిత్సా విధానం సులభం అవుతుందని ఆయన తెలిపారు. వచ్చే రెండేళ్లలో నాలుగు కోట్ల మంది హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్టు చెప్పారు. రాయదుర్గంలో 9 అంతస్తుల భవనంలో ఏర్పాటు చేసిన ప్రావిడెన్స్ కొత్త సెంటర్ ప్రస్తుతం పని చేస్తున్న సెంటర్‌కు అదనంగా పని చేస్తుంది. ప్రస్తుతం తమ వద్ద 1400 మంది పని చేస్తుండగా వచ్చే రెండు, మూడు సంవత్సరాల కాలంలో వారి సంఖ్య 4000కి పెంచుకోవాలనుకుంటున్నట్టు కంపెనీ చీఫ్ గ్లోబల్ ఆఫీసర్, కంట్రీ హెడ్ మురళీకృష్ణ తెలిపారు. మరిన్ని ఆస్పత్రులతో భాగస్వామ్యాలు కుదుర్చుకోనున్నట్టు చెప్పారు.

బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్ భారీ పెట్టుబడి

హైదరాబాద్: గ్లోబల్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్ హైదరాబాద్‌లో అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంపై కంపెనీ 10 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ కేంద్రం ఇన్నోవేషన్ హబ్‌గా ఉంటుందంటూ ఈ భవనంలో 1500 మంది ఉద్యోగులు పని చేసే వసతి అందుబాటులో ఉందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్రిస్టఫర్ బోర్నర్ తెలిపారు. ఈ కొత్త కేంద్రం హైదరాబాద్‌లో ఔషధ అన్వేషణ రంగాన్ని వేగవంతం చేయడంతో పాటు తమ సామర్థ్యాలను పెంచుతుందని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న స్థానిక ప్రతిభను నియమించుకోవడం ద్వారా తమ సామర్థ్యాలు విస్తరించడం తమ లక్ష్యమని చెప్పారు.

పీపీబీఎల్ చైర్మన్ పదవికి విజయ్ శేఖర్ శర్మ రాజీనామా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) పార్ట్‌టైం నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవికి విజయ్ శేఖర్ శర్మ రాజీనామా చేశారు. అలాగే, బ్యాంక్ బోర్డునూ పునర్‌వ్యవస్థీకరించారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ శ్రీనివాస్ శ్రీధర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవేంద్రనాథ్ సారంగి, బ్యాంక్ ఆఫ్ బరోడా మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ కుమార్ గార్గ్, మాజీ ఐఏఎస్ అధికారి రజినీ సెఖ్రీ సిబల్‌తో కొత్త బోర్డు ఏర్పాటు చేసినట్లు వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. వీరంతా బోర్డులో ఈమధ్యనే స్వతంత్ర డైరెక్టర్లుగా చేరినట్లు తెలిపింది. విజయ్ శేఖర్ శర్మ వైదొలిగిన నేపథ్యంలో కొత్త చైర్మన్ నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు పీపీబీఎల్ విడిగా వెల్లడించింది. ఈనెల 29 తర్వాత నుంచి పీపీబీఎల్ తన ఖాతాదారుల అకౌంట్లు, వాలెట్ వంటి ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్స్‌లో డిపాజిట్లు, క్రెడిట్ లేదా టాప్-అప్ లావాదేవీలు నిర్వహించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. ఆ తర్వాత డెడ్‌లైన్‌ను మార్చి 15 వరకు పొడిగించింది.

పేటీఎంతో సలహా కమిటీ చర్చలు

వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌తో టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌పై తమ సలహా కమిటీ చర్చిస్తున్నదని కమిటీ అధ్యక్షుడు, సెబీ మాజీ చైర్మన్ ఎం దామోదరన్ తెలిపారు. పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో నియంత్రణ నియమావళి పాటించే విషయంలో కంపెనీని బలోపేతం చేసేందుకు వన్97 కమ్యూనికేషన్స్ ఈ సలహా కమిటీని ఏర్పాటు చేసింది.

అప్పర్ సర్క్యూట్‌ను తాకిన షేరు

సోమవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. 5 శాతం లాభంతో రూ.427.95కు చేరుకుంది. 'ఎట్ పేటీఎం' యూపీఐ హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న పీపీబీఎల్ కస్టమర్లను ఇతర బ్యాంక్‌లకు బదిలీ చేసే అవకాశాలను పరిశీలించాలని ఎన్‌పీసీఐని రిజర్వ్ బ్యాంక్ కోరిన నేపథ్యంలో కంపెనీ షేర్లు పుంజుకున్నాయి.

నేటి నుంచి ఆంధ్రా సిమెంట్స్ ఓఎఫ్ఎస్

హైదరాబాద్: ఆంధ్రా సిమెంట్స్ కంపెనీ మంగళ, బుధవారాల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా కంపెనీ ఈక్విటీలో ఐదు శాతం వాటాను విక్రయిస్తోంది. ఇందుకోసం రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరు ఫ్లోర్ ధరను రూ.80 ప్రీమియంతో రూ.90గా నిర్ణయించింది. దివాలా ప్రక్రియలో ఉన్న జైపీ గ్రూపునకు చెందిన ఈ కంపెనీని జనవరిలో సాగర్ సిమెంట్స్ కొనుగోలు చేసింది. ఇపుడు సాగర్ సిమెంట్స్ కంపెనీ ఈక్విటీలో ఐదు శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తోంది.

టాటా గ్రూప్ నుంచి మెగా ఐపీఓ!

టాటా గ్రూప్ మరో మెగా ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ టాటా పాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ (టీపీఈఎంఎల్) 100 కోట్ల డాలర్ల నుంచి 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,300 కోట్ల నుంచి రూ.16,500 కోట్లు) ఐపీఓ జారీ చేయబోతున్నట్టు సమాచారం. అయితే ఈ మెగా ఐపీఓకు ఒకటి రెండేళ్ల సమయం పడుతుందని భావిస్తున్నారు. ఈవీ కార్ల మార్కెట్‌లో టీపీఈఎంఎల్ తయారు చేసే పంచ్ ఈవీ, టియాగో ఈవీలకు ప్రస్తుతం మార్కెట్‌లో 70 శాతం వాటా ఉంది. మరో రెండేళ్లలో కొత్తగా 10 ఈవీ కార్లను మార్కెట్‌లో విడుదల చేయడం ద్వారా వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష ఈవీ కార్ల లక్ష్యాన్ని చేరుకోవాలని యోచిస్తోంది.

లాభాల స్వీకారంతో కుంగిన మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. లాభాల స్వీకరణ అమ్మకాలతో సెన్సెక్స్ 352.67 పాయింట్ల నష్టంతో 72,790.13 వద్ద, నిఫ్టీ 90.65 పాయింట్ల నష్టంతో 22,122.05 వద్ద ముగిశాయి. ఐటీ, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్ గూడ్స్ కంపెనీల షేర్లు ఎక్కువగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 26 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి.

బైజూస్ తనిఖీ వేగవంతం

» అధికారులకు కార్పొరేట్ శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ: సంక్షోభంలోకి జారుకున్న ఎడ్యుటెక్ స్టార్టప్ బైజూస్ పద్దుల తనిఖీని వేగంతం చేసి, త్వరగా నివేదికను సమర్పించాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించింది. ప్రాంతీయ కార్యాలయం సమర్పించనున్న నివేదిక ఆధారంగా మంత్రిత్వ శాఖ సంస్థపై తదుపరి చర్యలు చేపట్టనుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బైజూస్ బ్రాండ్ యాజమాన్య సంస్థ థింక్ అండ్ లర్న్ పద్దుల్లో తనిఖీలు చేపట్టాలని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయాన్ని కార్పొరేట్ వ్యవహారాల శాఖ 2023 జూలైలో కోరింది. అయితే, ఏ కోణంలో తనిఖీలకు ఆదేశించిందన్న వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది. గత ఏడాది నుంచే బైజూస్‌లో లుకలుకలు మొదలయ్యాయి. కంపెనీ వార్షిక నివేదికలను సమర్పించడంలో తీవ్ర జాప్యం చేయడం, ఆడిటర్ల రాజీనామా నేపథ్యంలో కంపెనీలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు మంత్రిత్వ శాఖ తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీలో అధికారుల తనిఖీ కొనసాగుతోందని.. వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, పత్రాల కోసం అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటున్నట్లు బైజూస్ ప్రతినిధి తెలిపారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నామని, వారు కోరిన అన్ని పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

బిజినెస్

ఒకటి ఐదుగా..

కెనరా బ్యాంక్ షేర్ల విభజనకు బోర్డు ఆమోదం

ముంబై: ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ షేర్లను 1:5 నిష్పత్తిలో విభజిస్తున్నట్లు ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును ఒక్కోటి రూ.2 ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించనుంది. సోమవారం సమావేశమైన బ్యాంక్ బోర్డు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మార్కెట్లో బ్యాంక్ షేర్ల లభ్యతను పెంచడంతోపాటు చిన్న మదుపరులకు సైతం ధర అందుబాటులో ఉండేందుకే షేర్లను విభజిస్తున్నట్లు కెనరాబ్యాంక్ తెలిపింది. ఇందుకు ఆర్‌బీఐ అనుమతి తెలుపాల్సి ఉంటుందని, విభజన ప్రక్రియ పూర్తికి 2-3 నెలలు పట్టవచ్చని బ్యాంక్ వెల్లడించింది. బీఎస్ఈలో బ్యాంక్ షేరు ధర 1.24 శాతం నష్టపోయి రూ.572.80 వద్ద ముగిసింది.

సుభాష్ చంద్ర సహకరించడం లేదు: సెబీ

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ రూ.2,000 కోట్ల దారి మళ్లింపు కేసులో కంపెనీ గౌరవ చైర్మన్ సుభాష్ చంద్ర తమకు సహకరించడం లేదని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు (శాట్) సెబీ ఫిర్యాదు చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,840 ▲	57,600 ▲	76,400 ▲
ముంబై	62,220 ▲	57,000 ▲	69,450 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ		విజయవాడ	475
హైదరాబాద్	500	విశాఖపట్నం	500
27వ తేదీ		వరంగల్	502
చిత్తూరు	568		
గోదావరి	475	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

రేపట్నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు
- ఉదయం 8.45 గంటల్లోపు సెంటర్‌కు చేరుకోవాలి
- రాష్ట్రవ్యాప్తంగా 1521 పరీక్ష కేంద్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు నిమిషం ఆలస్యంగా వచ్చినా.. విద్యార్థులను లోపలికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 28 (బుధవారం) నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమవనున్నాయి. ఈ పరీక్షలు మార్చి 19 వరకు కొనసాగుతాయి. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. 8.45 నుంచి 9 గంటల వరకు విద్యార్థులు తమ బయోడేటాలోని ఓఎంఆర్ వివరాలను పరిశీలించుకోవాల్సి ఉంటుంది. అయితే 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 9,80,978 మంది హాజరవుతున్నారు. వీరిలో 4,78,718 మంది మొదటి సంవత్సరం; 5,02,260 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం 1,521 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో 50 శాతం ప్రైవేట్ కాలేజీల్లోనే ఉన్నాయి. 27,900 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష విధుల్లో ఉండబోతున్నారు. 200 సిటింగ్ స్క్వాడ్‌లు, 75 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రోజూ కలెక్టర్లు, పోలీసు అధికారులు పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న సిబ్బందిని పరీక్ష విధులకు దూరంగా ఉంచారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఇద్దరు పోలీసులు, ఎక్కువ ఉంటే ఐదుగురితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు వెంట తెచ్చుకోవద్దని, ఒకవేళ తెచ్చుకున్నా వాటిని బీరువాల్లో పెట్టేయాలని.. దాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు చేయాలని ఆదేశాలిచ్చారు. తనిఖీ అధికారులు సైతం ఫోన్లను తీసుకురావద్దని స్పష్టంచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరా నిఘా పెట్టారు.

ప్రశాంతంగా రాయండి

విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విద్యార్థులకు సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఆమె సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అనుమతించబోమని ఆమె స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌తో సరిచేయించుకొని రావాలని సూచించారు. ఈ పరీక్షల కోసం రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూం 040-24655027 ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

- శృతి ఓజా, బోర్డు కార్యదర్శి

లోకం తీరు



మార్చి 28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మార్చి 4-11 దాకా నామినేషన్లు.. ఏప్రిల్ 12న లెక్కింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. నామినేషన్ల స్వీకరణ మార్చి 4న ప్రారంభమై 11వ తేదీ వరకు సాగనుంది. నామినేషన్ల పరిశీలన మార్చి 12న, ఉపసంహరణకు మార్చి 14వరకు గడువు ఉంది. మార్చి-28న ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 2న ఉంటుంది. షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ టికెట్ మన్నె జీవన్‌రెడ్డికి లభించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వాస్తవానికి ఈ టికెట్ కోసం చిన్నారెడ్డి, వంశీచంద్‌రెడ్డి, జీవన్‌రెడ్డి రేసులో ఉన్నారని ముందు నుంచీ ప్రచారం నడిచింది. అయితే చిన్నారెడ్డికి ఇటీవలే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టారు. వంశీచంద్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వనున్నారు. దీంతో మన్నె జీవన్‌రెడ్డినే ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉంటారన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో నెలకొంది.


మనవడు విరాట్‌కు అక్షర శ్రీకారం చేయిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

బాసరలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

బాసర, ఫిబ్రవరి 26: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సోమవారం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణ సందర్శించారు. కుటుంబసభ్యులతో ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ పండితులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణ తన మనువడు విరాట్‌కు అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించారు.


కోటగిరిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తుమ్మల

నాకు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్

- రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు: తుమ్మల

కోటగిరి/బాన్సువాడ, ఫిబ్రవరి 26: "తెలుగు జాతి కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోంది" అని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణకు తుమ్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావుతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో, ఆ తర్వాత బాన్సువాడలో విలేకరులతో తుమ్మల మాట్లాడారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరేనని చెప్పారు. ఆయన విగ్రహావిష్కరణకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఎన్టీఆర్ శిష్యులమంతా సమాజంలో శభాష్ అనిపించుకుంటున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఏ ప్రభుత్వంలో ఉన్నా.. తాను కూడా పేదల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు తగిన ప్రాధాన్యం ఇస్తోందని, నిధుల కొరత ఉన్నప్పటికీ హామీలను అమలు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మండవ వెంకటేశ్వర్‌రావు నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

అసదుద్దీన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలివ్వండి

- సుప్రీంకోర్టులో హిందూసేన పిటిషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం, శ్రీరామ మందిరం, కాశీ, మధుర పుణ్యక్షేత్రాలపై విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నవారిపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలివ్వాలని కోరుతూ హిందూసేన సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అసదుద్దీన్ ఒవైసీ, ఉదయనిధి స్టాలిన్, కమల్ హాసన్, ఎ.రాజా, స్వామి ప్రసాద్ మౌర్యతోపాటు పలువురు నాయకులపై చర్యలకు ఆదేశాలు ఇవ్వాలని హిందూసేన అధ్యక్షుడు విష్ణు గుప్తా సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా వారు చేస్తున్న ప్రసంగాలపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. 2024 జనవరి 1వ తేదీన హైదరాబాద్‌లోని మదర్సాలో ఎంపీ అసదుద్దీన్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన చిన్నారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన చిన్నారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ముచ్చటించారు. చిన్నారెడ్డికి ప్రణాళికా సంఘం పదవితో పాటు ప్రభుత్వం ప్రతీ నెలా మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమ బాధ్యతలను కూడా అప్పగించింది. దీంతో ఆయన మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణికి హాజరుకానున్నట్లు తెలిసింది. ప్రజావాణిలో ఇప్పటివరకు 4.90లక్షల దరఖాస్తులు రాగా.. 3.96 లక్షల దరఖాస్తులను వివిధ దశల్లో పరిష్కరించారు. మిగతా వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చిన్నారెడ్డి అధికారులతో చర్చించనున్నారు.

గ్రౌండ్ వాటర్ విభాగం ఫలితాల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రౌండ్ వాటర్ విభాగంలోని గెజిటెడ్, నాన్-గెజిటెడ్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ సోమవారం వెల్లడించింది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలను, ర్యాంకులను చూసుకోవచ్చని సూచించింది. ఈ పోస్టుల కోసం గత ఏడాది జూలై 18, 19, 20 తేదీల్లో పరీక్షలను నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్‌కు సై!

దరఖాస్తుల పరిష్కారానికి అనుమతి.. దిగువ, మధ్య తరగతికి పెద్ద ఊరట.. మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలకు సంబంధించి 2020 నాటి లేఅవుట్ రెగ్యులేషన్ పథకం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తులకు మోక్షం లభించనుంది. లక్షల మంది మధ్య తరగతి కుటుంబాలకు మేలుచేసే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు రెండు నెలల పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి 25.44 లక్షల ఇళ్ల స్థలాలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. 13 కార్పొరేషన్ల నుంచి 4.13 లక్షలు, 129 మునిసిపాలిటీల నుంచి 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు అందాయి. ఇంటి స్థలానికి రూ.1000, లేఅవుట్ అయితే రూ.10,000 చొప్పున దరఖాస్తు రుసుముగా వసూలు చేశారు. తరువాత క్రమబద్ధీకరణ ముందుకు సాగలేదు. దరఖాస్తు చేసుకున్న వారంతా ప్రభుత్వ నిర్ణయం కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పటికే ఎల్ఆర్ఎస్ అవసరం ఉన్నవాళ్లు అధికారులను ఆశ్రయించి క్రమబద్ధీకరణ చేయించుకుంటున్నారు. అధికారులు కూడా నిబంధనల్లోని వెసులుబాట్లను పరిగణనలోకి తీసుకొని క్రమబద్ధీకరణ చేస్తున్నారు. అదే సమయంలో 2020 ఎల్ఆర్ఎస్ నిబంధనల ప్రకారమే చార్జీలు వసూలు చేస్తున్నారు.

కోర్టు కేసుల వల్ల జాప్యం

ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం రెండు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఎల్ఆర్ఎస్ సమస్యను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు కేసుల వల్ల దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమైందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన 2020 నాటి నిబంధనల ప్రకారమే లేఅవుట్ క్రమబద్ధీకరణ చేపట్టాలని



అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులు పూర్తి రుసుం చెల్లించి మార్చి 31 లోగా లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను మినహాయించి ఇతర లేఅవుట్‌లను క్రమబద్ధీకరించాలని సీఎం ఆదేశించారు. అయితే, మార్చి 31 గడువు మీదే అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అంత స్వల్ప గడువులో డబ్బులు సమకూర్చుకోవడం కష్టం అవుతుందని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగొని ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసి 2020లో దరఖాస్తు చేసుకోని వారికి కూడా అవకాశం ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాత జీవో ఏం చెప్పిందంటే?

అనుమతి లేని, అనధికారిక లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం 31-8-2020న జీవో 131 జారీ చేసింది. 100 చదరపు మీటర్లకు లోపు ఉంటే చదరపు మీటరుకు రూ.200 చొప్పున, 101 నుంచి 300 చదరపు మీటర్ల లోపు ఉంటే చదరపు మీటర్‌కు రూ.400 చొప్పున, 301 నుంచి 500 చదరపు మీటర్ల లోపు ఉంటే రూ.600చొప్పున, 500 అంతకంటే ఎక్కువ చదరపు మీటర్లు ఉంటే ఒక్కో చదరపు మీటరుకు రూ.750 చొప్పున బేసిక్ క్రమబద్ధీకరణ చార్జీలు అవుతాయని జీవోలో పేర్కొన్నారు. భూమి విలువను బట్టి బేసిక్ క్రమబద్ధీకరణ రుసుములో 25, 50, 75, 100 శాతం చొప్పున క్రమబద్ధీకరణ చార్జీలు చెల్లించాలని తెలిపారు. 20-8-2020 నాటికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పేర్కొన్న భూమి విలువ చదరపు గజం రూ.3000 ఉంటే బేసిక్ క్రమబద్ధీకరణ రుసుములో 25శాతం, రూ.3001 నుంచి రూ.5 వేల వరకు ఉంటే 50 శాతం, రూ.5001 నుంచి రూ.10000 లోపు ఉంటే 75 శాతం రూ.10,001 అంతకన్నా ఎక్కువ ఉంటే 100 శాతం చొప్పున క్రమబద్ధీకరణ చార్జీలు చెల్లించాలని నిర్ణయించారు. ఉదాహరణకు ఒక వ్యక్తికి 300 చదరపు మీటర్ల ప్లాట్ ఉండి, అక్కడ భూమి విలువ ప్రభుత్వ రికార్డుల ప్రకారం చదరపు మీటర్ 10,000 ఉంటే పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం బేసిక్ క్రమబద్ధీకరణ రుసుము రూ.1,20,000 అవుతుంది. అక్కడ భూమి విలువను పరిగణనలోకి తీసుకున్నపుడు క్రమబద్ధీకరణ రుసుము బేసిక్ రుసుములో 75 శాతం అవుతుంది. అంటే, రూ.90,000 అవుతుంది. అదే భూమి విలువ చదరపు మీటర్‌కు రూ.10,000 దాటితే బేసిక్ రుసుములో వంద శాతం అంటే రూ.1,20,000 చెల్లించాల్సి ఉంటుంది. ప్లాట్ సైజు, భూమి ధరను బట్టి ఎల్ఆర్ఎస్ రుసుము ద్విముఖంగా పెరుగుతుంది. దీనికి తోడు లేఅవుట్‌లో 10 శాతం ఓపెన్ స్థలం చూపకపోతే ప్లాట్ విలువలో మరో 14శాతం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మురికివాడల్లో భూమి విలువతో సంబంధం లేకుండా చదరపు మీటరుకు రూ.5చొప్పున చెల్లించాలని జీవోలో పేర్కొన్నారు. లేఅవుట్లలో రోడ్డు వెడల్పు 9 మీటర్లు ఉండాలని స్పష్టం చేశారు. 100 చదరపు మీటర్ల కంటే తక్కువ ప్లాట్లు ఉండే బలహీన వర్గాల కాలనీల్లో రోడ్డు వెడల్పు కనీసం 6 మీటర్లు ఉండాలని సూచించారు. అనుమతి లేని లేఅవుట్ల యజమానులు దరఖాస్తు చేసుకోకుంటే విద్యుత్తు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయబోమని జీవోలో స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తుదారులు చెల్లించిన మొత్తం డబ్బును తిరిగి అదే లేఅవుట్ల అభివృద్ధికి, వసతుల కల్పనకు ఖర్చు చేస్తామని తెలిపారు.

జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష నిర్వహణలో నిబంధనలను పాటించడం లేదని గుర్తిస్తూ.. హైకోర్టు రద్దు చేసింది. దీంతో రేవంత్ సర్కారు టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి.. 503 పోస్టులతో ఇచ్చిన గత నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. మరో 60 పోస్టులను చేరుస్తూ.. మొత్తం 563 పోస్టులకు కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రిలిమ్స్ తేదీ ఖరారవ్వడంతో.. మెయిన్స్ కూడా సెప్టెంబరు/అక్టోబరులో జరగొచ్చని తెలుస్తోంది. కాగా.. ప్రిలిమ్స్‌కు సరిగ్గా 103 రోజులు ఉన్నాయని, అభ్యర్థులు ఒక ప్రణాళికాబద్ధంగా చదివితే మెయిన్స్‌కు ఎంపికవ్వడం సులభమేనని నిపుణులు సూచిస్తున్నారు. "టైమ్‌టేబుల్‌ను ప్రిపేర్ చేసుకుని షెడ్యూల్ ప్రకారం చదవాలి. 13 సబ్జెక్టులను వేర్వేరుగా కాకుండా, ఒక్కటిగా కలిపి చూడాలి. అర్థశాస్త్రం-విపత్తు నిర్వహణ-భౌగోళికశాస్త్రాలు.. చరిత్ర-రాజ్యాంగ క్రమం, రాజ్యాంగం-సమాజశాస్త్రం-ప్రజా పరిపాలన వంటి వాటికి లింకు ఉంటుంది. కలిపి చదువుకుంటే గుర్తుపెట్టుకునే అవకాశాలుంటాయి. అర్థమెటిక్, రీజనింగ్‌ను తేలిగ్గా తీసుకోవద్దు. ఈ రెండూ స్కోరింగ్‌ను పెంచే అంశాలే.! తెలుగు అకాడమీ, అంబేడ్కర్ వర్సిటీ ముద్రించిన సబ్జెక్టు పుస్తకాలను చదవడం మంచిది" టీఎస్‌పీఎస్సీ, యూపీఎస్సీ కోచింగ్ ఫ్యాకల్టీ ఎం.సంతోష్‌రావు సూచిస్తున్నారు.

మెగా డీఎస్సీలో 11,062 పోస్టులు

మెగా డీఎస్సీని నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం..11,062 టీచర్ పోస్టుల భర్తీకి సిద్ధమైంది. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఖాళీల వివరాలను ప్రభుత్వానికి పంపారు. వారి ప్రతిపాదనలను పరిశీలించిన ఆర్థిక శాఖ..11,062 పోస్టుల భర్తీకి అనుమతి నిచ్చింది. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

పాలమూరు ఎంపీ సీటు నాదే..

- నేడు కేంద్ర మంత్రి అమిత్ షాను కలుస్తా
- డీకే అరుణకు కేటాయించినా మద్దతిస్తా
- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ
- 29న దేశవ్యాప్తంగా 100 సీట్ల ప్రకటన
- మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పాలమూరు బీజేపీ ఎంపీ సీటు తనకే వస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ సీటు తనకిస్తే తప్పకుండా గెలిచి తీరుతానన్న ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ సీటు విషయమై మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవనున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అయోధ్య రామమందిర నిర్మాణంతో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని.. ప్రతి ఇంటికీ తలంబ్రాలు పంచి బీజేపీని పదిలం చేశామన్నారు. ఈ నెల 29న దేశవ్యాప్తంగా 100 సీట్లను బీజేపీ అధినాయకత్వం ప్రకటించబోతోందని, అందులో తెలంగాణ నుంచి కూడా ఆరేడు సీట్లు ఉంటాయని చెప్పారు. తెలంగాణలో బీజేపీ ఎంపీ సీట్ల కేటాయింపు కోసం ఇప్పటి వరకు నాలుగు దఫాలుగా చర్చలు జరిగాయని, ప్రతి ఎంపీ స్థానం కోసం ముగ్గురి పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తుందన్నారు. మహబూబ్‌నగర్ నుంచి తనతో పాటు డీకే అరుణ పేరు పరిశీలనలో ఉందని, అయితే ఆ సీటు దాదాపుగా తనకే వస్తుందని చెప్పారు. డీకే అరుణకు కేటాయించినా మద్దతు ఇస్తానన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కనుమరుగైపోయిందని... లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించామని చెప్పారు.

ఎయిర్‌పోర్టులను మించి రైల్వేస్టేషన్లు

- దేశంపై మోదీ ప్రేమకు నిదర్శనం: గవర్నర్
- ఒకేసారి శంకుస్థాపన చరిత్రాత్మకం: లక్ష్మణ్
- అభివృద్ధికి సహకారం: డిప్యూటీ సీఎం
- బేగంపేట రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు
- వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ


బేగంపేట రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ లక్ష్మణ్, దక్షిణమధ్య రైల్వే జీఎం ఏకే జైన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయాలను తలదన్నే ప్రమాణాలతో రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్(ఏబీఎస్) పథకం రెండో విడతలో భాగంగా దేశంలోని 554 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 15 రైల్వే స్టేషన్లలో రూ.231కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పలు మార్గాల్లో రూ.490కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలను ప్రారంభించారు. ఈ మేరకు బేగంపేట రైల్వే స్టేషన్‌లో రూ.22.57కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలో గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయక వ్యవస్థలను మెరుగుపరిచేందుకు ప్రధాని మోదీ సంకల్పించడం ఆయనకు దేశంపై ఉన్న ప్రేమను తెలియజేస్తుందన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంతో రేడియోను, వందే భారత్ రైళ్ల ద్వారా రైల్వే వ్యవస్థను, అనేక కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు పోస్టాఫీసులను ప్రధాన మంత్రి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద రాష్ట్రంలోని బేగంపేట్, యాకుత్‌పుర సహా 15 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అతి పెద్ద రవాణా నెట్‌వర్క్‌గా పేరుగాంచిన భారతీయ రైల్వే.. అతి తక్కువ చార్జీలతో కోట్లాది మందిని గమ్యస్థానాలకు చేరుస్తోందని అన్నారు. సరకు రవాణాతో దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడుతోందన్నారు. తెలంగాణలో రైల్వే శాఖ చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించే ఈ సందర్భం చరిత్రాత్మకమని అన్నారు. సమాజం, దేశ పురోగతి కోసం రైలు, రోడ్డు మార్గాలను కేంద్రం అభివృద్ధి చేస్తోందని వివరించారు. దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ భారతీయ రైల్వేలో వేగవంత మార్పునకు ప్రస్తుత శంకుస్థాపనలు నాంది పలుకుతాయని అన్నారు. జోన్ పరిధిలో నిర్మించిన 57కొత్త రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. కాగా, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా రాష్ట్రంలో మొత్తం 15 స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా యాకుత్‌పురాలో రూ.31.1కోట్లు, వ రంగల్‌లో రూ.25.41కోట్లు, పెద్దపల్లిలో రూ.26.49 కోట్లు, మెదక్‌లో రూ.15.31కోట్లు, షాద్‌నగర్‌లో రూ.9.59కోట్లతో పనులు చేపట్టనున్నారు.

అమృత్ భారత్ స్టేషన్లలో ప్రత్యేకతలివే..

- సౌందర్యకరమైన, ఆహ్లాదకరమైన ప్రవేశ ద్వారం
- స్టేషన్ పరిసరాలను మెరుగుపరిచేందుకు రోడ్ల విస్తరణ
- పాదచారుల మార్గాలు, ప్రణాళికాబద్ధ పార్కింగ్ ప్రాంతాలు
- మెరుగైన లైటింగ్, ల్యాండ్‌స్కేపింగ్, గ్రీన్ ప్యాచ్‌ల ఏర్పాటు
- 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' కోసం ప్రత్యేక స్టాళ్లు
- సర్క్యులేటింగ్ ఏరియా కోసం రెండో ప్రవేశ ద్వారం
- తగినన్ని ఉన్నత స్థాయి ప్లాట్‌ఫారాలు, షెల్టర్లు
- ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డులు, యూజర్ ఫ్రెండ్లీ సదుపాయాలు

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపులేవని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే హామీలు అమలు చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్‌డీఏ పాలనలో తెలంగాణకు రూ.9 లక్షల కోట్లు కేటాయించామని తెలిపారు. 70 శాతం ఓట్లతో మోదీ ప్రపంచంలోనే మేటి నాయకుడిగా ఉన్నారని, అవినీతికి మచ్చలేని ఆయనను మళ్లీ ప్రధాని చేసుకుందామని పిలుపునిచ్చారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా కిషన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీర సావర్కర్ వర్ధంతి సందర్భంగా కాచిగూడలోని విగ్రహానికి నివాళి అర్పించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పద్మారావునగర్ స్వరాజ్య ప్రెస్ నుంచి యాత్రను ప్రారంభించారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని, కాంగ్రెస్‌ను ఆ పార్టీ నేతలే నమ్మడం లేదని తెలిపారు.

బీజేపీని గెలిపిస్తే అమృతకాలం..

వికాసానికే సరికొత్త నిర్వచనం తెచ్చిన, అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న ప్రపంచ మేటి నేత మోదీని మరోసారి ప్రధానిని చేసే విజయ సంకల్పం తీసుకోవాలని గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ కోరారు. విజయ సంకల్ప యాత్రలో ఖైరతాబాద్ గణపతి ప్రాంగణం వద్ద సోమవారం రాత్రి బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొమ్రం భీం, అల్లూరి సీతారామరాజు పుట్టిన ఈ నేలకు నమస్కరిస్తున్నట్లు తెలిపారు. శత్రు దేశాలు మనవైపు కన్నెత్తి చూసేందుకే భయపడే స్థాయికి ఎదిగామని.. దీనికి మోదీ నాయకత్వ పటిమనే కారణమని భూపేంద్ర పేర్కొన్నారు. తెలంగాణలో అమృత కాలం కావాలంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 సీట్లలో గెలిపించాలని కోరారు. కాగా, ఖైరతాబాద్‌లో సభ అనంతరం భూపేంద్ర పటేల్.. కిషన్‌రెడ్డి, నాయకులతో కలిసి శ్రీరాముడికి మహా హారతి ఇచ్చారు. ఎంపీ డా.లక్ష్మణ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

పాలకుల తప్పుల వల్లే జల వివాదాలు: ఏలేటి

సత్తుపల్లి/దమ్మపేట: కృష్ణా జలాల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు నిరాకరించి గత ప్రభుత్వం చేసిన తప్పులనే సీఎం రేవంత్‌రెడ్డి కూడా చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. భద్రాచలం నుంచి బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఖమ్మం జిల్లాకు



ఖైరతాబాద్ సభలో మాట్లాడుతున్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్.. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చేరుకుంది. సోమవారం సత్తుపల్లి, దమ్మపల్లిలో జరిగిన కార్యక్రమాల్లో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హామీల అమలుకు సుమారు రూ.5లక్షల కోట్లు కావాలని.. కానీ బడ్జెట్‌లో రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. డిసెంబర్ 9 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఆ విషయాన్ని మరిచిపోయిందన్నారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రైతుబంధు కూడా వేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని.. దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసి ఇవ్వాలని కోరితే రేవంత్ తిరస్కరించారని పేర్కొన్నారు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

రూ.2 కోట్లు కాజేసిన ఏఈవో

రంగారెడ్డి జిల్లా కొందుర్గు అధికారి దగా.. రైతుబంధు, బీమా, నిధులు నకిలీ ఖాతాల్లోకి

» దొంగ ఖాతాలు, మరణ ధ్రువ పత్రాలతో స్వాహా

» క్యాబ్ డ్రైవర్ సహా ఏఈవో అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ/కొందుర్గు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉండి, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించాల్సిన వ్యవసాయ అధికారి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. ఉద్యోగ హోదాను అడ్డంపెట్టుకుని పాస్‌బుక్‌లు, ఆధార్ నంబర్లు సేకరించి.. నకిలీ మరణ ధ్రువపత్రాలతో రైతు బీమాను, దొంగ ఖాతాలతో రైతుబంధు నిధులను కాజేశాడు. మూడేళ్లలో మొత్తం రూ.2 కోట్లు నొక్కేసిన అతడు పోలీసుకు చిక్కి కటకటాలపాలయ్యాడు. సైబరాబాద్ కమిషనరేట్‌లో సోమవారం సీపీ అవినాష్ మహంతి మీడియాకు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం ఆగిర్యాల(తంగళ్లపల్లి) క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) గోరేటి శ్రీశైలం క్యాబ్ డ్రైవర్ ఓడెల వీరాస్వామి సహకారంతో ఏడు బ్యాంకు ఖాతాలను సమకూర్చుకున్నాడు. పాస్ పుస్తకాలు, ఆధార్‌తో 20 మంది రైతులకు రైతు బీమా తీసుకొని నామినీలుగా తన ఖాతా, కుటుంబ సభ్యుల ఖాతా వివరాలను జీవిత బీమా సంస్థకు పంపాడు. రైతుల నకిలీ మరణ ధ్రువపత్రాలు సమర్పించి రూ.కోటి కొల్లగొట్టాడు. తనవద్ద ఉన్న సమాచారంతో రైతుబంధుకు దరఖాస్తు చేయనిదెవరో తెలుసుకున్నాడు. పలు సిమ్‌కార్డులు తీసుకుని.. రైతుబంధుకు నకిలీ వివరాలు, బ్యాంకు ఖాతాలను జత చేశాడు. 130 మంది రైతులకు దక్కాల్సిన రూ.కోటిని ఆ ఖాతాల్లోకి మళ్లించుకుని వెంటనే విత్‌డ్రా చేశాడు. ఈ డబ్బుతో తుమ్మలపల్లిలో 8.5 ఎకరాలు, కొందుర్గ్‌లో 2.5 ఎకరాలు, కడ్తాల్‌లో 183 గజాల స్థలాన్ని భార్య మహేశ్వరి పేరిట కొన్నాడు. కాగా, ఒకే వ్యక్తి పేరున ఐదుసార్లు రైతు బీమా జమ అయినట్లు గుర్తించి ఎల్‌ఐసీ సంస్థ రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారికి సమాచారం అందించింది. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కొందుర్గు పోలీసులు.. సీపీ ఆదేశాల మేరకు సైబరాబాద్ ఆర్థిక మోసాల విభాగాని (ఈవోడబ్ల్యూ)కి బదిలీ చేశారు. గోరేటి శ్రీశైలం కీలక పాత్రధారి అని, అతడికి వీరాస్వామి ఖాతాలను సమకూర్చినట్లు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఆగిర్యాల, పాత ఆగార్యాల, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి, చిన్న ఎల్కిచర్ల, తంగళ్లపల్లి గ్రామాలతో పాటు నెల నుంచి కొందుర్గు క్లస్టర్‌కూ శ్రీశైలం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఇంకా ఎంతమందికి దక్కాల్సిన నిధులను దారిమళ్లించాడోనని అన్నదాతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డెక్కన్ కిచెన్ వివాదంలో నందకుమార్‌కు నెలరోజుల జైలు

» రూ.2వేల జరిమానా

» కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు నిర్ధరణ

» దగ్గుబాటి కుటుంబ సభ్యుల కేసులో హైకోర్టు తీర్పు

» శిక్ష అమలు నాలుగు వారాల పాటు నిలుపుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీహీరో దగ్గుబాటి వెంకటేశ్, నిర్మాత సురేశ్‌బాబు కుటుంబానికి.. అప్పట్లో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడిగా ఉన్న కోరె నందకుమార్‌కు మధ్య లీజుకు సంబంధించి నెలకొన్న వివాదంలో సోమవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. హైకోర్టు స్టేటస్ కో విధించినా ఆ ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినందున నందకుమార్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు గుర్తించింది. నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. డబ్ల్యూ 3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ నందకుమార్‌కు చెందిన డెక్కన్ కిచెన్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందున కూల్చేస్తామని పేర్కొంటూ 2021లో జీహెచ్ఎంసీ కమిషనర్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ నోటీసు జారీచేశారు. ఈ నోటీసును సవాల్ చేస్తూ నందకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో దగ్గుబాటి కుటుంబ సభ్యులను సైతం ప్రతివాదులుగా చేర్చారు. నందకుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సంచలనం అయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్పటికే కూల్చివేతలు చేపట్టారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. అసలు వివాదం ఏంటో పూర్తిగా పరిశీలన జరిపే వరకు అటు పిటిషనర్, ఇటు ప్రతివాదులు యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఇరుపక్షాలు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేసింది. హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను నందకుమార్ ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ దగ్గుబాటి వెంకటేశ్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని తనిఖీ చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. స్టేటస్ కో ఆదేశాలను ధిక్కరించి అక్కడ తెల్లవారుజామున నిర్మాణాలు చేపట్టినట్లు ఫొటోలు, ఇతర ఆధారాలను జీహెచ్ఎంసీ అధికారులు హైకోర్టుకు సమర్పించారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు ఆధారాలతో సహా తేలడంతో నందకుమార్‌కు జైలు శిక్ష, జరిమానాను విధించింది. అయితే అప్పీలు చేయడానికి వీలుగా వీటి అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తున్నట్టు పేర్కొంది.

దేవుడు అన్యాయాన్ని ఓడిస్తాడు

» బ్రదర్ అనిల్ ఆసక్తికర వ్యాఖ్యలు

సత్యవేడు, ఫిబ్రవరి 26: దేవుడు న్యాయమే చేస్తాడు.. అన్యాయాన్ని ఓడిస్తాడని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భర్త, క్రైస్తవ మత బోధకుడు బ్రదర్ అనిల్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సత్యవేడులోని ఓ కళ్యాణ మండపంలో సోమవారం క్రైస్తవ సువార్త ప్రకటన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను మీడియా పలకరించింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మీ స్పందన ఏమిటని ప్రశ్నించింది. దానికి అనిల్.. తాను ఇక్కడికి క్రైస్తవ మత బోధ చేసేందుకు మాత్రమే వచ్చానంటూనే.. "దేవుడు ఉన్నాడు. దేవుడు న్యాయమే చేస్తాడు. అన్యాయాన్ని మాత్రం ఓడగొడతాడు" అని వ్యాఖ్యానించారు. షర్మిల అరెస్ట్‌పై వివరణ కోరేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా.. తానేమీ మాట్లాడనంటూ కారెక్కి వెళ్లిపోయారు.




లలిత; నరేందర్; వీరమ్మ (ఫైల్)

చితిమంటకే కన్నీరొచ్చె!

» తల్లి మృతిని తట్టుకోలేక మరుసటి రోజే గుండెపోటుతో కుమారుడి మృతి

» మరో ఘటనలో కొడుకు చనిపోయిన నాలుగోరోజే గుండెపోటుతో తల్లి


రమేశ్ (ఫైల్)

కౌడిపల్లి, భీమదేవరపల్లి, ఫిబ్రవరి 26: తల్లి మరణాన్ని తట్టుకోలేక కొడుకు.. కుమారుడి చావును జీర్ణించుకోలేక తల్లి వెంటవెంటనే చనిపోతే .. ఆ వేదన వర్ణనాతీతం. ఒకే రోజు జరిగిన ఈ రెండు ఘటనలు పలువురి హృదయాలను బరువెక్కించాయి. మెదక్ జిల్లా కౌడిపల్లి గ్రామానికి చెందిన దొంత లలిత (70) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందింది. తన తల్లి ఇక లేదంటూ రోదిస్తూనే ఆమె కుమారుడు నరేందర్ (45) అంత్యక్రియలు నిర్వహించాడు. ఆ మరుసటి రోజే నరేందర్ తీవ్రమైన గుండెపోటుతో చనిపోయాడు. మరో ఘటనలో వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉండాల్సిన చిన్న కుమారుడు క్యాన్సర్‌తో చనిపోవడంతో ఆ తల్లి గుండె తట్టుకోలేకపోయింది. నాలుగురోజుల క్రితం చనిపోయిన కుమారుడిని తలచుకుంటూ ఆమె గుండెపోటుతో మృతిచెందింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన కరట్లపల్లి వీరమ్మ(80), మురళీధర్ దపంతులకు ముగ్గురు కుమారులు వెంకటేశ్వర్‌రావు, చొక్కారావు, రమేశ్ (50) ఉన్నారు. వీరమ్మ భర్త మురళీధర్‌రావు, రెండో కుమారుడు చొక్కారావు గతంలోనే చనిపోయారు. చిన్న కుమారుడు రమేశ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. తీవ్ర అస్వస్థతతో నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన వీరమ్మ సోమవారం తెల్లవారుజామున తీవ్రమైన గుండెపోటుతో మృతిచెందింది.

బీజేపీ నేత కుమారుడి కొకైన్ 'పార్టీ'

శేరిలింగంపల్లి నాయకుడి కొడుకు వివేకానంద నిర్వాకం

» నేరం ఒప్పుకొన్న వివేకానంద.. అతడు, పలువురి అరెస్టు

» ఇద్దరు బడా వ్యాపారులు, టాలీవుడ్ నిర్మాతకూ లింకులు?



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సొంత హోటల్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకున్న బీజేపీ నాయకుడి కుమారుడు పోలీసులకు దొరికిపోయాడు. కొన్ని గంటల హైడ్రామా అనంతరం నేరం అంగీకరించి లొంగిపోయాడు. ఈ వ్యవహారంలో ఆధారాలు లభించినా నిందితులు వెళ్లిపోవడంతో తొలుత ఎవరూ చిక్కలేదు. వెంటనే చర్యలు ప్రారంభించిన పోలీసులు 10 గంటల పాటు ప్రయత్నించి విజయం సాధించారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి రాడిసన్ హోటల్‌లో కొందరు డ్రగ్స్ వినియోగిస్తున్నారటూ ఎస్ఐ శోభన్‌బాబుకు ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు సమాచారం వచ్చింది. స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్‌వోటీ)తో దాడి చేసిన ఆయన.. రిసెప్షన్‌లో ఉన్న అర్పణ్ బెనర్జీ సాయంతో రూమ్ నం.1200, 1204లలోకి వెళ్లారు. అయితే, అప్పటికి ఎవరూ లేరు. 20 నిమిషాల ముందు హోటల్ యజమాని, బీజేపీ శేరిలింగంపల్లి నాయకుడు గజ్జల యోగానంద్ కుమారుడు, హోటల్ డైరెక్టర్‌గా కూడా ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ మజీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ వివేకానంద్(34), అతడి స్నేహితులు డ్రగ్స్‌తో పార్టీ చేసుకున్నారని అర్పణ్ చెప్పాడు. క్లూస్‌టీం సాయంతో పరిశీలించి.. మూడు ఖాళీ కొకైన్ కవర్లు, పేపర్ రోల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా.. వివేకానంద్ తరచూ పార్టీలు చేసుకుంటాడని వెల్లడించారు. దీంతో జూబ్లీహిల్స్ రోడ్ నం.70లోని అతడి ఇంటికి వెళ్లారు.

ఇంటి గేటు బయటకు నిరీక్షణ

తన కోసం వచ్చిన పోలీసులకు వివేకానంద్ కొన్ని గంటల పాటు దొరకలేదు. గేటు ముందు ఉండి ఎంతగా పిలిచినా.. బెల్ కొట్టినా ఇంట్లోని ఎవరూ స్పందించలేదు. దీంతో పోలీసులు 3 గంటల పాటు నిరీక్షించారు. ఇక వారు వెళ్లరు అని నిర్ధారించుకున్న వివేకానంద్ ఉదయం 6 గంటలకు బయటకు వచ్చాడు. అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా డ్రగ్స్ పార్టీ వాస్తవమేనని, గతంలోనూ జరుపుకొన్నామని ఒప్పుకొన్నాడు. టెస్టుల్లోనూ డ్రగ్స్ వాడినట్లు తేలింది. పార్టీలో పాల్గొన్న స్నేహితుల పేర్లను కూడా వివేకానంద్ వెల్లడించాడు. తనకు అబ్బాస్ డ్రగ్స్ సప్లయ్ చేస్తాడని.. అతడికి ఫోన్ చేయగా 3 గ్రాముల కొకైన్ తెచ్చాడని తెలిపాడు. పార్టీలో నిర్భయ్, రఘుచరణ్, కేదార్, సందీప్‌తో పాటు ఇద్దరు యువతులు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మధ్యాహ్నమే వీరంతా రాడిసన్ హోటల్‌కు చేరుకున్నారని, కొకైన్‌ను కలిసివాడారని, అర్ధరాత్రి 12.30కు వెళ్లిపోయినట్లు చెప్పారు. పోలీసులు వివేకానంద్ ఫోన్‌ను సీజ్ చేశారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరోవైపు డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానాలున్న అందరినీ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఈ లింకులు ఎక్కడిదాక ఉన్నాయో..?

రాడిసన్ హోటల్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసులో ఇద్దరు బడా వ్యాపారవేత్తలు, టాలీవుడ్ నిర్మాత ఒకరు ఉన్నట్లు కథనాలు వైరల్ అయ్యాయి. అయితే, వీటిని పోలీసులు ధ్రువీకరించలేదు.కాగా, గతంలోనూ ఇక్కడ పార్టీలు జరిగాయని నిర్ధారణ కావడంతో అప్పట్లో ఎవరెవరు వచ్చారు? ఎంత మోతాదులో కొకైన్ తెచ్చారు? అప్పుడూ అబ్బాస్ సమకూర్చాడా లేక ఇతర సప్లయర్లు కూడా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సంగారెడ్డిలో రూ. కోటి విలువైన గంజాయి స్వాధీనం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 26: అక్రమంగా రవాణా చేస్తున్న రూ.కోటి విలువ గల 190 కిలోల ఎండు గంజాయిని సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ కేసు వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో 150 కిలోలు, మరో కారులో 40 కిలోల గంజాయిని గుర్తించారు. రెండు కార్లలోనూ గంజాయిని తరలిస్తున్న ముఠా ఒక్కటేనని రూఢీ చేసుకున్నారు. గంజాయిని మహారాష్ట్ర, కర్ణాటకలో విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు నిందితులు అంగీకరించారు. హైదరాబాద్‌కు చెందిన రాపర్తి సతీశ్(33) ఐదేళ్లుగా సొంత కారులో గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీసులకు ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

రెడీమిక్స్ లారీని ఢీకొన్న కారు!

» ఎమ్మెల్యే లాస్య నందిత ప్రమాదం కేసులో పురోగతి

» సీసీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. లారీ గుర్తింపు

» బంజారాహిల్స్‌కు చెందిన.. కన్‌స్ట్రక్షన్ కంపెనీదిగా నిర్ధారణ



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మెటల్ బీమ్‌ను కారు ఢీకొనడంతో ప్రాణ నష్టం జరిగేంత ప్రమాదం ఉండదని రోడ్‌సేఫ్టీ నిపుణులు విశ్లేషించడంతో.. ఎస్పీ రూపేశ్ ఈ కేసు దర్యాప్తును సీరియస్‌గా తీసుకున్నారు. రోడ్‌సేఫ్టీ నిపుణులను పిలిపించి, ప్రమాదానికి గురైన కారు పంచనామా చేయించారు. నిపుణులు తమ పరిశీలనలో కారు బ్యానెట్ భాగం నుజ్జునుజ్జవ్వడాన్ని బట్టి ఏదైనా వాహనాన్ని ఢీకొని ఉంటుందనే నిర్ధారణకు వచ్చారు. బ్యానెట్‌పై సిమెంటు మరకలను గుర్తించారు. కారు రెడీమిక్స్ వాహనాన్ని ఢీకొని ఉంటేనే.. అంత బలంగా బ్యానెట్ దెబ్బ తింటుందని, సిమెంటు మరకలు పడతాయని నిర్ధారించారు. దాంతో.. సీసీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. లాస్య నందిత కారు ఢీకొన్న రెడీమిక్స్ వాహనాన్ని గుర్తించారు. ఆ లారీ బంజారాహిల్స్‌కు చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీదని తేల్చారు. అయితే.. లాస్య నందిత కారు ముందు వెళ్తున్న రెడీమిక్స్‌ను ఢీకొన్నదా? లేక.. రెడీమిక్స్ వాహనం వీరి కారును ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొన్నదా? అనే కోణంపై దృష్టి సారించారు. రెడీమిక్స్ వాహన డ్రైవర్‌ను ప్రశ్నిస్తే.. అన్ని వివరాలు వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించకుండా పారిపోయినందుకు రెడీమిక్స్ డ్రైవర్‌పైనా కేసు నమోదు చేసే అవకాశాలున్నాయి.

అల్పాహారం కోసం వెళ్లి..

నిజానికి ఎమ్మెల్యే లాస్య నందిత గురువారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు కార్లలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలోని మిస్కిన్ షా దర్గాను దర్శించుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి దాటాక హైదరాబాద్ చేరుకున్నారు. ఇంటికి వెళ్లాక.. తెల్లవారుజామున అల్పాహారం కోసం బయటకు వెళ్దామని లాస్య నందిత చెప్పడంతో ఆమె పీఏ ఆకాశ్ ఎక్స్‌ఎల్‌-6 కారును నడిపారు. శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి.. పటాన్‌చెరు వైపు బయలుదేరారు. తెల్లవారుజామున 5.10 గంటల సమయంలో సుల్తాన్‌పూర్ టోల్ ప్లాజా సమీపానికి రాగానే.. ఆకాశ్ నిద్రలోకి జారుకోవడంతో కారు అదుపుతప్పి, ఎడమ వైపు ఉన్న మెటల్ బీమ్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో లాస్యనందిత అక్కడికక్కడే మృతిచెందగా.. ఆకాశ్ ఆమె సోదరికి ఫోన్‌లో విషయం చెప్పి, అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆకాశ్‌ను పోలీసులు ప్రశ్నించారు. ముందు రోజు నుంచి డ్రైవింగ్ చేస్తుండడం.. నిద్ర లేకపోవడంతో.. తాను కారు నడుపుతుండగా నిద్రలోకి జారుకున్నట్లు.. ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెడీమిక్స్ డ్రైవర్ వాంగ్మూలం కీలకమని పోలీసులు చెబుతున్నారు.

యాదాద్రీశుడికి విరాళంగా రూ.3కోట్ల భవనం

» హైదరాబాద్‌కు చెందిన వృద్ధ దంపతుల అందజేత


శారద, హనుమంతరావు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైదరాబాద్ చైతన్యపురికి చెందిన శారద, హనుమంతరావు దంపతులు రూ.3 కోట్ల విలువైన భవనాన్ని విరాళంగా ఇచ్చేశారు. చైతన్యపురిలో హనుమంతరావుకు 260 గజాల్లో రెండంతస్తుల భవనం ఉంది. ఆయన ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఒకరు అమెరికాలో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చైతన్యపురిలోని భవనం తాలూకు రిజిస్ట్రేషన్ పనులను యాదగిరిగుట్ట దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో ఎం.రామకృష్ణారావు పూర్తి చేసుకుని భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు కాగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు నిర్వహించారు. మరోవైపు లక్ష్మీనారసింహుడిని శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, అనుబంధ శివాలయంలోని రామలింగేశ్వరుడికి శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,18,641 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

దుస్తులు ఆరేస్తుండగా షాక్.. దంపతుల మృతి

చుట్టు పక్కల ఇళ్లలోనూ విద్యుదాఘాతం.. ఓ మహిళకు గాయాలు

వికారాబాద్‌జిల్లా బూరాన్‌పూర్‌లో ఘటన


లక్ష్మణ్, లక్ష్మి (ఫైల్)

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బట్టలు ఆరేసే ఇనుప తీగకు విద్యుత్తు సరఫరా కావడంతో భార్యాభర్తలు అక్కడిక్కడే మృతిచెందారు. బొంరాస్‌పేట్ మండలం బూరాన్‌పూర్ గ్రామంలో ఈ విషాద ఘటన జరిగింది. గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్ (46), లక్ష్మి (42) భార్యాభర్తలు ఉపాధి హామీ కూలీ పనులకు వెళుతుంటారు. సోమవారం ఉదయం ఇద్దరూ కలిసి ఇళ్లంతా శుభ్రం చేశారు. స్నానాలు చేసుకొని.. బట్టలు ఉతికారు. ఆ తడి బట్టలను ఇద్దరూ కలిసి ఇంటి ఆవరణలోని జీఐ వైర్‌పై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరూ మృతిచెందారు. లక్ష్మి అరచేయి సగం కాలిపోయింది. పక్కన ఉన్న షెడ్డు ఐరన్ రేకులకు విద్యుత్తు ప్రసరణ కావడం, ఆ రేకులకు జీఐ వైర్ తగిలి ఉండటంతోనే ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. ఊర్లో మరికొన్ని ఇళ్లలో విద్యుత్తు షాక్ కొట్టినట్లు తెలిసింది. గ్రామానికి చెందిన గడిసింగపూరం వెంకటమ్మకు కూడా విద్యుత్తు షాక్ తగిలింది. ఆమె కింద పడటంతో ఆస్పత్రికి తరలించారు. ఊర్లోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్తింగ్ ఫెయిల్ అవ్వడమే విద్యుదాఘాతాలకు కారణం అని నిర్ధారించారు.

రమణదీక్షితులుపై టీటీడీ వేటు

» దేవస్థానం నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటన

తిరుమల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు, ప్రస్తుత గౌరవ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులుపై వేటు పడింది. టీటీడీ, జీయర్ స్వాములు, అర్చకులు, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠంపై ఆరోపణలు చేసిన క్రమంలో రమణదీక్షితులును తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తొలగిస్తున్నట్టు టీటీడీ బోర్డు సోమవారం ప్రకటించింది. టీటీడీ పరిపాలన అంశాలు, అధికారులు, జీయర్ స్వాములు, అర్చకులపై రమణదీక్షితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నట్టుగా ఈ నెల 21న సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయింది. కైంకర్యాలు సక్రమంగా చేయడం లేదని, నైవేద్యాలు తగినంత పెట్టడం లేదని, నిధుల కోసం తవ్వకాలు చేపట్టడంతో పాటు ఆలయంలో నూతన స్తంభాలు తీసుకువచ్చారని, ఇంకా అధికారులు, అర్చకులు, జీయర్ స్వాములు, పోటు కార్మికులందరినీ తీవ్రస్థాయిలో కించపరుస్తూ మాట్లాడుతున్నట్టు అందులో ఉంది. అది విడుదలైన నిమిషాల వ్యవధిలోనే రమణదీక్షితులు 'ఎక్స్'లో స్పందించారు. 'అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వీడియోను చూసి షాక్ అయ్యాను. అది నా గొంతు కాదు. నాపై అసూయపడేవారు, నన్ను అప్రతిష్ఠపాల్జేయాలని ఈ చీప్ ట్రిక్ చేశారు' అంటూ వివరణ ఇచ్చారు. అయితే మరుసటిరోజు ఆలయ అర్చకులు మీడియా ముందుకు వచ్చి రమణదీక్షితులపై విరుచుకుపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాలు, గుర్తింపు కోసం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారంటూ మండిపడ్డారు. ఆలయంలో అన్నీ ఆగమోక్తంగానే జరుగుతున్నాయని వివరించారు. తమ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేసిన రమణదీక్షితులపై చర్యలు తీసుకోవాలంటూ రెండురోజుల తర్వాత టీటీడీ పెద్దజీయర్, చిన్నజీయర్ టీటీడీకి లేఖ సమర్పించారు. నిధుల కోసం ప్రయత్నిస్తున్నామని ఆరోపించారని ఆయనపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అహోబిలం మఠం నిర్వాహకులు కూడా లేఖ రాశారు. బోర్డు సభ్యులు, పోటు కార్మికుల నుంచీ రమణదీక్షితులుపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత రావడంతో సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ వీడియోపై చర్చించారు. నిందారోపణలు చేసిన ఆయన్ను వెంటనే టీటీడీ నుంచి తొలగించాలని తీర్మానం చేశారు.

స్కిల్ కేసులో బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై

సుప్రీం విచారణ వాయిదా

చంద్రబాబు కుటుంబ సభ్యులు దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారు: రోహత్గీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసు సోమవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో దర్యాప్తు అధికారులను చంద్రబాబు కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. రికార్డులో లేని విషయాలను తాము వినబోమని జస్టిస్ త్రివేది అన్నారు. చాలా పెద్ద ఆరోపణలు చేస్తున్నారని, కేసులో దర్యాప్తు అధికారులు ఎవరైనా తమను చంద్రబాబు కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నట్లు 164 స్టేట్‌మెంట్ ఇస్తే అప్పుడు ఆలోచిస్తామని తెలిపారు. ఇదే సమయంలో.. హైకోర్టు రికార్డులో లేని విషయాలను రోహత్గీ కొత్తగా ప్రస్తావిస్తున్నారని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే.. తాము అదనపు పిటిషన్ దాఖలు చేశామని రోహత్గీ ధర్మాసనానికి తెలియజేశారు. ఆ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు తమకు కొంత సమయం కావాలని సిద్ధార్థ లూథ్రా, మరో సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు. అఫిడవిట్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

అప్పుల బాధతో ఒకరు.. కరెంట్ షాక్‌తో మరొకరు..

» భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో ఇద్దరు రైతుల మృతి



శ్రీనివాస్; అవిలయ్య (ఫైల్)

కాటారం, నాగారం, ఫిబ్రవరి 26 : అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒక రైతు... పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మరో రైతు సోమవారం మృత్యువాత పడ్డారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చిద్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధి దంతెలపల్లికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్(48) పత్తి, మిర్చి పంటలు వేయగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి సరిగా రాలేదు. పంటల కోసం చేసిన రూ.7 లక్షల అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన మట్టగజం అవిలయ్య(45) పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తూ గట్టు మీద పడివున్న విద్యుత్ సర్వీసు వైరు కాలికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రూపాయి ప్రీమియం లేకుండా..
సింగరేణి కార్మికులకు రూ.కోటి బీమా

» యూనియన్ బ్యాంకుతో సింగరేణి సంస్థ ఒప్పందం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు బ్యాంకులో ఖాతా ఉంటే చాలు.. ఉద్యోగుల ప్రీమియంతో సంబంధం లేకుండా ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుంది. కార్మికులెవరైనా ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత, పాక్షిక వైకల్యం, పూర్తి శాశ్వత వైకల్యం సంభవించినా వారికి రూ.కోటి బీమా పథకాన్ని అమలు చేస్తారు. ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా ఉద్యోగులకు ఈ సదుపాయం కలగనుంది. ఈ మేరకు యూనియన్ బ్యాంకుతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

బీమా పథకంలోని సదుపాయాలు..

1 అగ్ని ప్రమాదంలో గాయపడితే ప్లాస్టిక్ సర్జరీ లాంటి చికిత్స అవసరమైన పక్షంలో రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం
1 ప్రమాదంలో ఉద్యోగి మరణిస్తే మృతదేహాన్ని తరలించేందుకు రూ.20 వేల ఆర్థిక సాయం
1 ప్రమాదంలో ఉద్యోగి చనిపోయే సమయానికి గ్రాడ్యుయేషన్ చదివే పిల్లలు ఉంటే రూ.6 లక్షల ఆర్థిక సాయం
1 ఎయిర్ అంబులెన్స్ అవసరమైన పక్షంలో రూ.6 లక్షల వరకు ఆర్థిక సాయం
1 ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఇద్దరు కుటుంబ సభ్యులు వెళ్లడానికి వీలుగా రవాణా ఖర్చుకింద రూ.20 వేల ఆర్థిక సాయం
1 అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే ఏడాదిలో రూ.15 వేల వరకు ఇన్ పేషెంట్ కవరేజ్ సదుపాయం
1 యూనియన్ బ్యాంకు ఏటీఎంను అపరిమితంగా వినియోగించుకునే అవకాశం. దీనిపై ఎలాంటి రుసుం వసూలు చేయరు
1 లాకర్ సదుపాయాన్ని ఉపయోగించుకుంటే మొదటి ఏడాది చార్జిలో 50 శాతం రాయితీ
1 రూ.25 లక్షల పైన గృహ రుణంపై ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు
1 గృహరుణం వడ్డీపై 0.05 శాతం ప్రత్యేక రాయితీ
1 వాహన రుణాల వడ్డీపై 010 శాతం ప్రత్యేక రాయితీ
1 విదేశీ విద్య కోసం తీసుకునే రూ.75 లక్షలకు పైగా రుణాలపై 0.10 శాతం రాయితీ
1 కుటుంబ సభ్యులు ముగ్గురు (జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలు) జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచేందుకు అవకాశం
1 యూబీఐ శాలరీ ప్యాకేజీ కలిగిన సింగరేణి ఉద్యోగులందరికీ బీమా వర్తింపు. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత పింఛన్ ఖాతాను యూనియన్ బ్యాంకులోనే కొనసాగించడం ద్వారా 70 ఏళ్ల వరకు ఈ బీమా సదుపాయం అందుతుంది.

లోక్‌సభ ఎన్నికలపై ఫేక్ ప్రచారం:ఈసీ

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతోందని, ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందంటూ వారం రోజులుగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో నెలకొన్న ఆసక్తి దృష్ట్యా.. ఎవరికి వారు ఎన్నికలు అప్పుడు.. ఇప్పుడంటూ తేదీలను సైతం వెల్లడిస్తున్నారు. తాజాగా పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 12న, నామినేషన్ల స్వీకరణ అదే నెల 28 నుంచి చేపడతారని పేర్కొంటూ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. దీనిపై ఎన్నికల సంఘం(ఈసీఐ) సోమవారం ట్విట్టర్ వేదికగా స్పందించింది. 2024 లోక్‌సభ ఎన్నికలపై వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ సందేశాలను షేర్ చేస్తున్నారని, ఈసీఐ ఇప్పటి వరకు షెడ్యూల్ తేదీలు ప్రకటించలేదని అందులో పేర్కొంది. ఎప్పుడైనా సరే.. ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి అందులో ప్రకటిస్తుందని ట్విట్టర్ ద్వారా ఈసీఐ వెల్లడించింది.

రాముడి పేర ఓట్లడుగుతారా?: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 26: ఓట్ల కోసం రాముడి పేరు చెబితే ఆ దేవుడు కూడా సహించడని.. దైవభక్తి మాటల్లో కాదని చేతల్లో చూపాలని బీజేపీ నేతలకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హితవు పలికారు. ఆనాడు త్రేతాయుగంలో శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడిగా, పురుషోత్తముడిగా, ఆడిన మాట తప్పని వాడిగా ప్రజాభిప్రాయాన్ని గౌరవించే విధంగా ఆదర్శ పాలన కొనసాగించారన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిన మోదీకి రాముడితో పోలికనే లేదని విమర్శించారు.

బీఆర్ఎస్ ఆఫీసును తీయించండి

» సీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 26: బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయం.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య వివాదాన్ని రేపుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పక్కనే ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న కారణంతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయాన్ని మరో చోటుకు తరలింపజేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బాలసముద్రం ప్రాంతంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని పక్కపక్కనే నిర్మించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించిన నాయిని రాజేందర్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ కార్యాలయం పక్కనే ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మకాం మార్చారు. అయితే పక్కనే బీఆర్ఎస్ కార్యాలయం ఉండటం, నిత్యం శ్రేణుల రాకపోకలు, పార్టీ కార్యకలాపాలు సాగడం.. తాజా ఎమ్మెల్యే ఆయన క్యాడర్‌కు ఇబ్బందికరంగా మారినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం పోలీస్ కమిషనర్‌ను కలిసి బీఆర్ఎస్ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలింపజేయాలని ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన దాస్యం వినయభాస్కర్ కూడా సీపీని కలిసి.. పార్టీ కార్యాలయం కోసం నాడు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి స్థలం కొనుగోలు చేశామని, ఆఫీసు తరలింపునకు అంగీకరించేది లేదని చెప్పినట్టు సమాచారం.

మద్దతు ధర కోరితే రైతులపై కాల్పులా?: నారాయణ

హైదరాబాద్, కవాడిగూడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పంటలకు కనీస మద్దతు ధర కోరుతూ రైతులు శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తుంటే మోదీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ఆరోపించారు. రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పంజాబ్, హరియాణా రాష్ట్రాల సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో శుభకరణ్ అనే రైతు చనిపోయాడని, దీనికి కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని యూనివర్సిటీల అభివృద్ధికి కృషి

» ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగాల భర్తీ

» త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్: మంత్రి పొంగులేటి

తార్నాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి త్వరలోనే వీసీలతో ప్రభుత్వం సమావేశాన్ని నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం 19 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, త్వరలో మరో 11 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీలో 'తెలంగాణ పునర్నిర్మాణం-అభివృద్ధి దృక్పథాలు' అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సును సోమవారం ప్రారంభమైంది. దీనికి మంత్రి పొంగులేటితోపాటు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీలకు నిధులు కేటాయించకుండా, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు.పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను లీకు చేయించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. అభివృద్ధి, ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేశారన్నారు. ప్రొ.కోదండరాం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డంపెట్టుకుని పదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించిందని మండిపడ్డారు.

హామీలపై చర్చిద్దామా!

(మొదటిపేజీ తరువాయి)

కాగితాలనే తీసుకొచ్చి బీజేపీ వాళ్లు మాట్లాడుతున్నారని, హరీశ్‌రావు మాట్లాడిన తెల్లారి అవే మాటలను పొల్లుపోకుండా కిషన్‌రెడ్డి మాట్లాడతారని విమర్శించారు. వారిద్దరి భాష, భావం, ఆలోచనా విధానంలో ఏమీ తేడా లేదని, ఇద్దరూ కలిసి కాంగ్రెస్ పార్టీపై అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. సోమవారం సింగరేణి కార్మికులకు రూ.కోటి బీమా సౌకర్యం కల్పించే పథకాన్ని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన కీలక సంస్థల్లో సింగరేణి కూడా ఒకటి అని, ఆనాడు ఆర్టీసీ, విద్యుత్తు ఉద్యోగులతోపాటు సకల జనుల సమ్మెలో దేశాన్ని అబ్బురపరిచేలా సింగరేణి కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. కానీ, తెలంగాణ రాష్ట్రం వచ్చాక పదేళ్లపాటు సింగరేణి సంస్థ నిర్లక్ష్యానికి గురయిందన్నారు. ఆ సంస్థ మనుగడలో కీలకమైన బొగ్గు గనులను కేంద్రం అమ్మేసే ప్రయత్నం చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో కుమ్మక్కై ప్రైవేటీకరణకు సహకరించిందని ఆరోపించారు.

నరేంద్రమోదీ హామీలు ఏమయ్యాయి?

"2014, 2019 ఎన్నికల్లో నరేంద్రమోదీ ఇచ్చిన మ్యానిఫెస్టోపై, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడంపై, ప్రతి పేదవాడికీ ఇల్లు, నల్లధనాన్ని తెచ్చి.. ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేసే అంశంతోపాటు ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీపై చర్చిద్దాం. 2014, 2018 తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టో, 2023 ఎన్నికల్లో ఆరు గ్యారంటీలపైనా చర్చిద్దాం. శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చర్చ చేద్దాం. మీరు సిద్ధమా! కిషన్‌రెడ్డి గతంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అప్పటి సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, అభినందించలేదని తెగ బాధపడ్డారు. ఇప్పుడు నేనే మీతో మాట్లాడటానికి ప్రయత్నం చేసిన. ప్రజా సమస్యలపై కలుద్దామని చెబితే.. ఈరోజు దాకా ప్రభుత్వాన్ని కలిసే ప్రయత్నం చేశారా? మేము ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి సమస్యలపై నివేదిక ఇచ్చాం. ఈ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి ఎందుకు సహకరించడంలేదు? నరేంద్ర మోదీని మూడోసారి



ప్రధాని చేయాలంటున్నారు. ప్రధానిని చేసి ఏంచేస్తారు? రైతులను కాల్చిచంపుతారా?

కేంద్రమంత్రిగా తెలంగాణకు ఏం తెచ్చినవ్?

ఐదేళ్ల కేంద్రమంత్రిగా ఉండి.. తెలంగాణకు ఏం తెచ్చినవ్? హైదరాబాద్‌లో వరదలు వచ్చి మునిగిపోతే.. కేంద్రమంత్రిగా ఏం ఇచ్చినవ్? ఏం చూసి మీకు ఎన్నికల్లో ఓటేయాలి. మీకు, కేసీఆర్‌కు ఏం తేడా ఉంది? పదేళ్ల తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ.. ఇద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను ఏదో రకంగా మోసం చేసినవాళ్లే. నష్టం చేసిన వాళ్లే. మీకు మా ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత ఉందా? మేము ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వైద్య ఖర్చుల కింద ఇస్తున్నాం. ఈ నెల 27న రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాలను ప్రారంభిస్తున్నాం. ఈ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించినా ఎందుకు ముఖం చాటేస్తున్నారు? మీకు బాధ్యత లేదు. సింగరేణి కార్మికులకు రూ.కోటి బీమా పథకాన్ని అమలు చేస్తుంటే అభినందించాలన్న ఆలోచన ఎందుకు రావడంలేదు? ఎన్నికల్లో గెలవాలనే దురాశ తప్ప.. మీకు ఏమైనా విచక్షణ ఉందా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ రోజు ఏటా చెల్లించాల్సిన అప్పు రూ.6 వేల కోట్లు. ఆ రోజు మొత్తం అప్పు రూ.72 వేల కోట్లు. ఈరోజు రూ.7 లక్షల కోట్లకు చేరుకుంది. ఏటా రూ.70 వేల కోట్లు అప్పులకే చెల్లించాల్సిన పరిస్థితి. తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో ఉంది. మిగులు రాష్ట్రంగా, రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో పెడితే.. పూర్తిగా దివాళా తీయించారు. ఒక్కో విభాగాన్ని పరిశీలిస్తుంటే.. అసలు ఇంత తొందరగా విధ్వంసం చేసే శక్తి ప్రపంచంలో ఎవరికైనా ఉందా? అనిపిస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించే పరిస్థితి నుంచి 25వ తేదీ దాకా చెల్లించేలా రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అయినా.. మేం బాధ్యతలు స్వీకరించిన మొదటి నెలలో 4వ తేదీన, తర్వాతి నెలలో ఒకటో తేదీన జీతాలు చెల్లించాం. రైతుబంధు చెల్లించలేదంటూ కేటీఆర్, హరీశ్‌రావు పత్రికల్లో, టీవీల్లో నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. ఆర్థిక నియంత్రణ పాటిస్తూ, వచ్చిన ఆదాయాన్ని అన్ని వర్గాలకు పంచుతూ ఎవరికీ ఇబ్బంది, కష్టం కలగకుండా చూస్తున్నాం.

ఉద్యోగాలు నువ్వెందుకు ఇవ్వలేదు?

పదేళ్ల ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. వాళ్ల వదిలేస్తే.. ఒక్కో శాఖలో 60 రోజుల్లో 25 వేల నియామకాలు చేపట్టినం. అంతా తామే వండామని, ఆయన వచ్చి తెడ్డు తిప్పిండని హరీశ్‌రావు అంటున్నాడు. తెడ్డు తిప్పే సన్యాసి.. నువ్వెట్లా పదేళ్ల మంత్రివయ్యావు? అన్నీ నువ్వే చేయొచ్చుకదా! మేమేమైనా ఉద్యోగాలు ఇవ్వొద్దన్నామా? ఇవ్వకపోతే ఏం చేస్తారనే నిర్లక్ష్య ధోరణితో, ఎక్కడికక్కడ గాలికొదిలేస్తే.. ఒక్కో శాఖలో 6900 స్టాఫ్ నర్సుల నియామకం చేశాం. పోలీసు, ఫైర్, ఎక్సైజ్ శాఖల్లో 15 వేల మందికి ఉద్యోగాలిచ్చాం. సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామకాలు చేశాం. గురుకులాల్లో వేలాది మందికి ఉద్యోగాలిచ్చాం. మార్చి 2న మరో 6వేల పైచిలుకు ఉద్యోగాలు ఇవ్వనున్నాం. 70 రోజుల్లో 30 వేల నియామకాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగుల ఆకాంక్ష, ఆందోళనను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. బుర్ర లేకుండా దూలం లాగా పెరిగిండు గానీ.. దూడకు ఉన్న బుద్ధి కూడా హరీశ్‌రావుకు లేదు. నిన్న ఇంకొకాయన (కేటీఆర్) అచ్చంపేటకు పోయి.. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించామంటున్నడు. మీరే తాళాల గుత్తి జగన్‌రెడ్డి చేతిలో పెట్టిండ్రు. మళ్లీ అవే తప్పుడు మాటలు మాట్లాడుకుంట తిరుగుతున్నరు. నీళ్లు, నిధులు, నియామకాల్లో పదేళ్లలో జరిగినంత విధ్వంసం వందేళ్లలో కూడా జరగలేదు. శక్తినంతా కూడదీసుకొని ఆర్థిక పరిస్థితి చక్కదిద్ది, ముందుకు తీసుకెళ్లే పనిలో ఉన్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్తు నిరంతరం..



రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల దాకా ఉచిత కరెంట్ అమలు అనేవి నిరంతరం సాగే ప్రక్రియ అని సీఎం రేవంత్ తెలిపారు. దీనికి తెల్లరేషన్‌కార్డే ప్రామాణికమన్నారు. అయితే రేషన్‌కార్డులు లేనివారికి రేషన్‌కార్డులు కూడా ఇస్తామన్నారు. ఏ కొలబద్ద లేకపోతే.. జాతీయ హైవేకు రైతుబంధు ఇచ్చినట్లే అవుతుందని వ్యాఖ్యానించారు. "ఇప్పటిదాకా రూ.22 వేల కోట్లు రైతుబంధు కింద ఇచ్చారు. లేఅవుట్లు, ఇళ్లు కట్టుకున్న కాలనీలు, రాళ్ల రప్పలు, గుట్టలకు, అనర్హులకు ఇచ్చారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేర్చాలని మేం ముందుకెళుతున్నాం. ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్ రాకుంటే ఆందోళన చెందవద్దు. రానివాళ్లు మండల కార్యాలయాలకు వెళ్లి రేషన్‌కార్డు చూపించి, అమలు కోరవచ్చు. ఫాంహౌస్‌లు ఉన్నవారికి, జూబ్లీహిల్స్‌లో ఉండేవారికి తెల్లరేషన్‌కార్డు ఉంటే రద్దు చేస్తాం" అని సీఎం ప్రకటించారు.

నియోజకవర్గాల్లోనే పోటీ పరీక్షల కోచింగ్..

టీఎస్‌పీఎస్సీ నియామకాలతో నిరుద్యోగుల్లో విశ్వాసం కల్పించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చాం. ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కింద ఎక్కడికక్కడ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నాం. దీనికోసం ప్రజాభవన్‌లో మేధావులతో ఆన్‌లైన్‌లో గ్రూప్-1 కోచింగ్ ఇస్తున్నాం. చదువుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. నియోజకవర్గంలో ఉండేవారికి అక్కడే శిక్షణ ఇస్తాం. తొందర్లలోనే నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్‌లు పెట్టి.. జ్యోతిబా ఫూలే కేంద్రం నుంచి ప్రొఫెసర్లు హరగోపాల్, నాగేశ్వర్‌లతో క్లాసులు చెప్పిస్తాం. కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గాల పరిధిలో డిజిటల్ విద్య కింద క్లాసులు చెప్పించనున్నాం" అని వెల్లడించారు.

ఆస్తులు సృష్టిస్తే ఆదాయమేదీ?

అప్పులు తెచ్చి.. ఆస్తులు సృష్టించామని బీఆర్ఎస్ నేతలు చెప్తారని, మరి.. మిషన్ భగీరథ, కాళేశ్వరం ఆస్తులే అయితే వాటి ద్వారా వచ్చే ఆదాయమేదీ? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిషన్ భగీరథకు రూ.50 వేల కోట్లు అప్పులు తెచ్చి, రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే ఒక్కరూపాయి కూడా ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. అయినా ఆదాయం వస్తున్నట్లు రుణాల కోసం కార్పొరేషన్లు సృష్టిస్తే.. వాటి కింద తీసుకున్న రుణాలు కూడా ఎఫ్ఆర్ బీఎం పరిధిలోకి వస్తాయని కేంద్రం అడ్డుకుంది. తెచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసేదాకా వాస్తవం తెలియలేదు. వ్యవసాయ ఉత్పత్తులు పెరగలేదు. చెరకు, పత్తి, మిర్చి, సోయాబీన్, కందులు అన్నీ పోయాయి. వరి వచ్చింది. వరి వేస్తే ఉరి అని ఆయనే(కేసీఆర్) చెప్పిండు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన సమయంలో 18 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉంటే... ఇప్పుడు 28 లక్షలకు చేరాయి. పదేళ్లలో వర్షాలు బాగా పడి, కాలం కలిసివచ్చి పంటలు పండాయి. వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి" అని సీఎం అన్నారు.

కేటీఆర్ ఔట్‌సోర్సింగ్ పర్సన్..

కేటీఆర్ ఔట్‌సోర్సింగ్ పర్సన్ అని, మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చారని సీఎం రేవంత్ అన్నారు. ఆయన తండ్రి వాళ్ల పార్టీకి అధ్యక్షుడు కావడంవల్లే కేటీఆర్ రాగలిగారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సీఎం అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని ఎన్నికలకు ముందే ప్రకటిస్తే ఆ పార్టీకి 30 సీట్లు కూడా వచ్చేవి కావన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, "నేను పార్టీ అధ్యక్షుడిని. 80 నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్నాను. ఇంకా సీఎం అభ్యర్థిగా ప్రకటించేదేంటి? కేటీఆర్‌ను సీరియస్‌గా తీసుకోను" అని రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చోటుచేసుకున్న కుంభకోణాలన్నీ వెలికితీస్తున్నామని చెప్పారు. గొర్రెల కుంభకోణంలో ఐదుగురిపై కేసులు పెట్టామని, విచారణ ఒక్కరోజులో తేలేది కాదని పేర్కొన్నారు. పది, పదిహేను మందితో నడవాల్సిన మండల కార్యాలయాలు ఒకరిద్దరితో నడుస్తున్నాయని ప్రస్తావించగా.. శాస్త్రీయంగా అధ్యయనం చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పనిచేసే 43 వేల మంది ఉద్యోగులకు రూ.కోటి బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా బీమా అమలు చేస్తామన్నారు. కార్మిక లోకం, సంక్షేమ రాజ్యానికి ఈరోజు చరిత్రాత్మకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, యూబీఐతోపాటు పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు గెలిపించండి



» రాహుల్‌ను ప్రధానిని చేసుకుందాం

» అప్పుడే ప్రజలందరికీ సుఖ, సంతోషాలు

» బీజేపీ 420 పార్టీ.. చీటింగ్ కేసు పెట్టాలి

» వారిది మత రాజకీయం.. మాది ప్రజా రాజకీయం: జగ్గారెడ్డి

» కేటీఆర్ తండ్రి చాటు బిడ్డేనని ఎద్దేవా

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలని, తద్వారా రాహుల్‌గాంధీ ప్రధాని కావడానికి సహకరించాలని తెలంగాణ ప్రజలను టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి కోరారు. రాహుల్ ప్రధాని అయితే తెలంగాణ ప్రజలతో పాటుగా దేశ ప్రజలూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. హైదరాబాద్ ఎంపీ సీటులోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే మైనారిటీలకు మంచి రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్న రాహుల్‌గాంధీ.. ప్రస్తుతం న్యాయ యాత్ర నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. మతాన్ని రాజకీయం చేయడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందని, రాహుల్‌గాంధీ ఎప్పుడూ అలాంటి రాజకీయాలు చేయబోరని అన్నారు. "బీజేపీ పుట్టిన తర్వాతే దేవుళ్లను జనం మొక్కుతున్నట్లుగా ఆ పార్టీ క్రియేట్ చేస్తోంది. . దేవుడి గుడిని కూడా రాజకీయాలకు వాడుకోవాలని చూస్తోంది. ఎంత సేపూ రాముడు, హనుమంతుడు అంటూ ఎమోషన్లు సృష్టిస్తుంది. దేవుడి గురించి మాట్లాడే బీజేపీ నేతలు..పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరల పెరుగుదలపైన ఎందుకు మాట్లాడరు?" అని ప్రశ్నించారు. ధరల పెరుగుదలపై మాట్లాడే ధైర్యం కిషన్‌రెడ్డికి లేదని ధ్వజమెత్తారు. బీజేపీ ఒక 420 పార్టీ అని, ఆ పార్టీ మీద చీటింగ్ కేసు పెట్టాలని అన్నారు. బీజేపీ.. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తుంటే.. రాహుల్‌గాంధీ ప్రజల కోసం రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్దల జేబులు నింపే అజెండా బీజేపీది అని, పేదల కడుపు నింపే ఎజెండా కాంగ్రెస్‌ది అని స్పష్టం చేశారు. రాహుల్‌ను ప్రధానిని చేస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయన్నారు. కాగా.. రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి స్పందించారు. "కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థిని ముందే ప్రకటించే సంప్రదాయం లేదు. పార్టీ గెలిచాక ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే సీఎం ఎంపిక ఉంటుంది. ఈ విషయం తెలంగాణ ప్రజలకు తెలుసు. కేటీఆర్ తండ్రి కేసీఆర్‌కూ తెలుసు. కానీ, కేటీఆర్‌కే ఇంకా తెలిసినట్టు లేదు. కేటీఆర్ ఇంకా తండ్రి చాటు బిడ్డే. మాజీ సీఎం కొడుకు అనే హోదా తప్ప ఆయనకు మరో అర్హత ఉందా?" అని నిలదీశారు.

అలలల కల.. చెల్లాచెదురు..!

24 గంటల్లోనే ముక్కలైన ఫ్లోటింగ్ బ్రిడ్జి.. విశాఖ ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభించిన 24 గంటలకే రెండు ముక్కలైంది. పర్యాటకులకు అందుబాటులోకి రాకముందే సముద్రంలో చెల్లాచెదురైంది. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద ఈ ప్రాజెక్టును చేపట్టింది. కోటి రూపాయల అంచనాతో పనులు ప్రారంభించిన సదరు సంస్థ రూ.1.6 కోట్లు ఖర్చు అయ్యిందని తాజాగా ప్రకటించింది. దీన్ని వైసీపీ నేతలు ఆదివారం ఉదయం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... పర్యాటక అభివృద్ధి కోసమే దీన్ని ఏర్పాటుచేశామని, ఇది తప్పకుండా ప్రజాదరణ పొందుతుందని చెప్పారు. సోమవారం నుంచి పర్యాటకులను కూడా అనుమతిస్తామని కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున ప్రకటించారు. అయితే పర్యాటకులను అనుమతించక ముందే సోమవారం ఆ వంతెన 'టి జంక్షన్ వ్యూ పాయింట్' దూరంగా కొట్టుకుపోయింది. అది మరింత దూరం కొట్టుకుపోకుండా ఆ ప్రాజెక్టు సిబ్బంది దాన్ని అక్కడే లంగరేసి ఉంచారు. ఆ సమయంలో దానిపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పర్యాటకులు ఉండగా అది విడిపోయి ఉంటే పరిస్థితి ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఫ్లోటింగ్ బ్రిడ్జి నుంచి విడిపోయిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్'

పారామెడికల్ కోర్సులు పూర్తయిన వారికి ఉపాధి

ఆస్ట్రేలియా ఆరోగ్యమంత్రితో మంత్రి దామోదర రాజనర్సింహ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మెడికల్, పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియాతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సోమవారం ఆయన గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సండర్సన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారుల బృందంతో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియాలో మెడికల్, పారామెడికల్ హెల్త్ కేర్ రంగాల్లోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో హెల్త్ యూనివర్సిటీ ద్వారా నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని, రాష్ట్రంలో ఏటా మెడికల్, నర్సింగ్ గ్రాడ్యుయేట్లతో పాటు 22,970 మంది పారా మెడికల్ కోర్సులను పూర్తి చేస్తున్నారన్నారు. హైదరాబాద్ మెడికల్ వాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినట్లు చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ పొందినవారు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రజలు వాత పెట్టినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదు..

» రేవంత్ సీఎం కావడం జీర్ణించుకోలేకపోతున్నారు

» ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి ఆగ్రహం

» ఆనాడే రేవంత్ కాబోయే ముఖ్యమంత్రని ప్రకటిస్తే బీఆర్ఎస్‌కు 3 సీట్లు వచ్చేవి కావు: మల్లు రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా మాజీ మంత్రి కేటీఆర్‌కు బుద్ధి రాలేదని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. తన ఉనికిని కాపాడుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతు బిడ్డ రేవంత్‌రెడ్డి.. రాష్ట్రానికి సీఎం కావడాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ఆనాడు రేవంత్‌రెడ్డే కాబోయే సీఎం అని ముందే ప్రకటించి ఉంటే.. కాంగ్రెస్‌కు వంద సీట్లు వచ్చుండేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని గుర్తించే.. ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని, అయినా కేటీఆర్ అహంకారం తగ్గలేదన్నారు. మరోసారి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడితే తాట తీస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేకపోతున్న కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. ఎన్నికలప్పుడే కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి అంటూ అధిష్ఠానం ముందే ప్రకటించి ఉన్నట్లయితే బీఆర్ఎస్ 3 సీట్లు కూడా రాకపోయి ఉండేవని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. కేటీఆర్ విమర్శల్లో పసలేదని, అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా ఆయన మాట్లాడుతున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. సీఎం అభ్యర్థిగా రేవంత్‌ను ముందే ప్రకటించి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు కూడా చిత్తుగా ఓడిపోయేవారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు.

మోదీ, షాల ముద్దుబిడ్డ కేసీఆర్:అద్దంకి

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలకు కేసీఆర్ ముద్దుబిడ్డ అని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ విమర్శించారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ పాత్ర కూడా ఉందని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం అవినీతిపై కేంద్రంలోని బీజేపీ సర్కారు కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేదని, కనీసం ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి రోజుకో కొత్త డ్రామా ఆడుతున్నాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న 'మహాలక్ష్మి' పథకం విజయవంతమైందనడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖే నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. 'రద్దీ పెరిగిన నేపథ్యంలో 2 వేల బస్సుల్ని కొనాలంటూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. మంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి ఉచిత సలహా ఎప్పుడైనా ఆయన మామ కేసీఆర్‌కు ఇచ్చారా?' అంటూ ప్రశ్నించారు

ఖమ్మం ఎంపీగా పోటీచేసి తీరుతా: వీహెచ్



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి తీరుతానని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. ఆ నియోజకవర్గంలో తాను చాలా ఏళ్లుగా పని చేస్తున్నానని, ఖమ్మం ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలూ చేశానని చెప్పారు. ఖమ్మం నుంచి పోటీ చేయాలంటూ అక్కడి పార్టీ క్యాడర్ కూడా తనను అడుగుతోందన్నారు. పార్టీ కోసం తనకంటే కష్టపడ్డవాళ్లు ఎవరని, దేశంలో తనకంటే ఎక్కువగా తిరిగే నాయకులున్నారా.. అని ప్రశ్నించారు. ఏం తప్పు చేశానని తనను పక్కన పెట్టారని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వాళ్లు టికెట్లడిగితే తనలాంటి సీనియర్ల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ తనకు అన్యాయం జరిగిందని.. అయితే తనకు సీఎం రేవంత్‌రెడ్డిపైన నమ్మకముందని చెప్పారు.

మాది ఎంప్లాయీ ఫ్రెండ్లీ సర్కారు

- ఉద్యోగుల సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు: మంత్రి సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ అడవులపైనే ఆధారపడి ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం ఆమె అటవీశాఖపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే ప్రభుత్వమని, అధికారులు, సిబ్బంది తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కష్టసుఖాలు తనకు తెలుసన్నారు. అయితే, ప్రతి అటవీ అధికారి కుటుంబంతో సహా పని చేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలన్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో పులుల మరణం తనను కలచివేసిందని, మళ్లీ అలాంటి ఘటనలు జరగకూడదని హెచ్చరించారు. స్మగ్లర్లపై కఠిన చర్యల కోసం పీడీ యాక్ట్ పెట్టేందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని అటవీ అధికారులకు సూచించారు.

సందీప్ శాండిల్యకు డీజీగా పదోన్నతి

- ముగ్గురు ఐపీఎస్‌ల బదిలీ

సీనియర్ ఐపీఎస్ అధికారి, 1993 బ్యాచ్‌కు చెందిన సందీప్ శాండిల్యకు ప్రభుత్వం డీజీగా పదోన్నతి కల్పించింది. అలాగే మరో ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అదనపు సీపీగా పనిచేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్‌ను ఆర్గనైజేషన్ ఐజీగా బదిలీ చేశారు. ఇటీవలే ఐజీగా పదోన్నతి పొందిన 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ హైదరాబాద్ సిటీ అడిషనల్ సీపీ(క్రైం) నుంచి మల్టీజోన్-1 ఐజీగా బదిలీ అయ్యారు. హైదరాబాద్ సిటీ సెంట్రల్ జోన్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న 2016 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శరత్ చంద్ర పవార్‌ను యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా బదిలీ చేశారు.

సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారులకు రెగ్యులర్ పోస్టులు

ఇన్‌చార్జి అధికారులుగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారులకు ప్రభుత్వం పూర్తి బాధ్యతలను(రెగ్యులర్ పోస్టులు) అప్పగించింది. 1990 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన మోహన్ చంద్ర పర్గేయిన్‌కు చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ పీసీసీఎఫ్‌గా.. 1991 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సువర్ణకు హరిత హారం, కంపా పీసీసీఎఫ్‌గా, కంపా సీఈవోగా.. 1996 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సునీతా భగవత్‌కు అడిషనల్ పీసీసీఎఫ్(అడ్మిన్)గా పూర్తి బాధ్యతలు (రెగ్యులర్ పోస్టులు) అప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మరో ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులు శాంతారాం, రాంబాబు, సునీల్ హిరిమత్ ఈ ముగ్గురు అధికారులకు సూపర్ టైం స్కేల్ వేతనం వర్తించేందుకు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ర్యాంకుకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



అణుశక్తి కార్యదర్శి మహంతిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌కు ఉత్తమ నిర్వహణ అవార్డు

అశ్వాపురం, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లా మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌కు 2022-23 సంవత్సరానికిగాను అణుశక్తి విభాగంలో ఉత్తమ నిర్వహణ అవార్డు లభించింది. హెవీ వాటర్ డే సందర్భంగా సోమవారం ముంబయిలోని అణుశక్తి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో అణుశక్తి విభాగం కార్యదర్శి ఏకే మహంతి, ఎన్‌పీసీఎల్ సీఎండీ బీసీ పాఠక్ ఈ అవార్డును ప్లాంట్ జీఎం జగ్గారావుకు అందజేశారు. వరుసగా రెండోసారి మణుగూరు ప్లాంట్‌కు ఈ అవార్డు దక్కటం విశేషం. కాగా దేశంలోనే మొదటిసారి మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌లో వైద్య రంగంలో ప్రధాన భూమిక వహించే ఆక్సిజన్-18 ప్లాంట్ నిర్మితం కావటం, భారజల ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగుల భద్రత తదితర రంగాల్లో ప్లాంట్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

7న ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోంశాఖ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్చి 7న ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించనున్నట్టు ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశానికి హాజరుకావాలని రెండు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఏపీ భవన్ విభజనపై ఇప్పటికే రెండు రాష్ట్రాలు దాదాపు అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు ఏపీ ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.50 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. 19.781 ఎకరాల్లో భవన్ ఆస్తులు, భవనాలు ఉన్నాయి. ఏపీ భవన్ కింద ఉన్న మొత్తం 19.781 ఎకరాల్లో గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌ను ఆనుకొని ఉన్న దుకాణాలు, దుకాణాల మధ్య ఉన్న రహదారి 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్‌లో ఉన్న 3.359 ఎకరాలు, పటౌడి హౌజ్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా.. అలాగే శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడి హౌజ్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదనలు చేసింది.

నేడు, రేపు గురుకుల టీజీటీ అభ్యర్థుల వెరిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లోని ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాలను గురుకుల బోర్డు మంగళ, బుధవారాల్లో పరిశీలించనుంది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బంజారాహిల్స్‌లోని బంజారా, ఆదివాసీ భవన్‌లలో నిర్వహించనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

ఆ గేట్లు మావే.. మరమ్మతు చేసుకుంటాం


- నాగార్జున సాగర్ డ్యామ్‌పై అనుమతివ్వండి..!
- కృష్ణా యాజమాన్య బోర్డుకు ఆంధ్రప్రదేశ్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ డ్యామ్‌కు సంబంధించి తెలంగాణ చేపట్టిన నిర్వహణ (మెయింటెనెన్స్) పనులపై ఇటీవల అభ్యంతరం వ్యక్తం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కొత్త మెలిక పెట్టింది. ఏపీ వైపున ఉన్న 13 గేట్లు తమవేనని, వాటి పరిధిలో మరమ్మతులను చేసుకుంటామని అంటోంది. దీనికి అనుమతివ్వాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను కోరింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ సోమవారం లేఖ రాసింది. కుడి కాల్వ హెడ్ రెగ్యులేటరీని ఆపరేట్ చేసేందుకు మార్చి 1 నుంచి ఇంజనీరింగ్ అధికారులు, సహాయక సిబ్బందిని అనుమతించేలా సీఆర్పీఎఫ్‌కు ఆదేశాలివ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై చర్చించడానికి త్వరలోనే ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశాన్ని నిర్వహించి, నిర్ణయం తీసుకోవాలని బోర్డు యోచిస్తున్నట్లు సమాచారం. కాగా, తెలంగాణ ఏర్పాటు అనంతరం తాత్కాలిక ఒప్పందం మేరకు సాగర్ డ్యామ్ నిర్వహణను తెలంగాణ, శ్రీశైలం డ్యామ్ నిర్వహణను ఏపీ చూడాల్సి ఉంది.

గృహజ్యోతి, మహాలక్ష్మికి నేడే శ్రీకారం

200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు, రూ.500కు గ్యాస్‌సిలిండర్ అమలు నేడే

- సీఎం రేవంత్ చేతులమీదుగా చేవెళ్లలో ప్రారంభించి సభకు ఏర్పాట్లు
- స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదలవడంతో వేదిక మార్పు
- పథకాల ప్రారంభం సచివాలయంలోనే!
- షెడ్యూలు ప్రకారమే భారీ బహిరంగ సభ
- ప్రియాంకా గాంధీ రాష్ట్ర పర్యటన రద్దు



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు వాగ్దానాల్లో మరో రెండింటిని అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమయింది. అర్హులైన గృహవినియోగదారులకు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్‌ను అందించే 'గృహజ్యోతి' పథకాన్ని, రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను ఇచ్చే 'మహాలక్ష్మి' పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో ప్రారంభించనున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ప్రారంభించి, మంగళవారం సాయంత్రం లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. కానీ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. సోమవారం రాత్రి నుంచి అక్కడ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పథకాల ప్రారంభోత్సవాన్ని సచివాలయానికి మార్చారు. ఈమేరకు సెక్రటేరియట్‌లో రెండు పథకాలనూ ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చేవెళ్లకు బయల్దేరి వెళ్లి బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరుకావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆమె పర్యటన రద్దయింది. అయితే ఆమె వర్చువల్ విధానంలో ఢిల్లీ నుంచి ప్రసంగించనున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. గృహజ్యోతి పథకానికి సంబంధించి లబ్ధిదారులు మార్చిలో జీరో బిల్లును అందుకోనున్నారు. తొలుత ఈ పథకం అమలు కోసం కర్ణాటక తరహాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని భావించినా.. తర్వాత ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఫిబ్రవరి నెలలో 200 యూనిట్లలోపు వినియోగించి, తెల్లరేషన్‌కార్డు ఉండి... ప్రజాపాలన కింద దరఖాస్తు చేసుకున్న వారికి మార్చిలో జీరో బిల్లు జారీ చేయనున్నారు. ఇంటి యజమానులతో పాటు అద్దెకు ఉండేవారికి కూడా ఈ పథకం అమలు కానుంది. అయితే అద్దెదారులు ఇంటిని ఖాళీ చేయగానే.. సంబంధిత సెక్షన్(ఏఈ పరిధిలో ఉండే) ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం(ఈఆర్‌వో) కార్యాలయంలో తెల్ల రేషన్‌కార్డుతో పాటు కొత్తగా ఏ ఇంట్లో అద్దెకు దిగారో ఆ ఇంటి కరెంట్ కనెక్షన్ (యూనిక్ సర్వీస్ నెంబర్) వివరాలను అందించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం అమల్లోకి తేనుంది. ప్రస్తుతం ఎప్పుడో జారీ చేసిన తెల్ల రేషన్ కార్డులు ఉండటంతో.. కొత్తగా మళ్లీ తెల్లకార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త కార్డులు అందుకునేవారు తమ ఇంటి కనెక్షన్ నెంబర్, తెల్లకార్డుతో పాటు ఆధార్‌కార్డును జతచేస్తే ఈ పథకం అమలు చేయనున్నారు. సంబంధిత తహసీల్దార్/ఎంపీడీవో/ఈఆర్‌వో కార్యాలయాల్లో పథకం అమలుకు చర్య తీసుకోనున్నారు.

సిలిండర్ బిల్లు చెల్లించాకే..

మహాలక్ష్మి పథకానికి ఇప్పటివరకు సుమారు 40 లక్షల మంది లబ్ధిదారులను ఎంపికచేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఆహారభద్రతకార్డు (రేషన్ కార్డు)లో పేర్లు నమోదై... వంటగ్యాస్ కనెక్షన్ ఉన్న మహిళలకు ఈ పథకం వర్తించనుంది. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా.. వాటిని కలిగి ఉన్నవారిలో వంటగ్యాస్ కనెక్షన్ ఉన్నవారు 64 లక్షల మంది. ఆ గ్యాస్ కనెక్షన్ నెంబరు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్, ఆహార భద్రత కార్డు నంబరు.. అన్నీ పక్కాగా ఉన్న 40 లక్షల మందిని లబ్ధిదారులుగా ఎంపికచేశారు. ఇదిలాఉండగా.. గ్యాస్ సబ్సిడీ ఎలా ఇవ్వాలనే అంశంపై కొద్ది రోజు లుగా జరుగుతున్న తర్జనభర్జనలు ఒక కొలిక్కి వచ్చాయి. మహాలక్ష్మి పథకంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి రూ. 500 చొప్పున నగదు తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మిగిలిన సబ్సిడీ మొత్తాన్ని(రూ. 415 నుంచి రూ. 455 వరకు) తీసుకోవడానికి.. కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడిచే 'ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు(ఓఎంసీలు) అంగీకరించలేదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలుచేస్తున్న సాఫ్ట్‌వేర్‌ను ఒక రాష్ట్రంకోసం మార్చటం సాధ్యంకాదని తేల్చిచెప్పడంతో.. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ చెల్లింపు విధానాన్ని మార్చేసింది. 'మహాలక్ష్మి' లబ్ధిదారులు తొలుత గ్యాస్ సిలిండర్ మొత్తం ధర చెల్లించి రీఫిల్ తీసుకోవాలని, ఆ తర్వాత సబ్సిడీ సొమ్ము ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఓఎంసీలకు ముందుస్తుగా కొంత సొమ్ము అడ్వాన్స్‌గా చెల్లించాలని నిర్ణయించి మూడు రోజుల క్రితం రూ. 80 కోట్లు విడుదలచేసింది. ఈ నిధులను గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు సబ్సిడీ సొమ్ము చెల్లించటానికి వినియోగిస్తారు. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.955 ఉండగా.. ఈ మొత్తాన్ని లబ్ధిదారుడు చెల్లించి సిలిండర్ తీసుకోవాలి. ఇందులో రూ.500 పోగా మిగిలిన రూ.455ను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. కేంద్రం ఇప్పటికే నామమాత్రంగా రూ.40 సబ్సిడీ ఇస్తోంది కాబట్టి.. ఒకవేళ దాన్ని కూడా కలుపుకొంటే రూ.415 చొప్పున నగదు బదిలీ చేస్తారు.

ఉజ్వల పథకంలో లబ్ధిదారులుగా ఉన్నవారికి కూడా 'మహాలక్ష్మి' పథకాన్ని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉజ్వల లబ్ధిదారులకు రూ.340 చొప్పున కేంద్రం నుంచి సబ్సిడీ వస్తోంది. వారు రూ.615 చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి మరో రూ.115 సబ్సిడీ ఇచ్చి.. రూ.500కే సిలిండర్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉజ్వల లబ్ధిదారులు రాష్ట్రంలో 11.58 లక్షల మంది ఉన్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల దగ్గర

వారికి కూడా..

నగదు బదిలీ(డీబీటీ)కి సంబంధించిన ఏర్పాట్లు ఉన్నాయి. ఓఎంసీల ద్వారానే కేంద్రం సబ్సిడీ మొత్తాన్ని బదిలీ చేయిస్తున్నారు. ఈమేరకు ఎంపికచేసిన 40 లక్షల మంది లబ్ధిదారుల జాబితాను కూడా ఓఎంసీలకు ప్రభుత్వం అందించింది. లబ్ధిదారులకు సిలిండర్ డెలివరీ చేయగానే.. స్వల్ప వ్యవధిలో సబ్సిడీ సొమ్ము వారి ఖాతాల్లో జమవుతుంది. కాగా మూడేళ్ల సగటును ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారుల వార్షిక కోటాను ప్రభుత్వం నిర్ణయిస్తుండటం గమనార్హం.

తొలివిడతలో 33.8 లక్షల మందికి..

రాష్ట్రవ్యాప్తంగా రెండు డిస్కమ్‌ల పరిధిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే కనెక్షన్లు 95,23,433 ఉన్నాయి. ఒక వ్యక్తి ఒకటికి మించి కనెక్షన్లు కలిగి.. ఆ కనెక్షన్లన్నీ అతనే వాడితే, అందులో ఒకటే కనెక్షన్‌కు ఉచిత విద్యుత్ ప్రయోజనం కలుగనుంది. ఇక ఒక వ్యక్తి ఒకటికి మించి కనెక్షన్లు కలిగి ఉన్నా.. ఆయా గదుల్లో అద్దెకున్నవారికి ఆహారభద్రత(రేషన్) కార్డులు /ఆధార్ నంబర్ ఉంటే వారికి కూడా ఉచిత విద్యుత్ ప్రయోజనం దక్కనుంది. కాగా.. ఈ పథకాల కోసం ప్రజాపాలనలో 1,09,01,255 దరఖాస్తులు రాగా... అందులో ఆధార్ నంబర్‌తోపాటు, రేషన్‌కార్డు, యునిక్ సర్వీస్ కనెక్షన్ నంబర్లు పొందుపరిచిన దరఖాస్తులు 34,59,585 ఉన్నాయి. వాటిలో వాణిజ్య కనెక్షన్లను చిట్టాను తొలగించగా.. తొలి విడతలో 33.8 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నట్లు ప్రభుత్వం లెక్కలు కట్టింది.

ఇసుక విక్రయాలకు సమగ్ర విధానం

రూపొందించాలని సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక విక్రయాలపై సమగ్ర విధానాన్ని రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వే-బిల్లులతోపాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వవద్దని అన్నారు. నిబంధనల్ని ఉల్లంఘించినందుకు పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. విధించిన జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి, తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలేంటో తెలియజేయాలని, దానిపై నివేదిక సమర్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ)తోపాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలున్నాయని అన్నారు. వారిని వెంటనే బదిలీ చేయాలని ఆదేశించారు. సోమవారం వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు-భూగర్భ వనరుల శాఖలపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికిగాను ఆయా రాబడుల శాఖలకు నిర్దేశించిన పన్ను వసూళ్లను సాధించాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని అధికారులను ప్రశ్నించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకు పైగా రాష్ట్రానికి విడుదల చేసేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు రావడం లేదని అధికారులు తెలిపారు.

మద్యం వాహనాలకు జీపీఎస్ అమర్చాలి..

పొరుగు రాష్ట్రాల నుంచి 'నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్)' రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కల్లో తేడాలుంటున్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి డిస్టిలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి, వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం కూడా ఉండాలని అన్నారు. ఎన్‌డీపీఎల్‌తోపాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కాగా, రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంగా.. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీఎం.. ఆదాయాన్ని తెచ్చిపెట్టే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



జీనోమ్ వ్యాలీలోని భారత్ బయోటెక్ కార్యాలయం ముందు ఫార్మా కంపెనీల ప్రతినిధులు

జీనోమ్ వ్యాలీ అద్భుతం

ఫార్మా రంగానికి హైదరాబాద్ అత్యంత అనుకూలం

- ఫార్మా కంపెనీల ప్రతినిధుల ప్రశంస
- నేటి నుంచి బయో ఆసియా సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా షామీర్‌పేటలో 3 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న జీనోమ్ వ్యాలీ ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అత్యంత అనుకూలంగా ఉందని వివిధ దేశాలకు చెందిన ఫార్మా కంపెనీల ప్రతినిధులు ప్రశంసించారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బయో ఆసియా-2024 సదస్సులో పాల్గొనేందుకు సోమవారం హైదరాబాద్ చేరుకున్న వారు జీనోమ్ వ్యాలీని సందర్శించారు. అక్కడ ఉన్న ప్రముఖ ఫార్మా కంపెనీలు భారత్ బయోటెక్, బయోలాజికల్-ఈ, సాయి లైఫ్ సైన్సెస్ కార్యాలయాలను సందర్శించారు. కంపెనీలకు ప్రభుత్వం కల్పించిన వసతులను పరిశీలించారు. ఫార్మా కంపెనీలన్నీ ఒకేచోట ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో 1999లో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేసినట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ఇక్కడి వ్యాక్సిన్ దాదాపు 200 దేశాలకు ఎగుమతి అవుతోందని, ప్రపంచ వ్యాక్సిన్ రంగంలో తెలంగాణ వాటా మూడో వంతు ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు చెందిన 200 మంది ప్రతినిధులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. జీనోమ్ వ్యాలీలోని ల్యాబ్‌లు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తున్న 'బయో ఆసియా' అంతర్జాతీయ సదస్సు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. బయోటెక్, బయోఫార్మా రంగాల అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానించి, పెట్టుబడులు పెట్టేందుకు ఇక్కడ ఉన్న అనువైన వాతావరణం గురించి తెలపాలన్న లక్ష్యంతో బయో ఆసియా నిర్వహణను ఉమ్మడి రాష్ట్రంలో 20 సంవత్సరాల క్రితం ప్రారంభించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాతా ప్రతి ఏటా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆతిథ్యం ఇస్తున్న 21వ సదస్సును మంగళవారం ఉదయం 10 గంటలకు హెచ్ఐసీసీలో సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. అమెరికాకు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెన్జా సదస్సుకు ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. అమెరికా కేంద్రంగా 125 దేశాలకు విస్తరించిన ప్రముఖ అంతర్జాతీయ ఫార్మా కంపెనీ ఎలి లిల్లీ సీఈవో డేవిడ్ రిక్స్, ప్రపంచంలో అతిపెద్ద ఫార్మా కంపెనీ బ్రిస్టల్ మేయర్స్ స్కిబ్ సీఈవో డాక్టర్ క్రిస్టోఫర్ బోర్నర్ కీలకోపన్యాసం చేయనున్నారు. 50 దేశాలకు చెందిన 800 కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొంటున్నారు. 'డేటా అండ్ ఏఐ-రీడిఫైనింగ్ పాసిబిలిటీస్'ను ఈ ఏడాది సదస్సు థీమ్‌గా నిర్ణయించారు. ఈ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

తెలంగాణ నుంచి పోటీ చేయండి!

రాహుల్‌ను కోరిన సీఎం రేవంత్? .. ఖమ్మం, నల్లగొండ, భువనగిరిలో ఒకటి ఎంచుకోవాలని ప్రతిపాదన

- గత ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ స్థానం నుంచి ఎన్నికైన రాహుల్
- ఆ స్థానం కోసం మిత్రపక్షం ఒత్తిడి
- అక్కడ సీపీఐ కూడా పోటీకి నిర్ణయం
- ప్రత్యామ్నాయ సీటు కోసం అన్వేషణ



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని సీఎం రేవంత్ రెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి సీట్లలో ఒకటి ఎంచుకోవాలని ఆయన వద్ద ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. వాస్తవానికి సోనియా గాంధీనే తెలంగాణ నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలో దించేందుకు ప్రయత్నాలు జరిగాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆమెను కలిసి తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరారు. వీలు కాని పక్షంలో తెలంగాణ నుంచి రాజ్యసభ సీటునూ ఆఫర్ చేశారు. అయితే తదనంతర పరిణామాల్లో ఆమె రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ ఎపిసోడ్ ముగిసిందని భావిస్తున్న తరుణంలో తెలంగాణ నుంచి పోటీ చేయాలని రాహుల్‌ను రేవంత్ కోరడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ నుంచి రాహుల్ పోటీ చేస్తే దక్షిణాదిలో ఇండియా కూటమి పార్టీలకూ ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సోనియాకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేకుంటే తెలంగాణ ఇచ్చిన క్రెడిట్‌తో రాష్ట్రం నుంచి రాజ్యసభకైనా వెళ్లేందుకు అవకాశం ఉన్నా రాజస్థాన్ నుంచి ఎన్నికయ్యారు. తెలంగాణ నుంచి రాహుల్‌ను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దించాలని నిర్ణయించిన పక్షంలో తల్లీకొడుకులు ఇద్దరూ ఒకే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న పేరు రావద్దనే ఆమెను రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎంపిక చేశారన్న ప్రచారమూ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఏది ఏమైనా తెలంగాణ నుంచి పోటీ ప్రతిపాదనను రాహుల్ అంగీకరిస్తే గాంధీ కుటుంబం నుంచి ఈ ప్రాంతంలో పోటీ చేయనున్న రెండో నేత కానున్నారు. గతంలో మెదక్ సీటు నుంచి ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే. కాగా, భువనగిరి, మెదక్, ఖమ్మం, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల గురించి కాంగ్రెస్ ఢిల్లీ నేతలు ఆరా తీసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఉత్తరప్రదేశ్ లోని అమేథీ నుంచే కాకుండా తెలంగాణ నుంచి పోటీ చేసే అవకాశాలను రాహుల్ పరిశీలిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

వయనాడ్‌లో ఇలా..

ప్రస్తుతం రాహుల్ కేరళలోని వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన అమేథీతో పాటు తొలిసారి వయనాడ్‌లో కూడా పోటీ చేశారు. అమేథీలో బీజేపీ నాయకురాలు, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ చేతుల్లో ఓడిపోగా, వయనాడ్‌లో ఘన విజయం సాధించారు. కాగా, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు ప్రస్తుతం రెండు లోక్‌సభ సీట్లు ఉండగా, ఈసారి మూడు సీట్లు కావాలని డిమాండ్ చేస్తోంది. వయనాడ్‌లో అత్యధిక సంఖ్యలో ముస్లిం ఓటర్లున్న రీత్యా తమ అభ్యర్థిని నిలబెట్టాలని ఐయూఎంఎల్ భావిస్తోంది. మరోవైపు కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు ప్రత్యర్థి అయిన సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూడా వయనాడ్‌లో పోటీ చేయాలని నిర్ణయించింది. ఈ స్థానానికి ఎల్డీఎఫ్ భాగస్వామ్య పార్టీ అయిన సీపీఐ ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించింది. అక్కడ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య అనీ రాజా పోటీ చేయనున్నారు. ఒక ప్రధాన నేత భార్య పోటీలో ఉండగా తాను కూడా అక్కడి నుంచే పోటీకి దిగడం మంచిది కాదని రాహుల్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వయనాడ్‌కు గుడ్‌బై చెప్పి దక్షిణాదిన మరో సురక్షిత స్థానం కోసం అన్వేషిస్తున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక నుంచి పోటీ చేసే అవకాశాలను కూడా ఆయన పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లో చేరికల జోరు..!

హస్తం కండువా కప్పుకున్న తీగల, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్

- 'ఆర్మూర్' వైస్ చైర్మన్ సహా 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లూ..
- బాన్సువాడ పట్టణాధ్యక్షుడితోపాటు నలుగురు కౌన్సిలర్లు సైతం..



దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

హైదరాబాద్/మహేశ్వరం/నిజామాబాద్/బాన్సువాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లోకి చేరికలు జోరందుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు ఆయన కోడలు, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో తనను రాజకీయంగా అణగదొక్కి, అవమానించారన్నారు. తీవ్ర మనస్తాపంతో ఉన్న తనను సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని, ఆ మేరకు కాంగ్రెస్‌లో చేరానన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నానని.. తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా క్యాబినెట్ హోదా ఉన్న తనకు నాలుగేళ్లుగా బీఆర్ఎస్‌లో కనీస గౌరవం ఇవ్వలేదని అనితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఆర్మూర్ మునిసిపల్ వైస్ చైర్మన్ సహా 16 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఆర్మూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన పండిట్ వినీతపై నెల రోజుల క్రితం బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా..

ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్..

ఆ తీర్మానం నెగ్గింది. ఇంకా ఏడాది పదవీకాలం ఉండడంతో.. ఆయా కౌన్సిలర్లతో కాంగ్రెస్ నేతలు ఇటీవల జరిపిన మంతనాలు ఫలించాయి. ఆర్మూర్ మునిసిపాలిటీకి ప్రస్తుతం చైర్మన్ ఎవరూ లేరు. కొత్త చైర్మన్ ఎంపిక కావాలంటే 24 మంది కౌన్సిలర్లు కావాలి. కాంగ్రెస్‌లో చేరితే చైర్మన్ ఎంపికకు మార్గం సుగమం కానుండటంతో 16 మంది చేరారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుని కొత్త చైర్మన్ ఎంపికకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ కౌన్సిలరే మునిసిపల్ చైర్మన్‌గా ఎంపిక కానున్నారు. ఇటు బాన్సువాడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాత బాలకృష్ణ నలుగురు కౌన్సిలర్లతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

షాజహాన్ అరెస్టుపై స్టే లేదు: కలకత్తా హైకోర్టు

కోల్‌కతా, ఫిబ్రవరి 26: సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక వేధింపులు, భూములు లాక్కున్న వ్యవహారంలో తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ అరెస్టుపై తాము ఎలాంటి స్టే ఇవ్వలేదని కలకత్తా హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. కేసులో అతడు నిందితుడైనందున వెంటనే అరెస్టు చేయాలని అధికారులకు సూచించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల కారణంగానే షాజహాన్‌ను అరెస్టు చేయడం లేదని టీఎంసీ జనరల్ సెక్రెటరీ అభిషేక్ బెనర్జీ ఇటీవల చెప్పారు. ఈ నేపథ్యంలోనే కోర్టు సోమవారం స్పష్టతనిచ్చింది. షేక్ షాజహాన్‌ను 7 రోజుల్లోగా అరెస్టు చేస్తామని టీఎంసీ సీనియర్ నేత కునాల్ ఘోష్ చెప్పారు. సోమవారం హైకోర్టు అరెస్టుపై స్పష్టత ఇచ్చిన వెంటనే ఆయన ఈ ప్రకటన చేశారు. మరోవైపు, భూములు లాక్కున్నారన్న ఆరోపణలతోనే పశ్చిమ బెంగాల్ పోలీసులు సోమవారం మరో టీఎంసీ నేత అజిత్ మైతీని అరెస్టు చేశారు. అజిత్ షాజహాన్‌కు అత్యంత సన్నిహితుడు.

కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు... ఏడోసారీ బేఖాతరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీ సీఎం, 'ఆప్' కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఏడోసారీ ఈడీ సమన్లను బేఖాతరు చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ అంశంపై కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఈడీ వరుసగా సమన్లు జారీ చేస్తోంది. తాజాగా సోమవారం తమ ముందు హాజరు కావాలని కోరగా కేజ్రీవాల్ వెళ్లలేదు. కోర్టు ఆదేశిస్తే ఈడీ ముందు హాజరవుతానని తెలిపారు. ఏ విషయం కోర్టు నిర్ణయించే దాకా ఆగలేరా అని ఈడీని ప్రశ్నించారు. తనపై ఒత్తిడి తెచ్చి, ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చేలా చేసేందుకే పదే పదే సమన్లు జారీ చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో పొత్తును తెంచుకునేది లేదన్నారు. ఇదిలా ఉండగా, బీజేపీ ఐటీ సెల్‌ను విమర్శిస్తూ జర్మనీలో ఉంటున్న యూట్యూబర్ ధ్రువ్ రాఠీ చేసిన ట్వీట్‌ను రీ-ట్వీట్ చేయడం తప్పేనని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో అంగీకరించారు. రాఠీ 9నెలల క్రితం ఎక్స్‌లో పెట్టిన పోస్టును కేజ్రీవాల్ రీట్వీట్ చేయడం పరువు నష్టం కలిగించే చర్య అని పేర్కొంటూ వికాస్ సాంకృత్యాయాన్ దావా వేశారు.

బాల్య వివాహాలు జరగనివ్వను: హిమంత

గువాహటి, ఫిబ్రవరి 26: తాను బతికున్నంత కాలం అసోంలో బాల్య వివాహాలు జరగనివ్వబోనని సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు. ముస్లిం ఆడపిల్లల జీవితాలను కాంగ్రెస్సే నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. 2026లోపు బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలిస్తామని సోమవారం అసెంబ్లీలో శపథం చేశారు. బ్రిటిష్ కాలం నాటి అసోం ముస్లిం వివాహాలు, విడాకుల నమోదు చట్టాన్ని రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపడంపై మండిపడుతూ కాంగ్రెస్, ఆలిండియా డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై హిమంత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ముస్లిం ఆడపిల్లల జీవితాలను నాశనం చేయడానికి మీరు (కాంగ్రెస్) తెరిచిన దుకాణాన్ని పూర్తిగా మూసివేసే వరకు శాంతించేది లేదు. 18 ఏళ్ల లోపు అమ్మాయికి పెళ్లి చేయలేరు. అలాగే తలాక్ చెప్పడం కూడా అంత సులువు కాదు. ముస్లింలకు మేం వ్యతిరేకమని కొందరు అంటున్నారు.. అయితే ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వం, బాల్య వివాహాలకు స్వస్తి పలికి ముస్లిం మహిళా సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయనంత మేలును చేశాం..' అని చెప్పారు.

యూపీ రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఆర్‌ఎల్‌డీ ఓటు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం రాజ్యసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రంలో చివరి నిమిషం మార్పులు చోటుచేసుకున్నాయి. మొత్తం పది స్థానాలకుగానూ ఎనిమిదింటిని అధికార బీజేపీ దక్కించుకునే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ 8వ అభ్యర్థికి ఓటు వేసేందుకు రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌ఎల్‌డీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. బీజేపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి ఏడుగురు అభ్యర్థులే సునాయాసంగా గెలిచేందుకు అవకాశం ఉంది. మిత్రపక్షాలైన నిషాద్ పార్టీ, అప్నాదళ్ తో పాటు రాష్ట్రీయ లోక్‌దళ్ కూడా ముందుకు రావడంతో 8వ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంజయ్ సేథ్ గెలిచే అవకాశాలు కనపడుతున్నాయి. బీజేపీ ఏర్పాటు చేసిన శిక్షణ సదస్సులో ఈ పార్టీల ఎమ్మెల్యేలందరూ పాల్గొని వ్యూహరచన చేయడం గమనార్హం. పది రాజ్యసభ సీట్లకుగాను బీజేపీ ఏడుగురు, సమాజ్‌వాదీ పార్టీ ముగ్గురు అభ్యర్థులను నిలబెట్టాల్సి ఉండగా, కమలనాథులు ఎనిమిదో అభ్యర్థిని రంగంలోకి దింపారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి ఫిరాయించిన పారిశ్రామిక వేత్త సంజయ్ సేథ్‌ను బీజేపీ ఎనిమిదో అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ కూర్పు సార్వత్రిక ఎన్నికల సమయంలో రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తుందని అంటున్నారు.

జూన్ నుంచి మూడోస్సారి..!

బీజేపీకి 370 లోక్‌సభ స్థానాలు ఖాయం.. ఎన్డీయేకి 400 పైనే.. మోదీ ధీమా

- 2 వేల రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వీటి విలువ రూ.41 వేల కోట్లు


'భారత్ టెక్స్'లో చేనేత పనిని గమనిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: లోక్‌సభ ఎన్నికల అనంతరం వచ్చే జూన్ నుంచి తన ప్రభుత్వం వరుసగా మూడోసారి కూడా కొలువు తీరుతుందని ప్రధాని మోదీ అన్నారు. దేశం నాడిని తాను పసిగట్టగలనని.. 543 స్థానాల లోక్‌సభలో బీజేపీ సొంతంగా 370 సీట్లు సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయేకి 400కిపైగా స్థానాలు వస్తాయన్నారు. దేశవ్యాప్తంగా రూ.41 వేల కోట్ల విలువ చేసే 2 వేల రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన సోమవారం ఇక్కడి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చాక చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని.. వెయ్యేళ్ల భారతానికి పునాదులు వేస్తామని ప్రధాని ప్రకటించారు. గత పదేళ్లుగా నవభారత నిర్మాణాన్ని ప్రజలు తిలకిస్తున్నారని.. వందే భారత్ రైళ్ల ప్రారంభం సహా రైల్వే శాఖ రూపురేఖలే మారిపోయాయని.. శరవేగంతో ప్రాజెక్టులు నిర్మించడం అందరినీ విస్మయపరుస్తోందని తెలిపారు. యువత కలలను నెరవేర్చడమే తన సంకల్పమన్నారు. 'భారత్ ఇప్పుడు పెద్ద పెద్ద కలలు కంటోంది. తన కలలు నెరవేర్చుకోవడానికి రాత్రింబగళ్లూ శ్రమిస్తోంది. యువత కలలు.. కఠోర కృషి.. నా సంకల్పం.. వికసిత భారతానికి ఇదే గ్యారెంటీ' అని స్పష్టం చేశారు. గత రెండ్రోజుల్లో జమ్ము, గుజరాత్‌లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 12 ఐఐటీలు, ఐఐఎంలు, ఐదు ఎయిమ్స్‌లు జాతికి అంకితం చేశానన్నారు. రైల్వే శాఖ పూర్తిగా పరివర్తన చెందుతోంది. స్కూళ్లు కాలేజీల్లో చదివేవారికి, 35 ఏళ్ల లోపు వయస్కులకు ఇది లబ్ధి చేకూరుస్తుంది' అని చెప్పారు. 27 రాష్ట్రాలు, 300 జిల్లాల్లోని 554 రైల్వే స్టేషన్లను అమృత భారత్ స్టేషన్లుగా మలిచేందుకు ఆయన శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన పలు రైల్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జిలను ప్రారంభించారు. '2047: వికసిత్ భారత్ కీ రైల్వే' థీమ్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా చేపట్టిన పోటీల్లో పాల్గొన్న యువతను ఆయన అభినందించారు. 'ప్రజాధనం దోపిడీని నా ప్రభుత్వం అరికట్టింది, ప్రతి పైసాను రైల్వే సేవల విస్తరణకు ఉపయోగిస్తున్నాం. భారతీయ రైల్వే గతంలో రాజకీయాలకు బలైంది. ఇప్పుడు సౌకర్యవంతమైన ప్రయాణానికి, ఉపాధి కల్పనకు అతిపెద్ద వనరుగా మారింది. రాబోయే అమృత్ భారత్ స్టేషన్లు భారతీయ సంస్కృతికి, అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తాయి' అని తెలిపారు. కాగా.. ఈ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్టేషన్లలో ఫుట్-ఓవర్ బ్రిడ్జిలు, విశాల విశ్రాంతిస్థలాలు, రిసెప్షన్లు ఉంటాయి.

'మధ్య తరగతి'లో జోక్యం ఇష్టపడను

ప్రభుత్వం అనేది ఎప్పుడూ పేద ప్రజల పక్షాన ఉండాలని.. మరీ ముఖ్యంగా మధ్య తరగతి వారి జీవనంలో జోక్యం చేసుకోవడం తనకు ఇష్టం ఉండదని ప్రధాని మోదీ అన్నారు. సర్కారు ప్రమేయం అత్యంత తక్కువ స్థాయిలో ఉండే సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని.. పదేళ్లుగా ఆ దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో భారత్ టెక్స్-24ను ఆయన ప్రారంభించారు. దేశంలోనే అతి పెద్దదైన ఈ టెక్స్‌టైల్ ప్రదర్శన నాలుగు రోజులు కొనసాగనుంది. వందకు పైగా దేశాలకు చెందిన 3 వేల మంది కొనుగోలుదారులు, 3,500 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వస్త్ర పరిశ్రమ రంగం అత్యంత కీలకమైనదని, దీనిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'కస్తూరి కాటన్' ప్రపంచ మార్కెట్లో భారత బ్రాండ్‌గా నిలిచిపోతుందన్నారు.

కోటి సలహాలతో బీజేపీ మ్యానిఫెస్టో

ప్రజల నుంచి కనీసం ఒక కోటి సలహాలు తీసుకొని ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందు కోసం 'వికసిత్ భారత్ మోదీ కీ గ్యారెంటీ' పేరుతో వీడియో వ్యాన్లను దేశ వ్యాప్తంగా ప్రజల వద్దకు పంపనుంది. ఈ వ్యాన్లను సోమవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు .నడ్డా జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ 'సంకల్ప్ పత్ర్ (మేనిఫెస్టో) కోసం దేశ వ్యాప్తంగా సలహాలు స్వీకరిస్తామని చెప్పారు.



జామా మసీదు షాహీ ఇమాం వారసుడిగా షాబాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీలోని ప్రఖ్యాత జామా మసీదు నిర్వహణ బాధ్యతలు చూసే షాహీ ఇమాం సయ్యద్ అహ్మద్ బుఖారీ తన వారసుడ్ని ప్రకటించారు. తన కుమారుడైన సయ్యద్ షాబాన్ బుఖారీ (29)కి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు వెల్లడించారు. తన మరణం తరువాత జామా మసీదుకు 14వ షాహీ ఇమాంగా వ్యవహరిస్తారని ప్రకటించారు. వారసత్వ ప్రకటనలో భాగంగా సోమవారం మసీదు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో షాబాన్‌బుఖారీకి 'దస్తర్ బందీ'(తలపాగా ధారణ) ఉత్సవాన్ని నిర్వహించారు.

రైలెక్కాలంటే సూటే కావాలా?

మెట్రోలో రైతుకు అవమానంపై నెటిజన్ల ఫైర్



బెంగళూరు, ఫిబ్రవరి 26: ఈయన ఓ వృద్ధ రైతు. ప్రయాణం నిమిత్తం నమ్మ మెట్రోకు అనుబంధమైన బెంగళూరు రాజాజీనగర్ మెట్రోస్టేషన్‌కు సోమవారం వచ్చాడు. అయితే, అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి ఈయన వేషధారణ నచ్చలేదు. మాసిపోయిన దుస్తులు వేసుకుని వచ్చాడని స్టేషన్‌లోకి వెళ్లేందుకు అనుమతించకుండా అడ్డుకుని అవమానించారు. ఈ దృశ్యాలను ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. మెట్రో అధికారులపై నెటిజన్లు విరుచుకుపడ్డారు. వీఐపీలు, సూటుబూటుతో వచ్చేవారే మెట్రోలో ప్రయాణించాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన అరగంటలోనే విషయం పాకిపోవడంతో వెంటనే మెట్రో ఉన్నతాధికారులు స్పందించారు. రాజాజీనగర్ మెట్రోస్టేషన్ సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు.

అగ్నిపథ్‌ను రద్దు చేస్తాం


- మేం గెలిస్తే పాత పద్ధతిలోనే జవాన్ల భర్తీ
- అగ్నిపథ్‌తో యువత భవిష్యత్తు అంధకారం
- కాంగ్రెస్ పార్టీ ప్రకటన.. రాష్ట్రపతికి ఖర్గే లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి రాగానే అగ్నిపథ్ విధానాన్ని రద్దుచేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అగ్నిపథ్ వల్ల సైన్యంలో చేరాలనుకున్న యువత భవిష్యత్తు అంధకారం అవుతోందని విమర్శించింది. అగ్నిపథ్‌పై యువత ఆవేదనను పట్టించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరింది. ఈ మేరకు ఆ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సోమవారం రాష్ట్రపతికి లేఖ రాశారు. గతంలో జవాన్లను శాశ్వత ప్రాతిపదికన నియమించేవారు. ఈ విధానానికి మోదీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం స్వస్తి పలికింది. అగ్నిపథ్ విధానంలో సర్వీసులో చేరేవారు కేవలం నాలుగేళ్లు మాత్రమే సేవలు అందిస్తారు. ఆ తర్వాత వారిలో అత్యధిక మంది కాంట్రాక్టు ముగుస్తుంది. ఎక్కువమందిని సైన్యంలోకి తీసుకోవడానికి వీలుగా అగ్నిపథ్‌కు కేంద్రం రూపకల్పన చేసింది. ఖర్గే లేఖ రాసిన కొద్ది గంటల్లోనే కాంగ్రెస్ యువ నేతలు సచిన్ పైలట్, దీపేందర్ హుడా కూడా దీనిపై ప్రకటన చేశారు. అగ్నిపథ్.. రాజకీయ స్వార్థంతో కేవలం జవాన్లపై పెడుతున్న ఖర్చును మిగుల్చుకోడానికి తెచ్చిన పథకమని సచిన్ పైలట్ విమర్శించారు. సైన్యాన్ని బలహీనపరిచే పథకం ఇదన్నారు. "ప్రభుత్వం రూ.4,100 కోట్లు జీ-20 సదస్సు కోసం ఖర్చుపెట్టింది. ప్రధాన మంత్రి విమానంపై రూ.4,800 కోట్లు వ్యయం చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టు (కొత్త పార్లమెంటు భవనం) కోసం రూ.20వేల కోట్లు, వాణిజ్య ప్రకటనలపై రూ.6500 కోట్లు ఖర్చుచేశారు. మరోవైపు డబ్బులు మిగుల్చుకోవడం కోసం మొత్తంగా సైనిక భర్తీనే గందరగోళంలోకి నెట్టారు. దేశ రక్షణను సమస్యల్లో పడేశారు" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 60 నుంచి 65వేలమంది దాకా సైన్యంలో భర్తీ అయ్యేవారని, అగ్నిపథ్ అమల్లోకి వచ్చాక గత ఏడాది కేవలం 45వేలమంది మాత్రమే భర్తీ అయ్యారన్నారు. ఇప్పటికైనా పాత పద్ధతిలోకి మారకపోతే రాబోయే పదేళ్లలో సైన్యం పరిమాణం 14 లక్షల నుంచి 8 లక్షలకు పడిపోతుందని హుడా తెలిపారు. 'ఒక ర్యాంకు- ఒక పెన్షన్' హామీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. చివరకు 'నో ర్యాంకు-నో పెన్షన్' అన్నట్టు పరిస్థితి మార్చివేసిందని విమర్శించారు. నాలుగేళ్ల సర్వీసు తర్వాత అగ్నివీరులు ఎక్కడకు వెళ్లాలని, పెన్షన్ లేకుండా వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. కాంట్రాక్టు ముగియగానే అగ్నివీరులను బీజేపీ కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులుగా పెట్టుకుంటామని బీజేపీ నేత కైలాస్ విజయ్‌వర్గీయ చేసిన వ్యాఖ్యలను హుడా ఖండించారు. కాగా, అగ్నిపథ్‌తో 2లక్షల మంది యువతీ, యువకుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని రాష్ట్రపతికి రాసిన లేఖలో ఖర్గే తెలిపారు. 2019-22 మధ్యకాలంలో వీరంతా సాయుధ దళాల్లో ప్రవేశానికి కావాల్సిన అన్ని పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారన్నారు. అగ్నిపథ్ స్కీంతో వీరి కలలు చెదిరిపోయాయని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జ్ఞానవాపిలో పూజలు కొనసాగించుకోవచ్చు

- వారాణసీ జిల్లా కోర్టు తీర్పుకు అలహాబాద్ హైకోర్టు సమర్థన
- మసీదు కమిటీ పిటిషన్ల కొట్టివేత



ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 26: ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీలో ఉన్న జ్ఞానవాపి మసీదు దక్షిణ సెల్లార్‌లోని హిందూ దేవతా విగ్రహాలకు పూజలు కొనసాగించుకోవచ్చని అలహాబాద్ హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. జ్ఞానవాపిలో పూజలు చేసుకోవచ్చంటూ జనవరి 31న వారాణసీ జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ దాఖలు చేసిన రెండు పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ తీర్పు వెలువరించారు. కాశీ విశ్వనాథుని ఆలయం పక్కనే ఉన్న మసీదులోని వ్యాస్ తెహ్ఖానాలో పూజలు కొనసాగించుకోవచ్చని పేర్కొన్నారు. "ఇరు పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న మీదట, కేసుకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన తర్వాత జిల్లా కోర్టు జనవరి 17న ఇచ్చిన తీర్పు(ఆస్తుల రిసీవర్‌గా మేజిస్ట్రేట్‌ను నియమించడం)లోను, అదేవిధంగా జనవరి 31న పూజలు నిర్వహించుకునేలా ఇచ్చిన తీర్పులోనూ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని భావిస్తున్నాం" అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. అయితే, ఎలాంటి పిటిషన్ వేయకుండానే జనవరి 31న తీర్పు ఇచ్చారన్న ముస్లిం వర్గాల వాదనలపై స్పందిస్తూ.. జనవరి 17న దాఖలు చేసిన పిటిషన్‌లోనే ఉభయ పక్షాల ప్రార్థనలకు అనుమతి కోరారని, జనవరి 31న దీనిని కోర్టు ఆదేశాల్లో పేర్కొంటూ సీపీసీ సెక్షన్లు 151/152 మేరకు సవరణ చేశారని తెలిపారు. అంతేకాదు, దిగువకోర్టు న్యాయాధికారి జారీ చేసిన ఉత్తర్వులను సంబంధిత అధికారి జనవరిలో చివరి పనిదినంనాడు ఆమోదించారన్న కారణాన్ని తోసిపుచ్చారు. ఇప్పటికే పూజలు ప్రారంభమై జరుగుతున్నాయని, వీటిని నిలువరించేందుకు ఎలాంటి కారణం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ నెల 15నే ఈ కేసుకు సంబంధించి ఇరు పక్షాల వాదనలు పూర్తయినా తీర్పును రిజర్వ్ చేసి.. తాజాగా సోమవారం మొత్తం 54 పేజీలతో కూడిన తీర్పును వెలువరించారు. 1993లో యూపీలో అప్పటి ములాయం సింగ్ యాదవ్ ప్రభుత్వం ఎలాంటి లిఖిత ఆదేశాలు లేకుండా జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు నిలిపివేయడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఇదిలావుంటే, ఈ నెల 2నే జిల్లా కోర్టు తీర్పుపై మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, వారి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీంతో మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, తాజా తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని కమిటీ తెలిపింది.

పాలస్తీనా ప్రధాని రాజీనామా


మహమ్మద్ షెతెయె

జెరూసలేం, ఫిబ్రవరి 26: వెస్ట్‌బ్యాంక్ నుంచి పాలన సాగిస్తున్న పాలస్తీనా అథారిటీ ప్రధాన మంత్రి మహమ్మద్ షెతెయె సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు సమర్పించారు. అయితే.. దీనిపై అధ్యక్షుడు ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాలస్తీనాకు కొత్త అథారిటీ ఏర్పాటయ్యేదాకా షెతెయెను ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగేలా అధ్యక్షుడు కోరే అవకాశాలున్నాయి. పాలస్తీనా ప్రభుత్వ రాజీనామాకు అమెరికా రెండు నెలలుగా చేస్తున్న ఒత్తిడి ఫలించడంతో.. విభిన్న రాజకీయపక్షాలతో కొత్త అథారిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సిన్వర్ సహా.. హమాస్ అగ్రనేతలు కూడా ఇదివరకే గాజాలో పాలస్తీనా అథారిటీ పాలనకు అంగీకారం తెలిపిన నేపథ్యంలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపు పలికే అవకాశాలున్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. రంజాన్ ప్రారంభం(మార్చి 11)లోగా యుద్ధానికి ముగింపు పలకాలని ఈజిప్ట్, ఖతార్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు.

ఉజ్బెక్‌స్థాన్‌లో భారతీయునికి 20 ఏళ్ల జైలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఉజ్బెక్‌స్థాన్‌లో ఓ భారతీయునకు సోమవారం అక్కడి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కల్తీ దగ్గు మందు సరఫరా చేసి 68 మంది పిల్లల మరణానికి కారకుడయ్యారన్న కారణంతో ఈ శిక్ష వేసింది. ఆ మందును ఉత్తరప్రదేశ్‌లోని మారియన్ బయోటెక్ సంస్థ తయారు చేసింది. ఉజ్బెక్‌స్థాన్‌లో క్యూరామాక్స్ మెడికల్ సంస్థ పంపిణీ చేసింది. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాఘవేంద్ర ప్రతాప్ సింగ్‌కే అత్యధికంగా 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో మొత్తం 23 మందికి శిక్షలు పడగా అవి రెండేళ్ల నుంచి 20 ఏళ్ల మధ్యన ఉన్నాయి. మరణించిన పిల్లల కుటుంబాలకు ఒక బిలియన్ ఉజ్బెక్ సోమ్స్ (రూ.67 లక్షలు) వంతున చెల్లించాలని కూడా ఆదేశించింది. ఆ మందు కారణంగా వైకల్యం పాలైన నలుగురు చిన్నారులకు ఇంతే పరిహారం ఇవ్వాలని, ఏడుగురు ముద్దాయిల నుంచి ఆ సొమ్మును వసూలు చేయాలని సూచించింది.

చంద్రుడిపై నిద్ర లేచిన స్లిమ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: 'సూర్యుడు ఉదయించే భూమి'గా జపాన్‌కు పేరుంది. ఇప్పుడు ఆ సూర్యుడే చంద్రుడిపైనా ఆ దేశానికి సహకరించాడు. నిద్రావస్థలోకి వెళ్లిపోయి.. ఇక పనిచేస్తుందో లేదో తెలియని స్థితిలో ఉన్న మూన్ ల్యాండర్ 'స్లిమ్'పై తనకిరణాలను ప్రసరింపచేసి దాన్ని మేల్కొలిపాడు. దీంతో ఇటీవల చంద్రుడిపైకి పంపిన తమ 'స్లిమ్' జాబిల్లిపై రెండు వారాలపాటు కఠినమైన చంద్రరాత్రిని తట్టుకుని తిరిగి ప్రాణం పోసుకుందని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ ఏజెన్సీ (జాక్సా) తెలిపింది. ఆదివారం రాత్రి స్లిమ్‌కు తాము ఒక కమాండ్‌ను పంపితే దానికి స్పందన వచ్చిందని సోమవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. గత నెల 19న చంద్రుడిపై దిగే క్రమంలో సాంకేతిక సమస్యల వల్ల స్లిమ్ యాంగిల్ మారింది. దీంతో దానిలోని సోలార్ ప్యానెల్స్ సూర్యకిరణాలను అందుకోలేకపోయాయి. ఆ తర్వాత సూర్యుడి కోణం మారడంతో రెండు రోజులపాటు జీవం పోసుకున్న స్లిమ్ తన హై-స్పైక్ కెమెరాను ఉపయోగించి కొన్ని ఫొటోలు తీసి భూమికి చేరవేసింది. కానీ, ఆ తర్వాత చంద్రరాత్రి మొదలు కావడంతో.. నిద్రాణస్థితిలోకి జారుకుంది. కాగా, సూర్యకిరణాలు పడే యాంగిల్ మారి.. స్లిమ్‌లోని బ్యాటరీ మళ్లీ చార్జ్ అవడం వల్లే ల్యాండర్ తిరిగి మేలుకొని అద్భుతం జరిగిందని జాక్సా తెలిపింది.

కృత్రిమ మేధతో పిండం వయసు నిర్ధారణ

- ఏఐ నమూనాను అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: గర్భిణీ స్త్రీల కడుపులోని పిండం వయస్సును కచ్చితంగా నిర్ధారించే కృత్రిమ మేధ నమూనాను ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. భారత్ తరఫున ఈ తరహా ఏఐ మోడల్‌ను రూపొందించడం ఇదే తొలిసారి. గర్భిణుల సంరక్షణకు, ప్రసవ తేదీలను కచ్చితంగా నిర్ణయించడానికి సరైన 'గర్భధారణ వయస్సు' (గెస్టేషనల్ ఏజ్) అవసరం. 'గర్భిణి-జీఏ2'గా పిలిచే ఈ ఏఐ నమూనాను భారత జనాభా డేటాను ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఇది పిండం వయస్సును కచ్చితంగా అంచనా వేస్తుందని, దీనివల్ల తప్పులు జరిగే అవకాశాలు మూడు రెట్లు తగ్గుతాయని అధికారులు తెలిపారు. అలాగే ఈ జీఏ2 మోడల్‌తో ప్రసూతి వైద్యులు మెరుగైన సంరక్షణ అందించేందుకు వీలవుతుందని.. తద్వారా భారత్‌లో మాతా శిశు మరణాల రేటు తగ్గుతుందని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 27 ఫిబ్రవరి 2024

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. లైఫ్ సైన్సెస్, మోడ్రన్ బయోటెక్నాలజీ అంశాలకు సంబంధించిన ల్యాబొరేటరీ ట్రెయినింగ్‌తో కోర్సును రూపొందించారు. మొదటి ఏడాది ల్యాబొరేటరీ ప్రయోగాలతోపాటు క్లాస్ రూమ్ టీచింగ్ ఉంటుంది. రెండో ఏడాది రీసెర్చ్ ల్యాబొరేటరీలో వర్క్ చేయాల్సి ఉంటుంది. మాస్టర్స్ డిజర్టేషన్ కూడా సబ్మిట్ చేయాలి. అభ్యర్థి ప్రతిభను పరిశీలించి పీహెచ్‌డీ థీసిస్ వర్క్, రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. మొదటి రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గ్యాట్ బీ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశాల్లో అభ్యర్థి అవగాహన, ఆసక్తి, అచీవ్‌మెంట్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులందరికీ ఆర్‌సీబీ రామచంద్రన్ డీబీటీ ఫెలోషిప్ ఇస్తారు. దీని కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000 చెల్లిస్తారు. తరవాత అభ్యర్థులు సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/డీబీటీ నుంచి జూనియర్/సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందాల్సి ఉంటుంది. వీరికి జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.37,000; ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. విదేశీ అభ్యర్థులకు మాత్రం నిబంధనల ప్రకారం ఆర్‌సీబీ-డీబీటీ ఇంటర్నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in



ఇన్సూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతోపాటు జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, రీ-ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

వెయిటేజీ: పదోతరగతి మార్కులకు 2 శాతం, ఇంటర్ మార్కులకు 3 శాతం, డిగ్రీ మార్కులకు 5 శాతం, జాతీయ పరీక్ష స్కోర్‌కు 50 శాతం, జీడీ స్కోర్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, ఏడాదికి మించిన అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ సెంటర్లు:** పుణె, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రధాన నగరాలు
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.



1. ఓసీటీటీ-మెటలర్జీ: **57 పోస్టులు**
2. ఓసీటీటీ - ఎలక్ట్రికల్: **64 పోస్టులు**
3. ఓసీటీటీ- మెకానికల్: **100 పోస్టులు**
4. ఓసీటీటీ-సివిల్: **22 పోస్టులు**
5. ఓసీటీటీ-కెమికల్: **18 పోస్టులు**

మొత్తం ఖాళీలు: 324

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు మెటలర్జీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, కెమికల్, సిరామిక్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు సంబంధించి ఏదో ఒక దానిలో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్స్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక విధానం: రాత పరీక్ష ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఫీజు: రూ.500, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.200.
పరీక్ష కేంద్రాలు: దేశంలోని ప్రధాన నగరాల్లో
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18
వెబ్‌సైట్: https://sail.co.in/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఇండియన్ నేవీ దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ - జనవరి 25

బ్రాంచి వివరాలు

1. జనరల్ సర్వీస్: **50 పోస్టులు**
2. పైలెట్: **20 పోస్టులు**
3. నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: **18 పోస్టులు**
4. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: **8 పోస్టులు**
5. లాజిస్టిక్స్: **30 పోస్టులు**
6. నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: **10 పోస్టులు**
7. ఎడ్యుకేషన్: **18 పోస్టులు**
8. ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **30 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **50 పోస్టులు**
10. నావల్ కన్‌స్ట్రక్టర్: **20 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100, ఇతర అలవెన్సులు
ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ హిస్టరీ

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రధుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలంలోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేధ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావాదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగబద్ర రాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరస్ (గ్రీకు రాజైన అంటియోకిడాస్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే.. పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారతదేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేధయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేధయాగాలు చేసినట్లు రాసి ఉంది.

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు..

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సార్‌నాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్థూపంపై అజాతశత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్‌ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం...దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్దమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.


జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

లిటిల్స్



జరిగేది మంచికే

అనగనగా ఒక రాజు. మంచివాడు. దృఢ సంకల్పం ఉన్నవాడు. అయితే అతనికి యుద్ధ విద్యలు రావు. దీంతో అతని మీద అతనికే తక్కువ అంచనా ఉండేది. అయితే అతని రాజ్యం సంపదల కొలువు. ప్రజలంతా సుభిక్షంగా ఉండేవారు. మంచి, చెప్పినా చెడు చెప్పినా ఒకటే విధంగా తీసుకుంటాడు. అందుకే చాలా మంది ఆయన్ని భజన చేసేవారు. అంతా అద్భుతం అనేవారు. ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడేవారు కాదు. తనకు జవాబుగా చెబితే జైల్లో పెట్టించేవాడు. అడ్డం మాట్లాడితే అంతే సంగతులు. అందుకే రాజుగారికి అసలు విషయం అసలే తెలిసేది కాదు.


ఒక రోజు రాజుగారు సాయంత్రం పూట చల్లని గాలికి కోటలో కూర్చుని ఉన్నారు. విపరీతమైన గాలి వచ్చింది. ఆ గాలిని తలుపులు వేగంగా కొట్టుకున్నాయి. తన మందిరంలోకి ఎవరూ రావద్దనేది రాజుగారి ఆదేశం కాబట్టి ఎవరూ వెళ్లలేదు. ఒక వాకిలి గాలికి వేగంగా కొట్టుకుంటే వేయబోయాడు. పొరబాటున ఆ తలుపు మధ్యలో పడి మూడో వేలు విరిగిపోయింది. వెంటనే విలవిలలాడిపోయాడు రాజుగారు. గట్టిగా అరిచాడు. వెంటనే రాజ వైద్యుడు వచ్చి ఆ వేలుకు కట్టు కట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఇక ఈ వేలు ఇంతే రాజావారు అన్నారు వైద్యుడు. 'జరిగింది మంచికే రాజా.. ఏం చేస్తాం' అన్నాడు మంత్రి. ఏమాత్రం ఆలోచించకుండా 'ఇతన్ని చెరసాలలో వేయండి' అన్నాడు. వెంటనే ఆ మంత్రిగారు ఖైదీ అయ్యారు. 'నాకు జరిగింది మంచిదే' అంటాడా అని కోప్పడ్డాడు. ఎవరూ అడ్డు చెప్పలేదు. మంత్రిగారు ఖైదీగా తిండి తింటున్నారు.



ఒక రోజు రాజుగారు వేటకు వెళ్లారు. ఆ వేటలో సింహాన్ని వేటాడాలని అనుకున్నాడు. సింహం దొరకలేదు. కోయలు ఏనుగుల కోసం వేసిన గుంతలో పడబోయిన గుర్రం తప్పించుకుంది. రాజుగారు పడిపోయారు. దూరంగా సైన్యం. క్షణాల్లో కోయలు ఆ రాజుగారిని పట్టుకెళ్లారు. అసలే అడవి జనాలు. అడవిలో ఓ భూత వైద్యుడు 'ఆరోగ్యవంతమైన రాజుగారిని బలి ఇస్తే మీకు మంచి జరుగుతుంది' అని చెప్పాడట. అందుకే రాజుగారిని బలి ఇవ్వాలని అడవి వాళ్లు పట్టుకెళ్లారు. తీరా మాట్లాడుతుంటే విరిగిన వేలు కనపడింది. 'అపశకునం' అని ఆ రాజుగారిని వదిలేశారు.. ఆ అడవి జనాలు.

రాజుగారు చచ్చిబతికి దూరంగా పారిపోయాడు. భటులు చూశారు. రాజ్యానికి తీసుకెళ్లారు. హుటాహుటిన మంత్రిగారిని వదిలేయండి అన్నారు. మంత్రిగారికి అర్థం కాలేదు. 'మీరు మంచి చేశారు. మీలాంటి యోగులు మా రాజ్యంలో ఉండటం అదృష్టం. దయచేసి ఇక మీద తప్పు చేయను. మీరే మా సలహాదారులు. ఈ రోజు నుంచి నాకు నిజాలు చెప్పండి. అబద్ధాలు చెప్పకండి. భజనలు వద్దు. విషయం చెప్పండి' అంటూ రాజుగారు అన్నారు. 'ఇదీ మంచిదే' అన్నాడు మంత్రి. రాజుగారు నవ్వారు గట్టిగా.

5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 240

		7						
9	4					1		
			5		4		9	
				7	9		8	4
		3				2		
4	8		1	6				
	1		8		3			
		8					3	2
						6		

సుడోకు - 239 సమాధానం

6	5	8	7	2	9	1	4	3
9	4	2	3	5	1	6	8	7
3	1	7	4	6	8	5	2	9
2	6	1	5	7	3	4	9	8
7	9	4	8	1	6	2	3	5
8	3	5	9	4	2	7	1	6
4	8	6	2	9	7	3	5	1
5	7	9	1	3	4	8	6	2
1	2	3	6	8	5	9	7	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.